జూన్ 16-30, 2022
సంపుటి 02, సంచిక 15

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక

నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం
సీహెచ్ కొండూరు గ్రామంలో రాజ్యలక్ష్మీ సమేత
శీ లక్ష్మి నృసింహ స్వామి వారి నూతన ఆలయంలో ఘనంగా
లోహమయ,శిలామయ విగ్రహాల, ధ్వజస్తంభ ప్రతిష్టాపన...





**దర్శనం మొగులయ్య 12 మెట్ల కిన్నెర కళాకారుడు.**
**ఆయన 52 దేశాల ప్రతినిధుల ముందు తన 12 మెట్ల కిన్నెర గానంతో ప్రదర్శలను ఇచ్చాడు.**
**మొగులయ్య జీవిత చరిత్ర ఎనిమిదవ తరగతి సాంఘిక శాస్త్రంలో పాఠ్యాంశంగా ఉంది.**
**ఆయన తెలంగాణ ఆవిర్భావం తరువాత 2015లో ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా**
**ఉగాది విశిష్ట పురస్కారాన్ని అందుకున్నాడు. భారత ప్రభుత్వం 2022లో పద్మశ్రీ పురస్కారాన్ని అందించింది.**
**తెలంగాణ గర్వించదగ్గ గొప్ప కళారూపాన్ని కాపాడుతున్న మొగులయ్యకు హైదరాబాదు నగరంలో**
**ఇంటిస్థలం, ఆ స్థలంలో ఇల్లు కట్టుకోవడినికి కోటి రూపాయల సాయం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు.**

*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 3rd Floor, Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

## ఈ సంచికలో




02 జీవన సంహారకమైన భూతాపాన్ని వివరించిన... **వల్లభాపురం...** **"పర్యావరణాన్ని కాపాడుకో"** కవిత



13 నేరస్థుల తల్లిదండ్రుల్ని కూడా శిక్షించాలనే **నెల్లుట్ల రమాదేవి....** **"గంజాయి వనం"** కథ..



00 ముప్పా శ్రీనివాసరావును సమగ్రంగా ఆవిష్కరించిన **వెల్దండి** వ్యాసం... **"ముప్పల సవ్వడి"...**



45 గుడికంటే బడి గొప్పదని తెలిపిన కథ... యాకమ్మ **"విగ్రహం"**



17 అపార్థం చేసుకునే యువకులకు కళ్ళు తెరిపించిన **గాజోజు...** **"మబ్బులు వీడిన ఆకాశం"** కథ



19 **చాసర్ కథా కథనం**లోని సామాజికత వివరించిన వ్యాసం...



21 డాలర్ విలువ తెలిసిన సంతానం తండ్రిని అనాథను చేసిన వైనం చిత్రించిన **కటుకోజ్వల....** **"సుపుత్రులు"** కథ



00 ప్రాచీన, ఆర్వాచీన సాహితీ కళశోధది చందురుడు **గంగ్ర లక్ష్మణ్ రావుతో** **నంది శ్రీనివాస్** ముచ్చట...

నాటి జంటకవులలో **భట్టుపల్లి కవుల**ను పరిచయం చేసిన **వేదార్థం మధుసూదన శర్మ....** పేజీ 09

మగ తోడేళ్ళ కోరికల కాలనాగుని చిత్రించిన కోటం కవిత... **తోడేలు తోడైంది....** పేజీ 16

ఇష్టంలేని వివాహం నుండి తప్పించుకోవడానికి ఓ యువకుని నాటకం **బదనపల్లి గంగారాం** నాటికథ... **'మంగళంలో అమంగళం'...** పేజీ 05

గాలి పురి కొసలపైన పిడికిళ్ళు బిగించి చెబుతున్న కవిత.... **'సమాధానం'** **డా॥ చెమన్...**పేజీ 27

**ఆదిత్య హృదయం** ఆధునికీకరణ వివరించిన **ఏనుగు నరసింహారెడ్డి....**పేజీ 15

డా॥ కపిలవాయి లింగమూర్తి గ్రంథ పరిచయం చేసిన వెంకట్ కుమార్ ......పేజీ 25

ఆకుపచ్చ సందమామ చుట్టూ పసిడి కాంతుల రైతుల్ని చూసే **భీంపల్లి** కవిత.... **'మట్టి మనిషి'** ....పేజీ 37

**ఇంకా...** మరెన్నో కవితలు, సాహితీ శిఖరం, సమాజం, పుస్తక పరిచయం, స్వీకారం.. మొదలైనవి...

కవిత

# సవరణల పర్వం...

వర్ఝుల శివకుమార్, 94418 83210



సరిగమకాలు దిద్దేసుకున్నం
కొత్తరాగాలతో గొంతు సవరించుకున్నం
ఇంకా ఏ పేజీలతో పేచీలేదు.
నిర్వచనోత్తర భారతంలో
ఇది సవరణల పర్వం

ఎలాగైనా భుజంమీంచి భారాన్ని
దించేసుకోవడం
పాలనకు ప్రత్యామ్నాయమైంది.
అంటు గట్టుకున్న మాటలను
దులిపేసుకోవడం
రాజనీతి విధానమైంది
పూటకొకటైన ఏషాల్ని
ఒలిచేసుకోవడం
పగటి నాటకాల పాలసీ అయింది.
స్వావలంబనకు
మూసివేత తారక మంత్రమైంది.

ఇంక దార్లూ
రైలు పట్టాలూ రైళ్లూ
ప్లాట్ ఫారాలూ స్టేషన్‌లూ
అన్నీ అద్దె సౌకర్యాలే
ప్రతిదీ రాబట్టుకునే రాచమార్గమే
ఇహలోకం టు పరలోకం
ప్రీ పెయిడ్ ఆఫర్లు
వేరియంట్ల కొద్దీ భయం
వెన్నుపాములో చలి
అకాల వర్షం ఘోరకలి

ఊగిసలాటలో ఎవుసం ఊపిరి
ఉయ్యాల పాటలో
మనసు మాటల మంత్రజాలం
వెనక్కి తీసుకున్న చట్టాల విషం
రేపటి మరో పాత్రోచిత వేషం
ఆపద్ధర్మంగా దేవుళ్ళ రంగప్రవేశం
సంప్రోక్షణలో అన్నమయ కోశం.

మాటల కోటల్లో అన్నదాత
కిరీటం లేని రాజు
గిట్టుబాటలో గింజ మాత్రం అనాథ.
విషాదాంతాల వివాదం
ప్రతిపక్షులు జట్టు కట్టడానికి
ఎప్పటికీ ఓ ఆపద్ధర్మ నినాదం.

నిన్నటి రైతు అస్థికల ప్రదర్శన
కాన్వాయ్ టైర్ల నెత్తుటి మరకల కథలో
చట్టం కప్పేసే మెతుకుల వెత.
ప్రకటించిన పరిహారం
పాపం కడిగేసుకునే గంగ.
కాషాయాంబరంలో
గ్లిసరిన్ కన్నీటి మేఘం.
ఎడతెరిపిలేని సానుభూతి వర్షం.
బోనులో లఖింపూర్ మౌనసాక్ష్యం
వాదనల్లో విద్రోహకర చర్య.

మొక్కేయ్యడం మోక్ష మార్గం అయినట్టే
తొక్కేయడం
అసహనాల నిర్మూలన మంత్రమైంది
రోజులను లొంగదీసుకున్న రాజు
నీతుల పంజరంలో పావురాలతో
వినువీధిలో శాంతి మంత్రం జపిస్తున్నాడు
విశ్వగురువై జ్ఞానయోగం బోధిస్తున్నాడు.



సంపాదకీయం

తంగేడు

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

16-30 జూన్, 2022

సంపుటి 02 సంచిక 15



శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గో.రా.
అసోసియేట్ ఎడిటర్
9676096614

ఎడిటోరియల్ బోర్డ్ :
ఘనపురం దేవేందర్
రంగు నవీనాచారి

# సాహిత్య మౌలికాంశాలుగా జానపద కళలు

సాధారణంగా సంప్రదాయ పండిత సమాజానికి ఓ విశ్వాసం ఉంటుంది. నాగరికుల నోట్లో నానిన పదాలు, కావ్యాల్లో అమరిన పదాలు అపభ్రంశాలై జానపదుల దగ్గరకు వెడుతాయని, సంస్కృతీకరణ చెందిన పదాలే తద్భవాలుగా రూపాంతరం చెందుతాయని. కాని ఆధునిక భాషాశాస్త్రం దీన్ని తిరస్కరించింది. జానపదుల నోట్లో నానిన పదాలే క్రమంగా సంస్కృతీకరణ, కావ్యీకరణ చెందుతాయని తేల్చి చెప్పింది. చాలా ఎక్కువసార్లు ఈ పరిణామమే జరగడం తరచిచూస్తే బోధపడే సత్యం. ఈ విధంగా జానపద భాష నాగరీకరణ చెందడం జరుగుతూ క్రమంగా తన మౌలిక అస్తిత్వాన్ని కోల్పోతున్నది. ఈ పరిణామమే జానపద కళారూపాల్లోనూ జరుగుతుండడం ఒక ఆక్షేపణీయ పరిణామం. ఈనాడు కొనసాగే చలనచిత్రాలు, అంతర్జాల మాధ్యమంలో సాహిత్య రూపాలన్నిటికీ జానపద కళలే ఆధారాలు. కళారంగం మౌలిక అభ్యాసమంతా జానపదంలో నిక్షిప్తమై ఉంటుందనేది క్రమంగా నిర్వివాదం అనే అవగాహన కలుగుతోంది. గ్రామీణ జీవితంలో అత్యాధునిక శాస్త్ర సాంకేతికత వల్ల వచ్చిన మార్పుల ప్రభావమే. ఈ జానపద కళల అదృశ్యానికి కారణమౌతోంది. కొన్ని జానపద కళారూపాలైతే పూర్తిగా అదృశ్యమయ్యాయి. వీటికి ఆదరణ లేకపోవడం తద్వారా జీవనభృతి కోల్పోవడమే దీనికి కారణం. వీధి నాటకం, గంటె భాగోతాలు, గొల్ల భాగోతాలు, పగటి వేషాలు, విభిన్న నృత్యాలు లాంటి కళారూపాలన్నీ కళావిహీనమైపోయాయి. జానపదుల నిత్యనైమిత్తికంగా కొనసాగే భజన కార్యక్రమంలో కూడా సరికొత్త వాద్య విశేషాలు ప్రవేశించి అసలు రూపాన్ని మరుగున పడేశాయి. కోలాటాల లాంటివి కూడా ఉన్నప్పటికి తమ స్వాభావికతను పూర్తిగా మార్చుకుంటున్నాయి. అనేక జానపద కళారూపాలు ప్రభుత్వాల సాంస్కృతికశాఖలో కొనఊపిరితో కొనసాగుతున్నాయి.

ఇటీవల 12 మెట్ల కిన్నెర వాయిద్యకారుడు దర్శనం మొగులయ్య పద్మశ్రీ అవార్డు అందుకున్న సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం కోటి రూపాయల నగదుతో పాటు హైదరాబాదులో నివాసస్థలాన్ని బహుమతిగా అందజేసి ప్రోత్సహించడం గమనార్హం.

జానపద కళాకారులు దాతృకులాలతో సరైన ఆదరణ పొందలేకపోతున్నారు. పిచ్చకుంట్ల, పటంవారు, కూనపులి, గౌడజెట్ల లాంటి గాయక సమూహాలు ఒక గ్రామానికి వస్తే వారం, రెండువారాలు ప్రదర్శనలు జరిపేవారు. ఇప్పుడు ఆ పేర్లు కూడా తెలియకుండా పోతున్నాయి. ఆధునికత అవశ్యం ఆహ్వానించదగిందే. శాస్త్ర సంకేతికత నిస్సందేహంగా మానవ పురోగమనానికి చిహ్నమే. అయితే సమాజం ఎంత పురోగమించినా మూలాలను మరచిపోవడం ఆరోగ్యకరం కాదు. ఎన్ని విశేషాలు జరిగినా మౌలిక ప్రమాణాలు విస్మరించడం ఉండాల్సిన మానవతా కోణాన్ని దెబ్బతీస్తున్న అంశంగానే గమనించాలి.

ఈనాటి సాహిత్య వాతావరణానికి జానపద కళలే మూలాంశాలు. ఇప్పుడు మనం పొందిన భావసౌష్టవం, వ్యక్తీకరణలో సాధిస్తున్న ఉక్తివైచిత్రి ఇవన్నిటికి పునాదులు జానపద విజ్ఞానంలోనే ఉన్నాయి. మన మూలాంశాల ఆధారంతోనే ఇతర భాష నుండి దిగుమతి చేసుకున్న సంస్కృతిని, సాహిత్యాన్ని మనలో కలుపుకొని కొత్తగా నడుస్తున్నాం. కాబట్టి మన మూలధాతువుల మీద కనీసం అనుకూల దృక్పథం మనకు ఉండాలి.

అదే సమయంలో వాటిని యథాతథంగా పరిరక్షించడం, లేక పునర్నిర్మించడం కూడా అంత సులువైన పని కాదు. కాని వాటి స్పృహతో, స్ఫూర్తితో కొనసాగవలసి ఉంటుంది. సాధ్యమైనంతవరకు నాటి కళాకారులను నిస్పృహ దరిజేరకుండా ఆదరించాల్సి ఉంది. నాటి సాహిత్యరూపాలను సామాజిక ప్రయోజనానికి అనుగుణమైన సాధనాలుగా మలచుకోవాల్సి ఉంది.

**జై తెలంగాణ, జై జాగృతి.**

కవిత కల్వకుంట్ల

కవిత

# నమస్తే హైదరాబాద్

సుంకర రమేశ్, 94921 80764

ఎప్పుడూ చూడని
నీ సౌందర్యాన్ని
నేనిప్పుడు చూస్తున్నా
తొలిసారి తల్లి మోమును
చూసే శిశువులా
నీ నీరవ నిశ్శబ్దంలో
గాంధర్వ రాగాలు
గమ్మత్తు స్వరాలు గాలిలో
గుబాలిస్తున్నాయి
ఆకురాలు శబ్దం కూడా
ఎంతో హాయిగా వినిపిస్తోంది
ఏ ఆకుల మీద
కాలు పడినా అందెలు
మోగిన చప్పుడు
చైత్ర మాసంలో చిత్రమైన
సొగసులు
అప్పుడే కొమ్మమీంచి
రెక్కలార్చే పక్షి వీనుల వింత సవ్వడి
ఎక్కడో దాక్కున్న చిన్ని చిన్ని
పిట్టలు ఇలా వచ్చి తనిఖీ చేసి
వెళుతున్నాయి
ఇంకా మనుషులున్నారా అని
వసరాలోకి రయ్యిమంటూ
వచ్చిన పిచ్చుకల గుంపు
దిలాసగా లోగిలికి వచ్చింది

గోధూళి వర్ణంలో
గోరెంకలు కలిసి పోయాయి
నెమలి రోడ్డుపైకి వచ్చి
పచార్లు చేస్తోంది
ఉరుకుల పరుగుల
ఉడుత ఒకటి ఆగి ఆగి చూస్తోంది
బొమ్మల కొలువులోని
బొమ్మ కార్లలా
రోడ్డుపై కార్ల బారు
నగరం తలంటుపోసుకుంటున్న
స్త్రీలా స్నిగ్ధ సౌందర్యంతో మెరిసిపోతోంది
మునుపెన్నడూ లేని ప్రకాశంతో వెలిగిపోతోంది
వసంత ఋతువులో విరబూసిన
నీలి కురులతో ఆకాశ సుందరి తొంగి చూసింది
నల్లని రాత్రి చుక్కల ఓణీని
నేలకు పంపింది
నిద్దురోయిన కనుపాపల
తీరంలో నెమలి పురివిప్పి ఆడింది
నగర దేవత గాఢ నిద్రలోకి
వెళ్లింది
కనిపించని దేవతలెవరో
వింజామరులు వీస్తున్నట్టు
ఏ మునో మంత్రించినట్టు
మనిషి ప్రకృతి ముందు మోకరిల్లాడు



నాటి కథ

# మంగళంలో 'అమంగళం'

నాటి కాలంలోని వివాహాలు, విసుగులు చిత్రించిన కథ...

బదనపల్లి గంగారాం

అది వొక చాలా విశాలమైన తోట. వరుసగా చేమంతి, జాజి, మల్లె, గులాబి మొక్కలన్నీ బారులు తీరి వున్నవి. జామచెట్లు, దానిమ్మ, పనస, మామిడి, కడిమి చెట్లు కన్నులకానందం గొల్పుతూ వాటిలోని ఫలపుష్పాలన్నీ శర్మను బాహ్య స్మృతిని లేకుండా చేసే మాదిరిగా అనిపించినవి. కళ్ళను నులిపికొని చూశాడు. చాలాదూరం నుంచి ఏదో పెద్దపాము చరచరా ప్రాకిపోతున్నట్టు కనిపించింది. దానిపైనే మసకమసగ్గా నల్లని మేఘాలు క్రమ్ముతున్నట్లనిపించింది. తేరిపార చూశాడు. కొంతసేపటికి అది అదృశ్యమైంది. మరోవైపు మళ్ళాడు. అన్నీ కలకలలాడుతూన్న గులాబులే కనిపించాయి. కొన్ని వికసించక, కొన్ని వికసించి కన్నులకానందం గొల్పుతు న్నాయి. మరికొన్నింటి రెక్కలూడి పోయాయి. ఎక్కడినుంచి వొచ్చాదో కాని ఒక తేనెటీగల గుంపు గులాబులపై వ్రాలి అతన్ని సంభ్రమాశ్చర్యపులకితున్ని జేసింది. అతని కాళ్ళు ముందుకు వెళ్ళినాయి. వాటికి సర్వస్వాతంత్ర్యమబ్బిందన్నట్టుగ ఒకచోట ఆగాయి. అతనిముందు గులాబులు గుంపులు గుంపులుగా వున్నాయి. ఒక గులాబిని చేతితో త్రుంచి పరికించగ రెక్కలూడి ఉందది. మళ్ళీ ఒకదానిని త్రెంచాడు. అదీ మొదటి దానితీరే- అట్లే ఒకటీ, రెండూ, మూడు గులాబులు అతని పాదాల క్రింద నలిగినవి. మనసులో కలవరపాటేర్పడింది. చేతుల పని ఆగిపోయింది. కాళ్ళు కదిలినవి, ఒక ఇసుక దిబ్బమీది పోయి కూర్చున్నాడు శర్మ.

ఆనాడతడొక్కడే వున్నాడు. తన స్నేహితులందరు ఇవ్వాళ్ళ తనతో రాలేదు. పాండురంగం తన అత్తవారింటి కెళ్ళాడు. అతడే తనకు అప్పుడన్నట్లు తోచింది. అతడంత అందగాడు కాడు. ఐనా కొంచెం మసక నలుపు, ఎప్పటికీ అతని జుట్టు సంస్కారం లేనట్లుంటుంది. ఖద్దరు ధోవతీ, లాల్చి ధరిస్తాడు. మంచి విజ్ఞాన సంపన్నుడు. అతనికి అన్ని రంగాల్లో కొంతో, గొప్ప ప్రావీణ్యత వున్నట్లు అతని మాటల్లోనే మనకు గోచరిస్తూంటుంది. అతడు, తనూ బాల్య స్నేహితులు. తాను కొంత సంపన్న కుటుంబీకుడు. పాండురంగం మధ్య తరగతికి చెందినవాడు. బి.ఏ. వరకు ఇద్దరూ చదువుకొన్నారు. ఇప్పుడు తాను ఎం.ఏ. చదువుకొంటున్నాడు. పాండు రంగం తాలూకా ఆఫీసులో గుమాస్తాగిరి చేస్తున్నాడు.

శర్మ ఏదో ఆలోచిస్తూ కూర్చుండగానే ఎవరిదో స్పర్శ కలిగింది. అతడు, తన పూర్వ స్నేహితుడు ఖాసిం.

"అరె భాయ్! ఎప్పుడొచ్చావు మద్రాసు నుంచి?" అని ఖాసిం అడిగాడు.

"నేనొచ్చి నెలైపోతోంది. నువ్వెటు 'తప్పీ' చేశావురా? మన పాండురంగం, గోపాల్, శ్యాం, రాఘవులు వగైరా ఎక్కడున్నారురా ఇప్పుడు?" అని శర్మ ప్రశ్నించాడు.

"ఏడిశావ్; వాళ్ళందరూ అత్తవారిండ్లకు పోయారోయ్. నీది లగ్నం ఐతే నన్ను తోలుకపోతావా నీతో?"

"నా లగ్నం కేమి తొందర్రా. మొదలు నీ లగ్నం కానీయ్‌రా భాయి. అప్పుడు చూడు. మా "ఖుషీ" అంతూ పంతూ ఉంటుందా! అదిగో! అప్పట్నుంచీ అల్లాగే కూర్చోక నిల్చున్నావేమిటి? కూచో".

"దానికేమిలేరా. అట్ల 'థియేటరు' వేపు పోదాం రారా.."

ఇద్దరు స్నేహితులు సినీమా వైపు బయల్దేరారు. అప్పటికే చెట్లు తమతమ తలలన్నీ వూపుతున్నాయి. మలయ మారుతం చల్లచల్లగా వీచుతోంది. గోధూళి చాలా దూరంలో పైకి లేస్తోంది. బాలభానుని తీక్షణమైన కిరణాలన్నీ చల్లని ఎరుపు కిరణాలలోకి అనువర్తింపబడి నల్లని కారుమేఘాల చాటున దాక్కొంటు న్నాయి. సినిమా ప్రక్కనే ఎత్తైన ఒక దిబ్బపైన వాళ్ళిద్దరు కూర్చొని భారత ప్రభుత్వపు ఆర్థిక, వైజ్ఞానిక, సాంఘిక, రాజ్యాంగపు సమస్యల్ని గురించి చర్చించారు. ఒక గంటన్నరకు ఇద్దరు సెలవుల్ని తీసుకొన్నారు.

శర్మ ఇల్లు చేరుకునేసరికి ఇండ్లలో దీపాలు వెలిగినాయి. ఇంటిలో నాన్నగారు లేరు. భాస్కరం, శకుంతల ఇద్దరు ఒక చిన్న ల్యాంప్ దగ్గర కూర్చొని తమ పాఠాలు వల్లె వేస్తున్నారు. శర్మ దగ్గరనే వున్న కుర్చీలో వెళ్ళి కూర్చున్నాడు.

భాస్కరం, "సిస్టర్, విల్ యూ ఒబే మై ఆర్డర్?" అని ప్రశ్నించాడు.

"ఏమిరా అన్నయ్యా! నీ ఎంగిలి పీసూనూ! నాకు చరిత్ర అర్థమౌతూండడం లేదు" అని శకుంతల అన్నది.

"క్యా! తుం అప్నే కాం మే లగీ హూ?" అని అడిగాడు భాస్కర్.

"అబ్బా! నీ వాగుడూ నువ్వూనూ. ఏమిటిరా నీ తురకం?" అని జవాబిచ్చింది.

"ఏయ్! నీకీ మా బాస నెత్తికి ఎక్కద్. హెూహెూ నీకీ జాస్తి పని హుంటుంది"

"ఊహూ... ఊహూ..."

"ఒరేయ్! భాస్కరం ఈ 'బాస' ఎక్కడ నేర్చావురా?" అని నవ్వుతూ శర్మ అడిగాడు.

భాస్కరం వులిక్కిపడ్డాడు. అన్నగారు విన్నట్లుందని గ్రహించాడు. భయపడ్తూ "కాదు అన్నయా! వొట్టిగా అట్లా మాట్లాడినా" అని అన్నాడు.

వంటశాలలోంచి "ఒరేయ్ అబ్బాయిలూ! కాళ్ళు కడుక్కొని భోజనానికి రండర్రా" అని అమ్మమ్మ పిలుపొచ్చింది. ఆరుబయట చల్లని ప్రశాంత వాతావరణంలో, మిణుకు మిణుకుమంటూన్న నక్షత్రాల్ని లెక్కపెడ్తూ, నిద్రాదేవి వొళ్ళో హత్తుకు పోయాడు శర్మ.

2

కాలచక్రం గిర్రున తొందరతొందరగా తిరిగిపోయినట్లు నెల పదిహేను రోజులు అయిపోయాయి. కాలానికి కళ్ళెం వేసే జోదెవడూ లేడు. తన ఇష్టం వచ్చినట్లు అది దొర్లుకుపోతోంది. శర్మ మద్రాసు పోయే దినం దగ్గరికొచ్చింది.

కాలకృత్యాలన్నీ తీర్చుకొని శర్మ భోజనం చేసి, బట్టలన్నీ ట్రంకులలో సర్ది, పుస్తకాలన్నింటిని జత చేసి, చెల్లెను, తమ్ముండ్లను పిల్చి, "ఒరేయ్ భాస్కర్! శకుంతలా... మీరు శ్రద్ధగా మీ పాఠాల్ని చదివి మంచిగా పరీక్షలివ్వండి. నేను తొందరగానే మీ బహుమానాల్తో వచ్చేస్తా" అని వారిని మందలించి, "ఒరేయ్ శ్యాం! నువ్వు అమ్మనేం కష్టపెట్టవు గదూ; మంచిగా వుండూ. రామచిలుకలు అన్నీ తెచ్చిపెడ్తా. అల్లరి చేయవు గదూ!, అని నవ్వుతూ అన్నాడు. అమ్మ (భవానీదేవి) నాన్న (సాంబయ్య) గారలు వచ్చారు. శర్మ నౌకరును రైల్వే స్టేషన్‌కు సామాన్ను తీసుకపొమ్మని చెప్పాడు. భవానీదేవి కండ్లల్లో నీటిని తీసుకొంటూ "ఒరేయ్ శర్మా! నువ్వు బుద్ధిగా మెదులు. బాగా చదువుకో. పరీక్షలు అయిపోయిన తర్వాత తొందరగా వచ్చేయ్. ఇంత పెద్దగా అయ్యావ్. పెండ్లి ఇప్పుడొద్దంటావు. మాకు చిన్నప్పుడే ఐంది. ఇదేమిటో గాని ఇప్పుడా కాలం మారిపోయింది" అని అంది.

సాంబయ్య గారూ, భాస్కరం, ఖాసిం రైల్వేస్టేషన్ వరకు వచ్చారు. ఖాసింను శర్మ, అతని చెవిలో, "ఒరేయ్ భాయి! నువ్వు నాలుగు రోజులుండేందుకు రా. నాతో ఇప్పుడు కాకపోయినా ఇంకా ఎనిమిది రోజులకయినా సరే!" రైలు కదిలేటప్పుడు చెప్పి, చేయిలో చెయ్యి వేయించుకొన్నాడు. రైలు కదిలింది. శర్మకు చెట్లూ, గుట్టలూ, అంతా ప్రకృతీ, ప్రపంచం తిరుగుతున్నట్లనిపించింది. తలనొప్పి బయల్దేరింది. రాత్రి 7 గంటలకు మద్రాసు చేరుకున్నాడు.

★ ★ ★

శర్మ మైలాపురంలో ఉన్న తన కిరాయ ఇంటిలో ఖాసింతో పదిహేను దినములైన తదుపరి ఇష్టాగోష్ఠిగా మాట్లాడుకొంటూ వున్నారు. శర్మ కించిత్ దీనవదనుడై- "ఒరేయ్, భాయి ఖాసిం! నాకు పాండు రంగం మాదిరిగానే ఉరిత్రాడు మెడలో పడబోతుందోయ్!" అని అన్నాడు.

"అదేమిట్రోయ్! ఏమి? అట్లా అంటున్నావ్? నాకేం తెలుస్తుందను కొన్నావ్?"

"ఏముందిరా బ్రదర్! అందరిలాగానే నాకు కూడా వివాహం జరుగ బోతుందోయ్".

"ఓహెూ! అంతేనా. మరేదో అనుకొన్నా. బ్రహ్మాండం బ్రద్దలై మీద విరుచుక పడలేదుకదోయ్. దాన్నే అంత వ్యంగ్యంగా చెప్తావటోయ్! సరే. ఆనందిద్దాం".

"అది కాదురా! అబ్బాయి! నాకిప్పుడు వద్దోయ్. బ్రహ్మప్రయత్నాలు చేసినా "ఐ డోంట్ అగ్రీ అంటే ఐ డోన్ట్ అగ్రీ".

"మరేమంటావురా! నేనేవుంటే సరే పోనీలే. మరేం చేద్దామంటావు ఆలోచించావా?"

"ఊహూ... సరే ఆలోచిద్దాం" అని అంటూ శర్మ, ఖాసింలిద్దరు చెరొక కుర్చీపై అట్లే పదిహేను నిమిషాల వరకు కూర్చుండిపోయారు చివరికి.

"ఒరేయ్ శర్మా! ఒక్కటిరా...."

"ఆ- ఆ! ఏమిటేమిటి?"

"నువ్వు త్వరగా ఇంటికి పోయి అమ్మానాన్నలతో ఆ పెళ్ళి ఇష్టం లేదని గట్టిగా నొక్కి చెప్పెయ్‌రా".

"ఓయబ్బో! అదిగో చచ్చాం! అట్లా చెప్పవద్దని అనుకొంటున్న. ఎందుకంటే మొన్ననే నాన్నగారు సంబంధం చాలామంచిది, ఆస్తి చాలావుంది, పిల్ల బాగానే వుంది. ఇంట్లోనే చదువుకుంది. మంచి తెలివితేటలు గలది. వరదక్షిణ ఇరవై ఎకరాల మగాణిభూమి బంగారం లాగుంటుంది. అమ్మకు ఇష్టమే, నాకూ ఇష్టమే. నీకు కాబోయే మామగారు నాలుగు రోజుల తర్వాత నిన్ను చూసేందుకు వస్తున్నారు. నాన్నకు పసందట. అంతా ఒప్పేదం నిశ్చయం అయింది. నీవు తప్పకుండా ఒప్పుకోవాలి. వచ్చే నెలలో లగ్నం అని గట్టిగా వ్రాశాడురా. ఏం చేసేది. నా మనస్సు వెయ్యి విధాల పరిగిడుతోందిరా".

"అయితే... చూసుకో నా తడాకా... ఇప్పుడు ఆలోచిద్దాం" అంటూ పది పదిహేను నిమిషాలు ఖాసిం నవ్వుతూ, "ఒరేయ్ శర్మా! ఇటు వినరా" అన్నాడు.

"చెప్పరా ఏదో విందాం" అన్నాడు నిరుత్సాహంతో శర్మ.

నాటి కథ

"అదేంట్రా. మనమేం చేద్దామంటే, మొదట ఈ పుస్తకాలన్నీ చెల్లాచెదురుగా క్రిందా, కుర్చీలలో, మేజులపై, బీరువాలలో వుంచేద్దాం. నువ్వు త్రాగుబోతు పాత్ర ధరించు. అంతా అవసరమైంది ఏర్పాటుచేసుకొందాం" అని ఒక్క గుక్కలో ఖాసిం చెప్పాడు. శర్మ ఒప్పుకొన్నాడు.

★ ★ ★

ఆనాడే శర్మ నాలుగు గంటలకు ఖాసింతో తన స్నేహితురాలైన లీల ఇంటికి పోయాడు. లీల వీళ్ళిద్దర్ని లోనికి తీసికపోయి కుర్చీలలో కూర్చోమని చెప్పి రెండు కాఫీ కప్పులు తెచ్చి ముందుపెట్టి "శర్మా! ఏమిటీ సంగతులు? ఎట్లుంది మీ గ్రామ వాతావరణం?" అని అడిగింది.

"ఆ! ఏమీలేదుగాని రేపు ప్రొద్దున మా ఇంట్లో ఒక కార్యక్రమం ప్రారంభించబడుతుంది. దానికొరకే కొంత నీ సహాయం కావాలి. అంతే మరువకూడదు సుమా. సరే... వెళ్ళొస్తాము" అని చేతిలో వున్న కప్పుల్ని టేబిల్ పై వుంచి సెలవు తీసికొని బైటికిపోయి బీచ్‌వైపు నడిచారు.

3

మరునాటి పది, పదకొండు గంటల సమయం వరకు అంతా సరంజామ ఆనందోద్రేకాలతో శర్మ ఇంట్లో సాగిపోతోంది. శర్మ, లీల, ఖాసిం తమతమ పాత్రల్ని కడు సమర్థతతో నటించేందుకుగాను రిహార్సల్ చేసికొని, అంతా సిద్ధంగా వున్నారు. ఖాసిం ఇంటి బైటికి వచ్చి రోడ్డు వైపు తన దృక్కుల్ని ప్రసరించాడు. ఇద్దరు ముగ్గురు కూలీలు 'లగేజ్'లను ఎత్తుకొని యజమానితో నడిచిపోతున్నారు. ఒక బికారి చినిగిన గుడ్డలతో అటుఇటూ పరిగిడుతున్నాడు. వాని వెంబడి ఎముకల గూడులాగున్న ఒక కుక్క పందెం వేసికొన్నట్లు లేని సత్తువు తీసికొని వెంట పరుగులు తీస్తుంది. కొన్ని రిక్షాలు, మాలుమోటార్లు, జీబులు రోడ్డు మీద శరవేగంతో పోతున్నాయి. ఖాసిం ఇంటిలోకి నడిచాడు.

చేతిలో ఒక ఛత్రీతో పల్లెటూరు వాడుగా ఉన్న ఒక వ్యక్తి వచ్చి శర్మ ఇంటి ముందు నిల్చొని, "వెంకటరాజశర్మగారూ, రాజశర్మగారు" అని బిగ్గరగా అరిచాడు. తలుపు తెరవబడింది. లోపల్నుంచి లీల బైటికి వచ్చింది.

"ఎవరు కావలెనండీ?" అని లీల అడిగింది.

"పి. వెంకటరాజశర్మగారు, ఎం.ఏ. ఇక్కడనే చదువుతున్నారు. ఆయనగారు ఎక్కడుంటారు తల్లీ? అప్పటినుంచీ గాలించేస్తున్నాను. అతని ఇల్లు దొరకడం లేదు. అని ఒక వ్యక్తిని అడిగాను. అతడు "ఇదే ఇల్లు"ని చెప్పాడు. "ఆయనున్నాడా?" అని అపరిచిత వ్యక్తి అన్నాడు లీలతో.

"అవును. ఉన్నారు. లోపలికి రాండి" అని లీల ఆ వ్యక్తిని లోపలికి తీసుకపోయి కుర్చీ చూపించింది.

"ఒక ఐదు నిమిషాలు కూర్చుని ఉండండి. ఇప్పుడే వచ్చేస్తాను" అని లీల ఆ వ్యక్తితో చెప్పి లోపలికి పోయి శర్మా ఖాసింలతో ఎవరో ఒక వ్యక్తి వచ్చాడని చెప్పింది. శర్మ డ్రాయింగ్ రూంలోకి వచ్చి కుర్చీలో కూర్చున్న వ్యక్తిని చూసి, "నమస్కారమండి..." అని దగ్గరలో వున్న కుర్చీలో కూర్చున్నాడు. తరువాత ఖాసిం వచ్చి ఇంకో కుర్చీలో కూర్చున్నాడు.

కూర్చున్న వ్యక్తి శర్మకు నమస్కరించాడు. ఆ వ్యక్తి ఆజానుబాహుడు. తెల్లని దోవతి, ఒక బనీనులాగున్న అంగీ, పైన ఒక వుత్తరీయం వేసుకొని వున్నాడు. అంత మోటుతనం అతనిలో కన్పించదు.

"ఏమి పనుండి వచ్చారు? నాతో ఏమైనా పనుందా?" అని శర్మ అడిగాడు.

"ఊహూ. శర్మగారితో కొద్దిగా పనుండి వచ్చాను" అని అనుమానంతో ఆ నూతన వ్యక్తి జవాబిచ్చాడు.

శర్మ 'థ్రీ కాజిల్స్' సిగరెట్టు పొకదాన్ని తీసి నోటిలో పెట్టుకుని, మరి రెండు తీసి ఒకటి ఖాసింకు, ఇంకొకటి ఆ నూత్న వ్యక్తికి ఇవ్వబోయాడు. ఆ వ్యక్తి అదోలా మొహం పెట్టి "నేను త్రాగను. వద్దండీ" అని అన్నాడు.

శర్మ, ఖాసింలు సిగరెట్లను ముట్టించుకొని రెండు గుక్కలు త్రాగి, ధూమాన్ని దట్టంగా వదిలారు. తరువాత ఆ వ్యక్తితో-

"ఏమండి, మీ పేరు అడుగవచ్చా?" అని అడిగాడు.

**"ఒక ఐదు నిమిషాలు కూర్చుని ఉండండి. ఇప్పుడే వచ్చేస్తాను" అని లీల ఆ వ్యక్తితో చెప్పి లోపలికి పోయి శర్మా ఖాసింలతో ఎవరో ఒక వ్యక్తి వచ్చాడని చెప్పింది. శర్మ డ్రాయింగ్ రూంలోకి వచ్చి కుర్చీలో కూర్చున్న వ్యక్తిని చూసి, "నమస్కారమండి..." అని దగ్గరలో వున్న కుర్చీలో కూర్చున్నాడు. తరువాత ఖాసిం వచ్చి ఇంకో కుర్చీలో కూర్చున్నాడు.**



"నా పేరు 'నాగలింగం' అని అంటారు".

"ఏమన్నా హైకోర్టులో కేసు పనుండి వచ్చారా?"

"అది కాదు లెండి. మీ నాన్నగారితో నేను మొన్న మాట్లాడి మీ పెళ్ళిగురించి నిశ్చయం చేశాను. అందుగ్గాను మిమ్మల్ని చూసేందుకు నేను ఇక్కడికి వచ్చాను. మీకు నా రాక గురించి మీ నాన్న వ్రాయలేదూ?"

"అవును. మొన్నటి రోజున నాకు తెలిసింది" అని అన్నాడు శర్మ మొహం గంభీరంగా చేసి.

ఖాసింవైపు మొహం త్రిప్పి శర్మ "హి ఈజ్ మై ఫ్యూచర్ ఫాదర్ ఇన్ లా" అని గొణిగాడు.

ఐదు నిమిషాలు నిశ్శబ్దంగా కూర్చొని శర్మ నాగలింగం వైపు ముఖం త్రిప్పి "మీరు చాలా అలసినట్లున్నారు. లీలా- ఒసేవ్ లీలా- ఇలారా! ఈయన గారికి స్నానాల గది చూపించూ" అని అన్నాడు.

నాగలింగం మొఖం సందేహాస్పదమై ముడుచుకుపోయింది. మెల్లిగా లీల చూపిస్తుండగా అతడు స్నానాల గదిలోనికి నడిచాడు.

నాగలింగం హృదయాంతరాళంలో ఎన్నో ప్రశ్నలు... దండయాత్రలు చేస్తున్నాయి. ఆ లీల ఎవరు? శర్మకు లీలకేమైనా సంబంధముందా? అంతా చూస్తే శర్మకామెతో సంబంధం ఉన్నట్లే అనిపించింది. తను గంపెడాశతో వచ్చాడే? తన ఖర్చులన్నీ దండగనే? శర్మ తన తండ్రి మాటలు జవదాటనివాడని సాంబయ్య చెప్పాడే? అన్నీ బూటకము లేనా? తన కలలన్నీ వట్టి గాలిమేడలేనా? అని మెదడులో రైళ్ళన్నీ జోరుగా పరుగులు తీస్తున్నవి. తన స్నానం మాటనే మరచిపోయాడు.

తొందరగా స్నానం చేసి తన చిన్న పంచ కట్టుకుని బయటికి నడిచాడు. పుస్తకాలన్నీ చిందరవందరగా చెల్లాచెదురై అంతటా పడి వున్నవి.

శర్మ వంట ఇంటిలోనుండి గాభరాగా పరుగెత్తుకొనివచ్చి నాగలింగంతో "మీకు ఆకలిగా ఉందా? ఒరేయ్ బ్రదర్! నీవు దగ్గరలో ఉన్న బ్రాహ్మణ హోటల్ నుండి భోజనం కట్టించుకురా" అని ఖాసింతో చెప్పి పంపించాడు.

**ఇదంతా ఒక కంటితో పరికిస్తున్న శర్మ మెల్లిగా ఖాసింను నాగలింగం వెంట పొమ్మన్నాడు. ఖాసిం, నాగ లింగములు రైల్వేస్టేషన్ ప్లాటు ఫారములోని ఒక బెంచీపైన కూర్చున్నారు. నాగలింగం ముఖం సందేహాస్పద కవళికలతో నిండిపోయింది.**

నాగలింగం తన భోజనం ముగించుకొని, డ్రాయింగ్‌రూంలోకి వచ్చి కుర్చీలో కూర్చుని కునుకులు తీయడం ప్రారంభించాడు.

అప్పుడే శర్మ, ఖాసిం, లీల ముగ్గురు పేకాటకుపక్రమించారు. ఏదో గలభా ముగ్గురిలో జరిగింది. శర్మ, ఖాసిం పీకనుబట్టి రుద్ధకంఠంతో "ఓరీ! బద్మాష్! నాతో అబద్ధమాడ్తావ్‌రా- రోగ్! యూ ఆర్ సన్ ఆఫ్ ఎ డాగ్!" అని అన్న అరుపుతో నాగలింగం కునుకులోంచి ఎగిరి ఉలికిపడి లేచాడు. అతనికి శర్మ నడతను చూసి చీకాకు, కోపం ఒకేసారి కలిగినయి. అతను అక్కడుండలేక తన బట్టల సంచిని చేతిలోకి తీసికొని బైటికి నడిచాడు. కాని అంతా చీకట్లు క్రమ్ముకున్నట్లు అగమ్యగోచరంగా అనిపించింది.

ఇదంతా ఒక కంటితో పరికిస్తున్న శర్మ మెల్లిగా ఖాసింను నాగలింగం వెంట పొమ్మన్నాడు. ఖాసిం, నాగలింగములు రైల్వేస్టేషన్ ప్లాటుఫారములోని ఒక బెంచీపైన కూర్చున్నారు. నాగలింగం ముఖం సందేహాస్పద కవళికలతో నిండిపోయింది. మెల్లిగా, నాగలింగం "మీరు ఆ శర్మ స్నేహితులేనా?" అని అడిగాడు.

ఖాసిం, "అవునండీ" అని బదులిచ్చాడు. నాగలింగం తనకు కలిగిన సందేహం నివారణార్థమై "మరి శర్మ నాన్నగారు పిల్లవాడు చాలా బుద్ధిమంతుడు. ఎవరి జోలికి పోడు. ఆచారపరాయణుడు. మంచి తెలివి గలవాడు అని పొగిడాడు. కాని, శర్మలో ఏ వొక్క గుణం కించిత్తైనా లేదేమి?" అని ప్రశ్నించాడు.

"ఓయబ్బో! శర్మ తండ్రి అట్లా పొగిడాడా? వీడిలో తండ్రి చెప్పినట్టుగ మచ్చుకైనా ఒక్క గుణం అగుపించదు. త్రాగుబోతు, స్త్రీలోలుడు. జూదరి. మీ బిడ్డనిచ్చి వీడితో వివాహం చేస్తే ఆమె మెడలో ఉరిత్రాడు వేసినట్లే వుంటుంది. ఆగు...' అని అనబోయాడు ఖాసిం.

"మీరు వెయ్యేళ్ళు వర్ధిల్లాలి. నాకిదేమీ తెలియదు" అర్థోక్తిలోనే అడ్డువచ్చి అన్నాడు. ఇంతలో రైలు వచ్చి స్టేషన్‌లో ఆగింది.

"వెళ్తున్నానండి, దయ ఉంచాలి" అని అంటూ నాగలింగం సెలవు తీసుకొన్నాడు.

ఖాసిం శర్మ ఇల్లు చేరుకున్నాడు. శర్మ, ఖాసిం, లీలల ఆనందానికి మేరలేదు. వారు ఆడిన నాటకం జయప్రదంగా జరిగినందుకు తమను తాము అభినందించుకొన్నారు.

★ ★ ★

నాలుగు రోజులైన తర్వాత శర్మ దగ్గరకు పాండురంగం వచ్చాడు. శర్మ ఏదో జరిగిందనుకొన్నాడు.

శర్మకు కాబోయే మామగారు, శర్మ తండ్రియగు సాంబయ్య గారికొక వుత్తరం బాగా కోపం కొద్దీ, వెక్కిరింపులతో, తిట్లతో వ్రాశాడనియు, సాంబయ్యగారికి శర్మపై గల కోపం ఇంతంతని చెప్పుటకే నలవిగాదనియు, పాండురంగం శర్మతో చెప్పనారంభించాడు.

పాండురంగంతో శర్మ, తనకా వివాహమసలే ఇష్టం లేదని ఖచ్చితంగా చెప్పాడు. పాండురంగం మొహం శర్మ జవాబుతో తెల్లగా పాలిపోయింది.

***8 సారస్వత జ్యోతి, ఆగస్టు, 1954***

(**రచయిత గురించి** : కే.శే. బదనపల్లి గంగారాం (1939-2015) : సిద్దిపేటలో జన్మించిన వీరు దాదాపు 15కి పైగా కథలు రచించారు. డిప్యూటీ ఏ.ఇ.గా 1997లో పదవీ విరమణ పొందారు.)

వ్యాసం

# భట్టుపల్లి సోదర కవులు
# (రామరాజు, శ్యామరాజు)

**విలక్షణ అవధానులను పరిచయం చేసిన వ్యాసం...**



వేదార్థం మధుసూధన శర్మ
90638 87585

తెలుగు సాహిత్యంలో జంట కవులకు కొదవేలేదు. జంట కవులు రాసిన కవిత్వాన్ని జంట కవిత్వం అంటున్నాము. అంటే ఒక కవి పద్యంలోని రెండు పాదాలు రాస్తే, ఇంకొక కవి మిగిలిన పాదాలు పూరించడం లేదా ఒక కవి ఒక పద్యం రాస్తే, ఇంకొక కవి మరో పద్యం రాయడం. ఈ విధంగా ఒక గ్రంథాన్ని పూర్తి చేయడం జరుగుతుంది.

తెలుగు సాహిత్యంలో తొలి సోదర జంటకవులుగా కాచ విభుడు, విఠల నాథుడు. వీరు 13వ శతాబ్దికి చెందిన వారు. రంగనాథ రామాయణం ను రచించారు. ఆ తర్వాత తొలి తెలుగు జంటకవులుగా ప్రసిద్ధి పొందిన వారు నంది మల్లయ్య, ఘంట సింగన. వీరు 1450 ప్రాంతానికి చెందిన వారు. ఆ తర్వాత దివాకర్ల తిరుపతిశాస్త్రి, చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి గారు తిరుపతి వెంకట కవులుగా ప్రసిద్ధి పొందారు. ఇంకా బాలాంత్రపు వెంకట రావు, ఓలేటి పార్వతీశం గార్లు వెంకట పార్వతీశ కవులుగా, కొప్పరపు వేంకట సుబ్బరాయ శర్మ, వెంకట రమణ శర్మలు కొప్పరపు సోదర కవులుగా, ధూపాటి శేషాచార్యులు, ధూపాటి వెంకట రమణాచార్యులు శేషాద్రి రమణ కవులుగా, నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాస పార్థసారథి, శ్రీనివాస వెంకటాచార్యులు శ్రీనివాస సోదర కవులుగా, పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వెంకటేశ్వరరావు గారలు పింగళి కాటూరి కవులుగా, విశ్వనాథ సత్యనారాయణ, కొడాలి ఆంజనేయులు గారలు సత్యాంజనేయ కవులుగా, ఓలేటి వెంకట రామశాస్త్రి, వేదుల రామకృష్ణ శాస్త్రి గారలు వేంకట రామకృష్ణ కవులుగా తెలుగు సాహిత్యంలో జంటకవులుగా కీర్తింపబడ్డారు.

మన జంట కవుల గురించి జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు ఈ క్రింది పద్యంలో ఇలా చెప్పారు.

"జంటకవులు తెలుగు సాహితీ లక్ష్మికి
కంటి సరులు తెలుగు పంట సిరులు
నడుచు వెంట వెంట అడుగు జంట విధాన
కవుల జంట కౌతుకముల పంట"

ఈ విధంగా ఈ జంట కవులు తెలుగు సాహితీ మాగాణాన్ని సుసంపన్నం చేశారు.

ఇలాంటి జంటకవులలో హరికథా కళాకారులుగా, పురాణ కథారచయితలుగా తెలంగాణ రాష్ట్రంలోనే గొప్ప గుర్తింపు పొందిన వారు బట్టుపల్లి రామ రాజు, శ్యామరాజు గారలు. ఈ సోదర కవులు పాలమూరు జిల్లా జడ్చర్ల తాలూకాలోని భట్టుపల్లి అనే అగ్రహారానికి చెందిన గ్రామంలో జన్మించారు. రామరాజు పెద్దవాడు, శ్యామరాజు అతనికి తమ్ముడు. 1899లో జన్మించిన శ్యామరాజు 1983లో కన్నుమూశారు. వీరి తల్లిదండ్రులు చంద్రమ రాజు-చంద్రమ్మ. క్షత్రియ శాఖకు చెందిన భట్టు కుల సంభవులు. శాండిల్యస గోత్రజులు. వీరి తండ్రిగారైన చంద్రమ రాజు తాటికొండ ప్రభువైన రామారెడ్డి, అతని చిన్న తమ్ముడు తిమ్మారెడ్డి, వారి ఆడపడుచు అయిన గద్వాల సంస్థాన రాణి ఆది లక్ష్మీదేవమ్మ గార్లకు బాల్యంలో ఉపాధ్యాయుడిగా ఉండి, విద్య నేర్పించారు.

## సోదరుల విద్యాభ్యాసం

రామరాజు, శ్యామ రాజు గారల విద్యాభ్యాసం జటప్రోలు(కొల్లాపురం)

**ఈ సోదర కవులు పాలమూరు జిల్లా జడ్చర్ల తాలూకాలోని భట్టుపల్లి అనే అగ్రహారానికి చెందిన గ్రామంలో జన్మించారు. రామరాజు పెద్దవాడు, శ్యామరాజు అతనికి తమ్ముడు. 1899లో జన్మించిన శ్యామరాజు 1983లో కన్నుమూశారు. వీరి తల్లిదండ్రులు చంద్రమ రాజు-చంద్రమ్మ. క్షత్రియ శాఖకు చెందిన భట్టు కుల సంభవులు. శాండిల్యస గోత్రజులు.**

వ్యాసం

సంస్థానం ఆస్థాన కవియైన శేష సదాశివ శాస్త్రి వద్ద జరిగింది. వారి దగ్గర ఈ సోదరులు సంస్కృతాంధ్ర పాఠాలు నేర్చుకున్నారు. అనేక పురాణ,శాస్త్ర గ్రంథాలను అధ్యయనం చేశారు.

వీరిని చిన్న వయసులోనే కవితా కన్యక వరించింది.వీరు చక్కని హరికథలను రచించి, సభలలో హరికథా కాలక్షేపం జరిపి, తెలంగాణ రాష్ట్రంలోనే గొప్ప కళాకారులుగా గుర్తింపు పొందారు.

**వీరి రచనలు....**

శ్యామ రాజు రచించిన హరికథలు 30కి పైగా ఉన్నాయి. వాటిలో కొన్ని ముద్రితాలు. మరికొన్ని అముద్రితాలు.

**శ్రీ శ్యామ రాజు గారి రచనలు**

1. ద్రౌపదీ మాన సంరక్షణము
2. హనుమద్రామ సంగ్రామము
3. మయూర ధ్వజ చరిత్ర
4. సానందో పాఖ్యానము
5. సావిత్రి చరిత్రము
6. ద్రౌపది స్వయంవరం
7. కీచకవధ
8. శశిరేఖా పరిణయం
9. గజ గౌరీ వ్రతం
10.బకాసుర వధ
11. కుచేలోపాఖ్యానము
12. శ్రీపతి శతకము
13. ఉత్తరగోగ్రహణం
14 సంస్కృతభాష
15. ఆంధ్రభాష ప్రశంస
16. భారతీయ రత్నములు

మొదలైనవి.

శ్రీ రామ రాజు శ్యామరాజు సోదర ద్వయం కలిసి చేసిన రచనలు

1. భల్లాణ చరిత్ర 2. ప్రహ్లాద చరిత్ర 3. రుక్మిణీకళ్యాణము 4. ఉషా పరిణయము 5. దక్షిణ గోగ్రహణం 6. పార్వతి కళ్యాణం 7. మద్యపాన నిషేధం మొదలైనవి.

**వీరి ప్రదర్శనలు**

తాటికొండ ప్రభువైన రామారెడ్డి (గద్వాల రాణి ఆదిలక్ష్మి అన్నగారు) గారి అభిమానంతో తాటికొండ సభలోనే కాకుండా, గద్వాల రాజసభలలో కూడా

> **రాజా బహదూర్ వెంకట రామిరెడ్డి జీవిత చరిత్ర గ్రంథమును 1891లో సురవరం ప్రతాపరెడ్డి గారు రచించారు. దీని ప్రకాశకులు బాలికల ఉన్నత పాఠశాల కమిటీ, నారాయణగూడ హైదరాబాద్ వారు. గోల్కొండ ముద్రణాలయంలో దీని ముద్రణ జరిగింది.**

అనేక పర్యాయాలు వీరు హరికథలు చెప్పారు. వీరు గద్వాలకు క్రోధన నామ సంవత్సరం, మాఘమాస ఉత్సవాలకు విచ్చేసి రాణి గారి కోరికపై మూడు రోజులు హరికథలు చెప్పి, ప్రభువులను, సభికులను ఆనంద పరవశుల్ని చేశారు. వీరు ప్రభువుల గౌరవం పొందటమే గాక, ప్రత్యేకంగా శ్యామరాజు గారికి రాణి గారు సువర్ణ పతకం బహుకరించారు. ఆ సమయంలో వారు రాణి గారిని కీర్తిస్తూ, "రాణి ఆది లక్ష్మఅంబికా" అనే మకుటంతో పద్యాలను పఠించారు.

గద్వాల సంస్థానాధీశులపై వీరు రాసిన గ్రంథం

కీర్తిశేషులైన గద్వాల సంస్థానాధీశులు సీతారామ భూపాలుని స్మరిస్తూ వీరు ఒక చిన్న గ్రంథాన్ని రచించినట్లుగా తెలుస్తుంది. దీనిని గద్వాలలోని సాహిత్య విద్య ముకుర ముద్రాక్షరశాలలో ముద్రించడం జరిగింది. ఇందులోని మొదటి పద్యాన్ని బట్టి సీతారామ భూపాలుడు గతించిన తరువాత దీనిని రాసినట్లుగా తెలుస్తున్నది. సీతారామ భూపాలుడు ప్రతి సంవత్సరం ఇతర రాజులకు సిగ్గు,ఈర్ష్య కలిగే విధంగా పండితులకు వెయ్యి నూటపదహార్ల పారితోషికం ఇస్తూ, హారములు, నూపురములు, బెనారస్ శాలువాలు, హాటక పత్రములు, మణికంకణ కుండలములు, గుర్రములు, గోవులు మొదలైన బహుమానాలను నిరాఘాటంగా ఇచ్చినట్లుగా ఇందులోని మూడవ పద్యములో వర్ణింపబడింది. అందరికీ అన్ని దానములను చేసిన ఆ మహాదాత చివరికి మృత్యుదేవతకు తన తనువునే దానం చేసినట్లుగా ఇందులో చక్కగా ఉత్ప్రేక్షలో చెప్పబడింది.

మొత్తం మీద పూర్వార్ధంలో ఉన్న తొమ్మిది పద్యాలు సీతారామ భూపాలుని గురించి, ఉత్తరార్ధంలోని ఐదు పద్యాలు ఆదిలక్ష్మి, వరలక్ష్మి, శ్రీ లక్ష్మిలను గురించి ఉన్నాయి.

వీరు గద్వాల సంస్థానంలో ఉండగా ఒకసారి వారికి కష్టములు వచ్చి, ఇల్లు వదిలి పెట్టవలసిన దుర్గతి పట్టింది. అప్పుడు వారు రాణి లక్ష్మీదేవమ్మతో ఇలా శరణు వేడారు.

"లక్ష్మి దేవామ్మ శ్రీ ఆది లక్ష్మి దేవామ్మ
లలిత వరలక్ష్మమాంబ శ్రీలక్ష్మమాంబ
లను చతుర్లక్ష్ములను శరణన్ని మింక
ఎటుల దారిద్ర్యదేవి జయింపగలదో"

అని సరసముగా పలికారు. దాంతో రాణి ఆదిలక్ష్మి గారు వారిని ఆదుకున్న ట్లుగా తెలుస్తున్నది.

రాజా బహదూర్ వెంకట రామిరెడ్డి జీవిత చరిత్ర గ్రంథమును 1891లో సురవరం ప్రతాపరెడ్డి గారు రచించారు. దీని ప్రకాశకులు బాలికల ఉన్నత పాఠశాల కమిటీ, నారాయణగూడ హైదరాబాద్ వారు. గోల్కొండ ముద్రణాలయంలో దీని ముద్రణ జరిగింది. ఇందులో రాజా బహదూర్ వెంకట రామిరెడ్డి గారి జీవిత విశేషాలతో పాటు, వారి సేవా భక్తి,ఔదార్యము, ప్రభు భక్తి, దేశ సేవ మొదలైన వ్యక్తిత్వ లక్షణాలను పేర్కొంటూ పలువురు కవులు ఇందులో రచనలు చేశారు. దీనిలోని 173 వ పుటలో రామరాజు గారల సోదర ద్వయం రాసిన పద్యాలు కూడా ఉన్నాయి.

**ఆధార గ్రంథములు**


1. గద్వాల సంస్థానం-తెలుగు సాహిత్య పోషణము-డా.కట్టా వెంకటేశ్వర శర్మ
2.గద్వాల సంస్థానం-సాహిత్య సేవ-డా.హరి శివకుమార్.

కవిత

# సాత్ పీడీర్ సావ్ కార్

యడవల్లి సైదులు, 70321 88578



తెల్లని దోతి కట్టి, తలకి పాంగ్డి చుట్టి
ఒత్తయిన మీసంతో
ఎత్తయిన గుర్రంపై కదిలోస్తూ
తండాలను ఏలిన ఓ భల్లూ నాయకా
నిన్ను పోలిన మహారాజ్ ని
మళ్ళీ చూడలేదు మేమిప్పటిదాకా

ఇంటికొచ్చిన బాటసారుల ఆకలిని
కళ్ళతోటే కనిపెట్టి,
కడుపు నిండా బువ్వపెట్టే
కరుణామయి ధ్వాళీబాయి
నీతో నడిచెను నీలో సగమై...

హిమవంతుడిలా కరిగిపోయే
జాలిగల హేమానాయక్
మాటలతో మంచిని గెలిపించే
మనసున్న మధు నాయక్
పట్టుపట్టితే విడవని ప్రతాప్ నాయక్
గుణవంతులుగా గణతికెక్కను నీపుత్రులై

ఆడపిల్లలంటే భారమనుకోలేదు నువ్వు
అమ్మ ప్రేమలోని కమ్మదనాన్ని
నీ బేటీల చిరునవ్వుల్లో వెతికావు
అందుకే కదా... ఆ సాతీభవానీలు
నీ బిడ్డలుగా దిగివచ్చారు.
తెలంగాణ తెలుగు సిగలో
సూర్య తేజస్సులై వెలుగుతున్నారు....

తండాల ఎవరైనా సారా తాగి
జిందగీని ఖరాబు చేస్కుంటే చూడలేవు
అన్నదమ్ములు అరుసుకుంటే
సూసిసూడనట్లు దాటవేసి వెళ్లలేవు
పశువులకి మేత లేదనో,
బిడ్డకు పెళ్లి కుదిరిందనో
నీ ఇంటికొచ్చి చేయి చాపితే
అండగా నిలవందే నువ్వు ఆగలేవు.

నీ ఇల్లు ఒక మానవత్వపు కోవెల
నీ చేయి కన్నీటిని తూడ్చెను ఎల్లవేళలా
నీ మాట శాసనమై నిల్చెను బంజారాజాతిల
అందుకే కదా నీ పేరే ఊరి పేరైంది ఇయ్యాల...

నీ దర్జా, నీ ఠీవి, నీ సంపద చూసి
దేవరకొండ నుండి మిర్యాలగూడ దాకా
అందరూ నిన్ను... సాత్ పీడీర్ సావ్ కారంటారు.

పరోపకారాన్నే జీవన సూత్రంగా మలుచుకున్న నీవు
తండా రాజ్యంపై మానవత్వపు జెండా ఎగరేశావు!
తడియారని తండా జ్ఞాపకాల్లో
చెరిగిపోని సంతకమై చరిత్రలో నిలిచావు....

**(యుగపురుషుడు శ్రీ భల్లూ నాయక్ స్మరణలో)**

# సంకటమోచన హనుమాన్

వెలపాటి రామిరెడ్డి

వెలపాటి రామిరెడ్డి 1932లో జన్మించారు. వీరిది రేగుల గ్రామం, కొడకండ్ల మండలం, నేటి జనగామ జిల్లా. తెలంగాణ ముఖ్యమంత్రి నుండి ఉత్తమ సాహితీవేత్త పురస్కారం అందుకున్నారు. పద్య కవిత్వం రాస్తూనే ఉద్యమ కవిగా గుర్తింపు పొందారు. ఎన్నో రచనలుచేసి ఇటీవలే కీర్తి శేషులైన వేలపాటి నాటి ప్రక్రియను తీసుకొని రచన చేయడం వల్ల తంగేడు పాఠకులకు దీని నాటి కవితగా అందిస్తున్నాము....

తే.గీ.॥ వాలి సుగ్రీవులందున వాలి పెద్ద,
అతడె కిష్కింధనేలు సర్వాధిపతియు:
అంజనీ గర్భమున ఈశ్వరాంశము గల
శిశువు జన్మించునను వార్త చెవినిఁ బడియె:

తనకు అంత్యకాలమునకు దగ్గరగు న
టంచు నెంచి గర్భమ్మందె హత్య జేయ
రాతి గుండ్ల వేయించె గర్భమ్ము పైన-
నీట ముంచి చంపంగ యత్నించె- వాలి!

శివుని అంశతో పుట్టెడు శిశువతండు:
చంప, రాళ్ళు రువ్విన వారఁ జంపెనతడు-
మంచినీటి, చంపెడు వారఁ దుంచెనతడు-
వాలి యత్నము లన్నిటి వ్యర్థపరచె!

ధరణిఁ బుట్టిన రుద్రావతారమతడు:
తల్లియెడ భక్తి జూపెడు తనయుడతడు:
గాలిలో ఆటలాడిన ఘనుడతండు:
పవనసుతుడను పేరున పరగునతడు:

కథ

# గంజాయి వనం

నేరస్థులపై కొత్త ప్రతిపాదన చేసిన ఓ యువతి కథ...



నెల్లుట్ల రమాదేవి
94406 22781

అయిదు చుక్కల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలోని సెమినార్ హాల్ విలేఖరులతో కిక్కిరిసిపోయి ఉంది. డిశ్చార్జ్ అయిన వెంటనే వచ్చింది అనన్య. చుట్టుముట్టిన కెమెరాల ఫ్లాష్‌లు తళుక్కుమన్నాయి. వెంటనే ప్రశ్నలబాణాలు దూసుకొచ్చాయి.

"మీ ప్రశ్నలన్నిటికీ సమాధానాలిస్తాను. నేను మాట్లాడాక అడగండి, సరేనా?" అంది. రిపోర్టర్స్ ఆసక్తిగా చూస్తున్నారు.

"దయచేసి... ఎలా ఫీల్ అవుతున్నారు? అప్పుడెలా భరించారు, పారిపోవాలని ఐడియా ఎలా వచ్చింది? దుండగులను మీరెలా గుర్తుపట్టగలిగారు? అంత రాత్రి పూట తిరగడం అవసరమా లాంటి ప్రశ్నలడక్కండి!" అంది.

విలేఖరులు అర్థం కానట్టు చూశారు.

"అదే! ఎక్కడ ఇలాంటి సంఘటన జరిగినా బాధితురాలిని చుట్టుముట్టి అలాంటి ప్రశ్నలన్నీ వేస్తుంటారు కదా! అవన్నీ అడగవద్దు. నేనే చెబుతాను." అంటూ మొదలు పెట్టింది.

"ఆ రోజు ముగ్గురు స్నేహితుల్తో కలిసి నా క్లోజ్ ఫ్రెండ్ పెళ్ళికి వెళ్లి క్యాబ్‌లో ఒక్కొక్కళ్ళనీ డ్రాప్ చేస్తూ వస్తున్నాను. అప్పుడప్పుడూ అలా రావడం మాకు అలవాటే. సడన్‌గా కార్ ఫెయిల్ అయింది. డ్రైవర్ ఎంతప్రయత్నించినా స్టార్ట్ అవలేదు. అక్కడ్నించి పది నిమిషాలు నడిస్తే మా ఇల్లొస్తుంది. వేరే వెహికల్స్ కూడాదొరికేలా లేవు.

కొంచెం దూరంగా ఉండే కాలనీ మాది. అప్పుడప్పుడే అందరూ ఇళ్ళు కడుతున్నారు. దారంతా చెట్లూ, చీకటిగా ఉండి భయంవేసినా తెలిసినదారే కదాని నడుస్తున్నా.

సడన్‌గా ఓ కారు నాపక్కన ఆగి ఎవరో నన్ను అందులోకి గట్టిగా లాగారు. నేను పెనుగులాడుతుండగానే స్పీడ్‌గా కారు పరిగెత్తింది. నా నోట్లో గుడ్డలు కుక్కి, కళ్ళకు గంతలు కట్టారు. మొబైల్ విసిరి పారేశారు. సిటీకి దూరంగా ఏదో పైపుల ఫ్యాక్టరీకి తీసుకెళ్లారు. నేనెంత పెనుగులాడినా, తప్పించుకుందామని ప్రయత్నించినా లాభం లేకపోయింది. వాళ్ళు బాగా తాగి ఉన్నారు. నా విన్నపాలు, కన్నీళ్లు వాళ్ళను ఏ మాత్రం ఆపలేకపోయాయి. వాళ్ళ పశుబలం ముందు నేను ఓడిపోయాను. క్రూరాతి క్రూరంగా, ఘోరంగా.. నలుగురు నాపై అత్యాచారం చేశారు."

ఆ సంఘటన గుర్తొచ్చి అనన్య గొంతు గద్గదమైంది. కళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

"నాకు స్పృహ వచ్చేసరికి వాళ్ళు కొద్ది దూరంలో లిక్కర్ తాగుతూ, తింటూ, బూతులు మాట్లాడుతూ ఈ ధ్యాసలో లేకుండా ఎంజాయ్ చేస్తున్నారు. నన్ను తగుల బెడదామని మాట్లాడుకుంటూ ఉన్నారు.

నేను ప్రాణాలకు తెగించి నెత్తురోడుతున్న శరీరంతో దేక్కుంటూ వెళ్లాను. వెనకాల ఓచోట కూలిపోయిన కాంపౌండ్ వాల్ గుండా పక్కనున్న ఫామ్ హౌస్ కనిపించింది. ఆ గోడకు చేరుకొని మళ్ళీ స్పృహతప్పిపడిపోయాను. ఇక నేను ప్రాణాలతో ఉండనేమో అనుకున్నాను. తెల్లవారాక ఆ ఫామ్ హౌస్ వాచ్‌మెన్ నన్ను చూశాడు. వెంటనే నాకు మంచి నీళ్లు ఇచ్చి అంబులెన్స్‌కి ఫోన్ చేసాడు. మిగతాది మీకు తెలుసు" ఆగిందామె.

అప్పటిదాకా నిశ్శబ్దంగా వింటున్న రిపోర్టర్స్ తెలుసన్నట్టు తలలూపారు.

'నగర శివార్లలో ఓ యువతిపై దారుణంగా అత్యాచారం '...కొన వూపిరితో ఉన్న యువతి హాస్పిటల్‌లో చేరిక'.... 'నగర శివార్లలో పెచ్చరిల్లుతున్న అత్యాచారాలు'... 'విఫలమైన పోలీస్ వ్యవస్థ'.... 'రేపిస్టులు నలుగురేనా?'... ఇలాంటి హెడ్ లైన్స్‌తో వార్తా పత్రికలు, టీవీ ఛానెల్స్ హోరెత్తించాయి ఆ వారం రోజులూ.

చివరికి నిన్న వాళ్ళను పట్టుకున్నారనేది ఓ సంచలన వార్త అయింది. ఇక అప్పట్నుంచి పోలీసులు వాళ్ళను కోర్ట్‌లో హాజరు పరుస్తారా లేక ఎన్‌కౌంటర్ చేసి చంపుతారా అని ప్రజలు చర్చించుకోవడం

కథ

మొదలైంది.

"మీ భవిష్యత్ కార్యాచరణ ఏమిటి?" అడిగాడో రిపోర్టర్.

"సిక్ లీవ్ అయిపోగానే నేను పనిచేసే ఫార్మాకంపెనీలో చేరుతాను. నన్ను సపోర్ట్ చేసే అమ్మానాన్నలున్నారు. అర్థం చేసుకునే స్నేహితులున్నారు. నన్నో వింత జంతువుగా చూసే సమాజం కూడా ఉంది. అయినా దీన్నొక ఆక్సిడెంట్‌గా భావించి ముందు జీవితం గడపాలనే ఆత్మవిశ్వాసం నాకుంది" స్థిరంగా జవాబిచ్చింది.

"పెళ్లి గురించి ఎలా మరి?" మరో విలేఖరి ప్రశ్న!

"పెళ్లి ...దాని గురించి ఇప్పుడే ఆలోచించలేదు. ఈ విషయం తెలిసి... నన్నర్థం చేసుకునే వ్యక్తి దొరికితే.... ఏమో!" అంది అనన్య.

"వాళ్లకు ఎలాంటి శిక్ష పడాలని మీరనుకుంటున్నారు?"

"ఈ వారంరోజులుగా మీడియా వార్తాకథనాలన్నీ చూస్తూనే ఉన్నాను. బ్రేకింగ్ న్యూస్ పేరుతో, చర్చల పేరుతో... ఎవరికి తోచిన మాటలు వాళ్ళు చెబుతున్నారు. ఇక కొందరయితే బాధితురాలు బతికే ఉందట అంటూ ఆశ్చర్యం ప్రకటిస్తున్నారు. బహుశా ఇలాంటి కేసుల్లో చచ్చిపోతేనే సింపతీ వస్తుందేమో!

వాళ్ళను పట్టుకున్నారు గానీ చంపేస్తారేమో, చంపితే ఇలాంటివి మళ్ళీ జరక్కుండా ఉంటాయా, వాళ్ళ పెళ్ళాం పిల్లలు దిక్కులేని వాళ్లవుతారు కదా! వాళ్ళేం తప్పు చేశారు పాపం, తప్పంతా సమాజానిదే.. అంటూ మానవ హక్కుల వాళ్ళు మాట్లాడుతున్నారు. నిజమే, మరి సమాజాన్ని ఎలా శిక్షించాలో, ఆ మానవ హక్కులు మాలాంటి వాళ్లకు ఉండక్కర్లేదా చెప్పరు. పోనీ ఆ నిందితుల్ని వీళ్లకు అప్పజెబితే ఓ నాలుగయిదేళ్ళ శిక్షా సమయంలో మంచివాళ్ళుగా మారుస్తామని గ్యారంటీ ఇవ్వగలరా?

అంత రాత్రిపూట తిరిగితే అలానే అవుతుంది, ఇలాంటివి నాలుగు జరిగితే ఆడవాళ్లు కంట్రోల్ అవుతారు అని



భూమిలో గంజాయి మొక్కల సాగు చేస్తే వాటిని పెంచిన వారిని వదలకుండా అరెస్ట్ చేసి శిక్షిస్తారు కదా! మరి సమాజానికి హాని చేసే గంజాయి మొక్కల్లాంటి పిల్లల్ని పెంచినందుకు ఆ తల్లి దండ్రులకు శిక్ష ఉండొద్దా చెప్పండి?" అనన్య ప్రశ్నలో ఆక్రోశం అక్కడున్నవారి హృదయాల్ని తాకింది.

ఛాందసవాదులు అంటున్నారు. ఎటూ తిరగక ఇంట్లో ఉన్న పసిపిల్లల్ని రేప్ చేసి చంపేవాళ్ళనేమంటారోవీళ్ళు? వేటగాళ్లకు కాక వాళ్లకు కనపడేలా తిరిగే జింకపిల్లలకు శిక్ష వేయమంటారను కుంటా!

మద్యం వల్లనే ఈ ఘోరాలు పెరిగాయని కొందరంటున్నారు. మరి మద్యం షాపుల వాళ్ళనో, అనుమతించే ప్రభుత్వాన్నో ఎలా శిక్షిస్తాం చెప్పండి? క్రూరమృగాలు జనంలో ఉండకూడదు, బోనులోనే ఉండాలి. వాటిస్థావరమైన అడవిలోకి వెళ్లి మనం వేటాడితే నేరం గానీ, మృగం జనంలోకి వచ్చి మనుషుల్ని చంపుతుంటే చూస్తూ ఊరుకుంటామా?" ఓ క్షణం ఆగింది అనన్య.

"ఇంతకీ మీరేమంటారు?" ఓ రిపోర్టర్ ప్రశ్నించాడు.

"ఆ రేపిస్టులతో బాటు వాళ్ళ తల్లిదండ్రుల్నీ శిక్షించాలి."

వింటున్న విలేఖరులు ఉలిక్కిపడి "అదేంటీ?" అన్నారు ఒక్కసారిగా.

"అవును, ఐ మీన్! పిల్లలు గొప్ప పనులు చేసినపుడు, మెడల్స్ సాధించినప్పుడు ఆ పిల్లల్నలా పెంచినందుకు ఆ విజయంలో తల్లిదండ్రుల పాత్ర ఉందని అందరిముందూ గొప్పగా చెప్పుకుని ఫోటోలు దిగుతారుగా! మనం వాళ్ళకీ దండలేస్తాం, అభినందిస్తాం. మరి వీళ్ళ తప్పులకి తల్లిదండ్రులు కొంతైనా బాధ్యులు కారా? తమ పిల్లల స్వభావమేంటో, వాళ్లెలా పెరుగుతున్నారో, వాళ్ళ అలవాట్లేంటో నిజంగానే పేరెంట్స్‌కి తెలీకుండా ఉంటుందా?

ఒకప్పుడంటే చదువు లేక, అవకాశాల్లేక అలా అడవి మృగాల్లా పెరిగారనుకునే వాళ్ళం. ఇప్పుడు ఓ స్థాయిదాకా ఉచిత విద్యే కదా! ఇక మంచీ చెడ్డా నేర్పే అవకాశం గురువులకి ఇవ్వట్లేదు ఇప్పటి పేరెంట్స్. మందలిస్తేనే దండెత్తుతున్నారు. మరి సంస్కారం నేర్పకపోవడం ఎవరి తప్పు?

భూమిలో గంజాయి మొక్కల సాగు చేస్తే వాటిని పెంచిన వారిని వదలకుండా అరెస్ట్ చేసి శిక్షిస్తారు కదా! మరి సమాజానికి హాని చేసే గంజాయి మొక్కల్లాంటి పిల్లల్ని పెంచినందుకు ఆ తల్లి దండ్రులకు శిక్ష ఉండొద్దా చెప్పండి?" అనన్య ప్రశ్నలో ఆక్రోశం అక్కడున్నవారి హృదయాల్ని తాకింది.

# ప్రభాకర హృదయం

ప్రభాకర్ కవితా హృదయం ఆవిష్కరించిన వ్యాసం...



ఏనుగు నరసింహారెడ్డి
89788 69183

వచన కవిత్వానికి విస్తృత ప్రచారం కల్పించిన కుందుర్తి కవి హృదయ స్పందన, అభిప్రాయ ప్రకటనకు వచన కవిత్వం పరిమితం కాకూడదని భావించాడు. వచన కవిత్వంలో కథను ప్రవేశ పెట్టాలనుకున్నాడు. ఆ సూచనకు కొద్ది స్పందనే వచ్చింది. శీలా వీర్రాజు కథను వచన కవితలో చెప్పారు. ఆ తర్వాత ఎవరూ ఆ దిశగా ప్రయత్నించ లేదు. కె. ప్రభాకర్ చాలా అలవోకగా కేవలం 16 లైన్‌లలో కథ చెప్తాడు. రాజుగారు అందమైన బిచ్చగత్తెను చేరదీసి పెళ్లాడుతారు. బిచ్చగత్తె సన్నగా పేలవంగా తయారయిందట. ఎందుకిలా జరుగుతుందని రాజు ప్రశ్నిస్తే 'నన్ను మీరు బందీ చేసారు, నాకు స్వేచ్ఛ కావాలి' అంటుంది. ఇక్కడ స్వేచ్ఛను Glorify చేయడమే కవి లక్ష్యం అయినా కథను కవిత్వంలో చెప్పడం విశేషమే. 'అతడి పేరు ధర్మయ్య'లో బిచ్చగాడు ధర్మయ్య శోష వచ్చి చెట్టు పక్కన పడిపోవడంతో అతని చేతిలోని డొక్కు డబ్బాలోని గుక్కెడు నీళ్ళు అతడు మరణించాక దొర్లి చెట్టుపై పడతాయి. ఎండి చనిపోబోతున్న చెట్టు ఆ నీళ్ళతో జీవం పోసుకుంటుంది. మరుసటి రోజు ఆ మొక్క కొసన వికసించిన పువ్వు చిరునవ్వు అందట 'అతని పేరు ధర్మయ్య' అని. ఇదొక కథాకవిత. 'ఈ రెండూ అదిత్య హృదయం'లో ఉన్నాయి. ఇది ప్రసిద్ధ సాహిత్యకారుడు కె. ప్రభాకర్ తాజా కవితా సంపుటి.

కె. ప్రభాకర్ ప్రయాణం సుదీర్ఘమైనది. సిద్దిపేట జిల్లానుండి భాగ్యనగరం ద్వారా చెన్నపట్టణం దాకా చేరుకున్నాడు. ఇదంతా బతుకుదెరువు ప్రయాణమైతే విశేషంగా మాట్లాడుకునేదేమీ ఉండేది కాదు. కానీ అదంతా సాహిత్య ప్రయాణం. పాత్రికేయత, అధ్యాపకత్వం, రచనా వ్యాసంగాల్లో చివరిదొక్కటే చివరిదాకా మిగిలింది. ఆరుద్ర, శ్రీశ్రీ, ఆత్రేయ, దాశరథి, శేషేంద్ర, కాళోజీ తదితరులలో చాలామందికి అంతేవాసి అయ్యాడు. ఆయన వయసు వాళ్ళు ఎవరూ సాధించ లేని మహానుభావుల సాహచర్యాన్ని ఆయన సాధించాడు. తెలుగు, సంస్కృతం, ఆంగ్లం ఇష్టంగా అధ్యయనం చేసాడు. కవిత్వమూ, విమర్శ గ్రంథాలు ప్రచురించాడు. సంపాదకత్వ గ్రంథాలు తీసుకువచ్చాడు. సాహిత్యోద్యమాలలో పాలుపంచుకున్నాడు. అదీ ఇతర రాష్ట్రాలలో. అందువల్ల ఆయన కవిత్వ పుస్తకం బాగానే పరిశీలనకు పెట్టబడుతుంది.

ఆదిత్య హృదయం సంపుటిలో 59 భిన్నమైన కవితలున్నాయి. వీటిని స్పృశిస్తూ సినారె మొదలు 13 మంది ముందు మాటలు రాసారు. సంపుటి శీర్షిక సంప్రదాయాన్ని సూచిస్తుంది. కానీ కవిత్వం మాత్రం ఆధునికం. సింహభాగం కవితలు శ్రామికుల పక్షపాతం వహించాయి. అడుగడుగునా శబ్దాలయ, అక్కడక్కడ ప్రణయభావాలు, వర్తమాన సమాజంపై నిరసన, ధిక్కారం ఈ సంపుటి నిండా పరుచుకొని ఉంది. చాలా సందర్భాలలో స్పష్టత, సూటిదనం ఉన్నా అక్కడక్కడ అధివాస్తవిక లక్షణాలూ కనిపిస్తాయి. అభ్యుదయం స్థూలంగా ఈ కవిత్వపు ఆత్మ. ముందుమాట రాస్తూ సినారె చెప్పినట్లు శ్రీశ్రీ ముద్ర కె. ప్రభాకర్ గారిపై ఉంది. వేదాంతం షార్ప్ పోయెం.

'సత్యం మూలకు మూలుగుతున్నది
అసత్యం జ్వాలై కళికలా వెలుగున్నది
ఇదంతా కాలకన్య మహాత్మ్యం
ఆమె ఎంతో చక్కనిది ఎవరికీ చిక్కనిది'

మొదటి రెండు పాదాలలో అభ్యుదయం చివరి రెండుపాదాలలో సంప్రదాయం ఒక గమ్మత్తైన కలయిక. కాలాన్ని కన్య అనడం నవ్య సంప్రదాయం. ఆమె ఎవరికీ చిక్కనిది అనేది ఒక మర్మ వాక్యం. మరోచోట 'మార్పు' అనే కవితలో కూడా కాలకన్యను చెబుతూ...

'తైలం రాసి తల దువ్వలేదు
మాలిష్ చేసి మస్కా కొట్టలేదు'

అంటాడు. శ్రామికలోకం, పారే నెత్తురులో నల్లజెండా, పోరాటం, కవితలలో తనకు

పుస్తక పరిచయం

తానుగా శ్రమజీవుల నాయకుడినని ప్రకటించుకుంటాడు.

'విప్లవ ప్రవచనాలు నేర్పే
పూలతోటకు వనమాలిని
చదువు సంధ్యలుండి, పనిపాట లేని
కూలినాలి
పేటకు ముఠామేస్త్రిని'

అద్భుత వాతావరణం, ప్రణయ రహస్యం, సంసార నౌక, జీవనరాగం, ప్రేమ సందేశం భిన్నమైన కవితలు. జీవితంలోని మార్దవాన్ని, ప్రేమను, కుటుంబాన్ని కాపాడే క్రమంలో పెల్లుబికిన భావాలవి. ఒకో కవిత సుదీర్ఘంగా సాగుతున్నకొలది, అధివాస్తవిక ధోరణి కూడా చొరబడుతుంది. 'మాయా ప్రవరుడు ఫ్రాయిడ్‌కు జతగాడు' అంటాడొకచోట. 'Kiss is the key of the life/ sex is the lock of the love' అనడం కూడా ఇందుకో ఉదాహరణగా చూడొచ్చు.

శ్రీశ్రీ ఈయనకు ఇష్టకవి అని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు కానీ ఆయన 'శబ్దలయను ఇప్పుడెవరూ కొనసాగించడం లేదన్న సంగతి తెలిసీ తను కొనసాగిస్తాడు. ఆధునిక కవిత్వపు ఆత్మ ధ్వని (Sound)గా, ఊహగా అందరూ ఒప్పుకోవలసిన రోజులివి. 'Poetry is the language of Imagination' అంటాడు హాజ్ లిట్. దీనికి భిన్నంగా ఆదిత్య హృదయంలో అడుగడుగునా శబ్ద ప్రవాహమే ప్రధానంగా కనిపిస్తుంది. 'సంసార నౌక'లో కవిత...

'కష్టాల కడలిని
ఇష్టాల కూడలిని
కన్నీటి కడవను
పన్నీటి పడవను
చెరగని నవ్వును
చెదరని మువ్వను
తలపుల మైనాను
వలపుల సోనాను
పచ్చని చానను
వెచ్చని దానను'

ఊరిపై రాసిన 'పరికిణి'లో, పట్నం గురించి రాసిన 'మహానగరం'లో కల్తీ గురించి రాసిన 'ఎంత మోసం- ఎంత ఘోరంలో', దేశం గురించి రాసిన 'మట్లాడడం దేనికి'లో ఈ ధోరణి పాఠకుడు ఇట్టే గుర్తుపట్టగలడు. టుమ్రీలలో ఇంకా శ్రీశ్రీ బలపడ్డాడు.

'నరలోకము
పరలోకము
సురలోకము
ఇదే ఇదే
ఎందుకింత బాధ
ఎందుకింత బోధ
రేషన్లూ
ఆపరేషన్లూ...'

వెరసి 'ఆదిత్య హృదయం' ప్రభాకర హృదయం భావాభ్యుదయాల మేళవింపు. తిరుగుబాట సంప్రదాయాల కలగలుపు, కవి మెత్తని హృదయం, లోకపు నిర్దయ కాఠిన్యాల చిత్తరువు. చదవడం, సుళువు, చదవాలనిపించే శైలి కవి ప్రభాకర్ ప్రత్యేకత.

కవిత

# తోడేలు తోడైంది



కోటం చంద్రశేఖర్ 94920 43348

బస్టాండ్‌కి వెళ్ళేదారిలో చేపలతో ఆమె-
సాయంత్రం మీదికి రాత్రిదయ్యం సిద్ధమై-
గబగబా అమ్మేస్తేనే గానీ ఊరెళ్ళొద్దని తీర్మానం-
పరిజ్ఞానం ముందు సవాలు సన్నదైంది
అనుభవం ఎదుట ప్రతిజ్ఞ చిన్నదైంది
ఇంటికి సరుకుల సంచితో చేప 'టౌను' నుండి బయల్దేరి;
వంకరదారిలో తోడేలు తోడైంది
అవి డేగచూపులని అనుకోలేదు
నిద్రలేచి బుసలు కొడుతున్న
కోరికల కాలనాగని ఊహించలేదు
జింకను వేటాడడానికి వచ్చిన పులిని గ్రహించలేదు -
ఓ మ(న)దిలో బతికే చేప
మా(ప్రా)ణాలు వదిలేసిన పాప



క
థ

# మబ్బులు తొలగిన ఆకాశం...

అమ్మతనాన్ని అందంగా చెప్పిన కథ...



గాజోజు నాగభూషణం
98854 62052

ఎప్పటిలాగే ఆ రోజు ఈలలూ, కేకలతో క్లాసంతా గందరగోళంగా ఉంది. ప్రతిరోజూ లెక్చరర్ క్లాస్‌లోకి అడుగు పెట్టేంత వరకు అది క్లాస్‌రూంలా కాకుండా యూత్ ఒక్కచోట గుమిగూడి కాఫీ తాగుతూ కబుర్లు చెప్పుకొనే హోటల్‌లాగా ఉంటుంది. లెక్చరర్ వచ్చాక కూడా కాసేపు గడిస్తే కానీ, మామూలు స్థితికి రాదు. ఆ రోజు కొత్తగా వచ్చిన మాథమేటిక్స్ లెక్చరర్ క్లాస్‌కు వస్తుందని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. బాయ్స్ అయితే మరీ క్యూరియాసిటీతో చూస్తున్నారు. ఎందుకంటే వచ్చేది లేడీ లెక్చరర్ ఊర్మిళ.

ఊర్మిళ క్లాస్‌లోకి వచ్చి తనను తాను పరిచయం చేసుకుంది. స్టూడెంట్స్ పేర్లన్నీ అడిగి తెలుసుకుంది. క్లాసంతా సైలెంట్‌గా మారిపోయింది. అమ్మాయిల కంటే, అబ్బాయిలు ఎక్కువగా చెవులు కొరుక్కోవడం మొదలయ్యింది. కళ్ళు తిప్పుకోవడానికి సాధ్యం కాని సౌందర్యం ఊర్మిళది. సుమారు నలభై ఏళ్ళ వయసున్నా, వయసును ఏమాత్రం కనిపించనీయని అందం. మాట్లాడినా, పాఠం చెప్పినా మోముపై చెదిరిపోని చిరునవ్వు, ఎంత మందిలో ఉన్నా ఆమె ప్రత్యేకతను చాటిచెప్పే అదనపు ఆకర్షణ. క్లాస్ అయిపోగానే బాయ్స్ అంతా ఒకటే కామెంట్స్. కామెంట్స్ అన్నీ ఆమె అందం గురించే.

అది హైదరాబాద్‌లోని పేరు పొందిన ఓ కార్పోరేట్ ఇంజనీరింగ్ కళాశాల. విద్యార్థుల్లో అధికభాగం ధనవంతుల కుటుంబాల్లోంచి వచ్చిన అర్బన్ కల్చర్‌ను అందిపుచ్చుకున్నవాళ్ళే. వాళ్ళలో చాలా మంది చదువుకంటే, సమూహంతో చేసే ఎంజాయ్‌మెంట్‌కు అలవాటుపడిన ఆకతాయి వాళ్ళే. క్లబ్‌లు, పబ్‌లు అమ్మాయిలతో కలిసి పాల్గొనే రేవ్ పార్టీలు వాళ్ళకు సర్వసాధారణం. సోషల్ మీడియా వండి వార్చే అశ్లీలపు చెత్తనంతా మనసుల్లో నింపుకొని, స్త్రీ పురుష సంబంధాలపట్ల అపసవ్యమైన ఆలోచనల్లో కొట్టుకుపోతున్నవాళ్ళే. వాళ్ళ మాటల్లో పొంగిపొర్లే బూతులు, అమ్మాయిల పట్ల చేసే జుగుప్సాకరమైన కామెంట్లు, లేడీ లెక్చరర్స్ పట్ల కూడా గురువులన్న మర్యాద లేకుండా అసభ్యంగా మాట్లాడుకోవడాలు, వారిని స్టూడెంట్స్ స్థాయి నుండి దిగజార్చి, దారితప్పిన యువతకు ప్రతీకగా నిలిపాయి.

ఊర్మిళ ఆడా-మగ అన్న తేడా లేకుండా విద్యార్థులందరితో చాలా చనువుగా వుంటుంది. అందులో రాహుల్‌తో మరీను. రాహుల్‌తో చనువు ఎంతగా అంటే, చాలాసార్లు స్వీట్లు, ఇతర తినుబండారాలు ఇంటినుండి చేసి తీసుకువచ్చి ఇచ్చేది. కొన్నిసార్లు లంచ్‌బాక్స్ కూడా షేర్ చేసేది. క్లాస్ అయిపోయి బయటకు వెళుతున్నపుడు రాహుల్‌ను తిరిగి, తిరిగి చూస్తూ వెళ్లేది. లంచ్ బ్రేక్‌లో స్టాఫ్‌రూంకు పిలిపించుకొని తన సబ్జెక్టు గురించే కాకుండా, ఇతర సబ్జెక్టుల గురించి అడిగి తెలుసుకుంటూ బాగా చదువుకోవాలని, ఏ డౌట్స్ ఉన్నా తనను అడగాలని చెబుతూ ఉండేది.

రాహుల్ నగరంలోనే పేరుమోసిన వ్యాపారవేత్త కుమారుడు. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. చాలా అందంగా ఉంటాడు. చదువులో క్లెవరే కానీ, సమూహంతో కలిసి చదువునుండి పక్కకు వెళుతున్నాడు. ఊర్మిళ రాహుల్‌తో చనువుగా ఉండడాన్ని రాహుల్ ఫ్రెండ్స్ రకరకాలుగా కామెంట్స్ చేస్తున్నారు. పైగా ఆమె ఒంటరిగా ఉంటున్న విడో. నోళ్ళకు ఏ అడ్డుకట్ట లేనట్టుగా సాగిపోతున్నాయి వాళ్ళ కామెంట్స్.

కాని రాహుల్ మాత్రం ఏకకాలంలో రెండు సందర్భాలను సమన్వయం చేసుకోలేని అమాయక స్థితిలో ఉన్నాడు. ఫ్రెండ్స్ తమ కామెంట్స్‌తో ప్రొవోకేట్ చేస్తున్నప్పటికీ ఊర్మిళ మేడం చూపే చనువులో తనకెక్కడా అపసవ్యత కనిపించలేదు. అయినా లోలోపల అర్థం కాని అలజడి. సోషల్ మీడియాలో తరచుగా చూసిన టీచర్-స్టూడెంట్

కథ

రిలేషన్‌షిప్‌ను జుగుప్సాకరంగా చిత్రించిన అనేక చిత్రాలు ఒకవైపు, భర్తలేని ఆడది కాబట్టి అందంగా ఉన్న రాహుల్ పట్ల ఊర్మిళ ఆకర్షణకు లోనవుతుందన్న ఫ్రెండ్స్ చేసే విపరీతార్థాల కామెంట్స్ మరోవైపు నూనూత్న యవ్వనంలో ఉన్న రాహుల్‌ను నిద్రపట్టనీయని స్థితిలోకి నెట్టివేస్తున్నాయి. తన మనసులో ఎన్ని అల్లకల్లోలాలున్నా... ఊర్మిళకు దగ్గరగా ఉన్నప్పుడు ఒద్దికగా, బుద్ధిగానే ఉండేవాడు. ఎందుకంటే ఊర్మిళ మాటల్లోని మార్దవం, చూపుల్లోని నైర్మల్యత రాహుల్‌ను కుదురుగా ఉంచేవి.

ఐదారు నెలలు గడవగానే క్రమక్రమంగా స్టాఫ్‌లోనూ గుసగుసలు మొదలయ్యాయి. ఇతరుల వ్యక్తిగత జీవితాల్లోకి ఆహ్వానించని అతిథుల్లా దూరిపోవడం, నిరాధారమైన ఆరోపణలతో తమకు తామే తీర్పుల్ని వెలువరించడం అలవాటైన లోకం కదా! ఊర్మిళ, రాహుల్‌ల చనువును కూడా రకరకాలుగా వ్యాఖ్యానించడం చిన్నగా మొదలైంది. అవి ఊర్మిళ వరకు చేరకపోలేదు.

ఉన్నట్టుండి ఒక ఆదివారం సాయంత్రం రాహుల్‌ను తన ఇంటికి భోజనానికి ఆహ్వానించింది ఊర్మిళ. రాహుల్ ఈ విషయాన్ని తన ఫ్రెండ్స్‌తో షేర్ చేసుకోగానే, ఇక వాళ్ళు తేల్చేశారు.

“అరేయ్ మామా! నీ అంత లక్కీ ఫెలో లేడురా... మాకెవ్వరికీ దక్కని అదృష్టం నీకు దక్కింది. ఎంతైనా హాండ్సమ్ ఫెలోవు కదరా... రేపు మా అందరికీ గ్రాండ్ పార్టీ ఇవ్వాలి...” ఇలా రకరకాల మాటలతో రాహుల్ బుర్రనిండా కల్పనల కలుపు మొక్కల్ని నాటారు.

“అరేయ్, అలాంటిదేం లేదురా” అని రాహుల్ అనగానే...

“ఒరేయ్ పిచ్చోడా... లేనిపోని అనుమానాలతో గోల్డెన్ ఛాన్స్ మిస్ చేసుకోవద్దు. ఎంజాయ్ మామా” అంటూ వెళ్ళిపోయారు.

రాహుల్ ఆ రాత్రంతా నిద్రకు దూరమై, సందేహాల పుట్టకు




చేరువయ్యాడు. అనేక సందిగ్ధాల మధ్య ఆదివారం సాయంత్రం అందంగా తయారయ్యి ఊర్మిళ మేడం ఇంటికి వెళ్ళి తలుపు తట్టాడు. తలుపు తీసిన ఊర్మిళ రాహుల్ చేయి పట్టుకొని హాల్‌లోకి తీసుకువెళ్ళి సోఫాలో కూర్చోబెట్టింది. ఆ చేయి తాకగానే రాహుల్‌లో ఏదో తెలియని భావసంచయం.

మంచినీళ్ళ గ్లాస్ చేతి కందించింది. రాహుల్ గుండె ఉన్నట్టుండి ఎందుకో చిన్నగా కంపించసాగింది. ఎప్పటిలాంటి చిరునవ్వుతోనే ఊర్మిళ రాహుల్ పక్కన కూచుంది. రాహుల్ మరింత బిగుసుకుపోయాడు. ఇంతలోనే విషాదం నిండిన మంద్ర స్వరంతో రాహుల్‌ను ఆహ్వానించిన సందర్భాన్ని చెప్పసాగింది. “ఈరోజు మా అబ్బాయి విశాల్ జన్మదినం. కానీ, వాడిప్పుడు నాతో లేడు” అంటూ ఎదురుగా ఉన్న గోడవైపు చూపింది. గోడమీద దండలు వేసిన రెండు ఫోటోలు పక్కపక్కనే కనిపించాయి. రాహుల్ ఒక్కసారిగా షాక్ తిన్నాడు. వాళ్ళబ్బాయి అచ్చం తన పోలికలతో ఉన్నాడు. దాదాపు తన ఈడువాడే!

“ఏడాది క్రితం వాడి బర్త్‌డే రోజు నాడే వాడి కోసమని షాపింగ్ చేసుకొని వస్తుంటే ఆక్సిడెంట్‌లో మా ఆయన, నా కొడుకు ఇద్దరూ నన్ను విడిచి వెళ్ళారు. ఆనాటి నుండి నా జీవితంలో అంతా శూన్యమే నిండింది. నేనూ చనిపోవాలని అనుకున్నాను. కానీ, మాథమెటిక్స్‌లో గోల్డ్‌మెడలిస్ట్‌నైన నేను, బోధనారంగంలో ఉన్నందున నా జ్ఞానాన్ని మీలాంటి యువతకు పంచి, ఈ దేశ సంపదగా మిమ్మల్ని తయారుచేయాలన్న సంకల్పంతో బతుకుతున్నాను. మీ అందరిలో నా కొడుకును చూసుకుంటున్నాను. ముఖ్యంగా, నువ్వు అచ్చం నా కొడుకు లాగానే ఉన్నావు. నిన్ను చూసిన ప్రతిసారి నా కొడుకు జ్ఞాపకాలే గుర్తుకొస్తున్నాయి. అందుకే ఈ రోజు నా చేతితో నీకు భోజనం తినిపించాలనుకున్నాను. చాలా సందర్భాల్లో నా కొడుకుకు ఇష్టమైన స్వీట్లు, తినుబండారాలు నీకు తినిపించి తృప్తిపడేదాన్ని...”

రాహుల్ కళ్ళు రెండూ కట్టలు తెగిన కాలువలయ్యాయి. గుండె పగిలి నెత్తురు ఎగజిమ్మిన బాధ ఏదో లోపల మెలిపెట్టసాగింది. తన హృదయాంతరాళంల్లో అకస్మాత్తుగా జరిగిన పెను విస్ఫోటనానంతర శబ్దంలా... “అమ్మా” అంటూ బిగ్గరగా పెకిలిన ఒక్క మాటతో తనకు తెలియకుండానే ఆమె వొళ్ళో వాలిపోయాడు రాహుల్. ఇంకాసేపైతే, కారీ కారీ కాలువలయ్యే కన్నీరు ఆమె కాళ్ళను కడిగేందుకు సిద్ధమవుతున్నాయి. మనసు మబ్బులు తొలగిన ఆకాశమై తేటపడసాగింది.

వ్యాసం

# మధ్యయుగ ఆంగ్ల సమాజాన్ని చిత్రించిన కాంటర్బరి టేల్స్

చాసర్‌లోని కాలంలోని అనేక వర్గాలలో సామాజికత వ్యక్తం చేసిన వ్యాసం...

కాంచనపల్లి గోవర్ధన్ రాజు

చాసర్ ఆంగ్లంలో మొదటి సృజనకారుడే కాకుండా స్థానికతను ప్రదర్శించిన మొదటి కవి కూడా. ఫ్రెంచ్ లాటిన్ భాషల్లో నిష్ణాతుడైనప్పటికి ఆంగ్ల జాతిని ప్రతిఫలించే రచనలకే అస్కారంగా నిలువడం విశేషం. నిజానికి కాంటర్ బరీ టేల్స్ (canterbury Tales) ప్లాటు బెకాచియో (Baccacio) డేకామేరోన్ (Decameron) ఆధారంగా గ్రహించాడు. అవయితే ఇది చాసర్ చేతిలో అనేక విధాలుగా రూపాంతరం చెందింది. నూటా ఇరవై నాలుగు కథలుగా కొనసాగాల్సిన సుదీర్ఘ కథా ప్రస్థానం ఇరవై తొమ్మిది వరకే సరిపెట్టాల్సి వచ్చింది. చాసర్ సాహిత్యం నాటి సమకాలీన ఆంగ్ల సమాజానికి గొప్ప ప్రతిఫలంగా గ్రహించాలి. ఆయన ప్రకటించిన ఇరవై తొమ్మిది కథల్లో ఆహార్యం గురించి తీసుకున్న శ్రద్ధ అనితర సాధ్యం. వస్త్రధారణ పాత్రలు కనిపించిన తీరు, పాత్రల హాబీలు, హావభావాలు, మనోవైచిత్రి, మానవుని సహజచైతన్యం ప్రతిఫలించాయి.

చాసర్ పాత్ర చిత్రీకరణ విధానం ఒక చిత్రకారున్ని తలపిస్తుంది. ఆయన కలంకుంచె ప్రతి యాత్రికున్ని ఒక కదలుతున్న చిత్రంగా మన కళ్ళముందు నిలుపుతుంది. యాత్రికుల స్వభావ చిత్రణలో చాసర్ శిల్పనైపుణ్యం పూర్తిగా కనబడుతుంది. ఈ పాత్రలన్నీ వాస్తవ జీవితం నుండి తీసుకున్నవే. Tabard, Harry Bailey ,The wife of the Bath, Clerik of Oxford, లాంటి పాత్రలన్నీ సభ్యసమాజంలో కనబడేవే. వాళ్ళంతా మన కళ్ళముందు కదిలే మానవాకారాలే. చాసర్ యాత్రికులను వర్ణించడంలో పాత పద్ధతులనే ఎన్నుకొన్నాడు. ఒక క్రమమైన విధానం ఆయనలో కనిపించదు. అతను పాత్రను అభివర్ణిస్తూనే కథా ప్రారంభం చేస్తాడు. తరువాత పాత్రల ఆహార్యాన్ని, వస్త్రధారణను వర్ణిస్తాడు. మళ్ళీ పాత్రల వ్యక్తిత్వాన్ని స్పృశిస్తాడు. సహజత్వాన్ని చూపించడానికి పాత్రలతో సామాన్య భాష మాట్లాడిస్తాడు.

చాసర్ వస్త్రధారణ వర్ణించడంలో చాతుర్యం కనబడుతుంది. Squire వస్త్రధారణను వర్ణిస్తూ అవి ఎర్ర రంగు కలిగి తెల్ల పూసలతో, బొమ్మలతో, అందమైన పచ్చిక బయళ్ళు స్ఫురిస్తాయంటాడు.అటవీ శాఖాధికారి ఆకుపచ్చని రంగుకలిగిన దుస్తులు ధరిస్తే అతని భార్య సిందూర ఎరుపు దుస్తులు ధరించిందట. ఆజ్ఞాపించే వాని రంగు దట్టమైన ఎరుపుతో వుంటే Miller గడ్డం ఎర్రగా ఉంది. ఒక్కోసారి చాసర్ తన భావాన్ని వ్యక్తం చేయడానికి తీవ్రమైన రంగును ఉపయోగిస్తాడు. గడ్డం దేశీయ పద్ధతులలో తెలుపుగా ఉండటానికి బదులుగా గడ్డం ఎర్రగా ఉంది. చాసర్ తన పాత్రలని ఔచితీ వంతంగా ఉంచడానికి భాషలో ధ్వనులు సృష్టిస్తాడు. సన్యాసుల గుర్రాలకు కట్టిన గంటలనుండి చాసర్ గమ్మత్తైన శబ్దాలు పలికిస్తాడు. చాసర్ వస్తునిర్వహణలో సరైన ఉపమలు రూపకాలు ప్రయోగిస్తాడు. చాసర్ సృష్టించిన అన్ని పాత్రలూ ఒకదానికొకటి అవినాభావ సంబంధం కలిగి ఉంటాయి. అదే సమయంలో Reeve, Miller, Mimicing. Priyores, మొదలైన పాత్రలన్నీ దేనికదే ప్రత్యేకంగా కూడా ఉంటాయి.

A.C.Ward అన్నట్టుగా చాసర్ పాత్రల్లో దేనికదే ప్రత్యేకత ఉంటుంది. అవి కేవలం చిత్రాలుగా కాక మానవులలాగే కనిపిస్తాయి. కొంతమంది శ్రామికులను ఈ కథాప్రస్థానం నుండి మినహాయించాడు చాసర్.

యాత్రికులుగా వెళ్ళదలచుకొన్న ముప్పైమంది థాబార్డ్ (Thabard)లో కలుసుకొంటారు. ఇది తేమ్స్ పక్కన సౌత్ వార్క్ (south vark)లో లండన్‌లో ఉంటుంది. వాళ్ళు ప్రయాణంలో కథలు చెప్పుకోవడానికి ఇష్టపడతారు. హర్రీ బ్యాల్లీ (Harry Bally) దాబార్డ్‌లో వాళ్లకు ఆతిథ్యం ఇస్తాడు. అన్ని ఉత్సవాలలో మార్గ దర్శకంగా వ్యవహరిస్తాడు. కథలోని General Prologueలో ప్రయాణీకులంతా ఒక Sketh లో ఉంటారు.

వ్యాసం

ప్రయాణీకులంతా ఇరవైనాలుగు కథలు చెప్పుకొంటారు. చాసర్ తన రచనా ప్రణాళికను పూర్తిగా అనుసరించలేక పోయాడు. కాంటర్ బరీ నుండి తిరుగు ప్రయాణాన్ని చాసర్ చిత్రించలేక పోయాడు. కొందరు యాత్రికులు కథలు చెప్పరు. చాసర్ విభిన్న వ్యక్తిత్వాలను ఈ యాత్రా చిత్రంలో ఏకం చేయడానికి ప్రయత్నించాడు. కథల్లో కథనం కవితాత్మకంగా కొనసాగుతుంది. అక్కడక్కడా వచనం కూడా ఉంటుంది. కథలలో మతాతీత స్థితి గుణీభూత వ్యంగ్యంగా స్ఫురిస్తుంది. చివరికి అంతర్లీనంగా ఆధ్యాత్మిక దృక్పథం చూస్తాం.

కాంటర్ బరీ టేల్స్‌లోని ఇరవై నాలుగు కథల్లో ప్రత్యేకత, ఏకసూత్రత కలిసి ఉన్నాయని ఈ వరకే చెప్పడం జరిగింది. Knights Tale కథలో క్రూరమైన రాజుచే తమ భర్తలు నిహతులు కావడం వల్ల విషాదానికి లోనౌతారు. తమ భర్తలను క్రూరంగా చంపినా అమెజాన్ రాజు వాళ్ళ శవాలను కూడా తమకు ఇవ్వడానికి నిరాకరించా డని విలపిస్తారు. థియాసిస్ తను వివాహమాడిన భార్యతో, మరదలితో తన రాజధానికి వెడుతున్నపుడు ఈ దు:ఖితులైన స్త్రీలు ఎదురుపడతారు. వాళ్ళు తమ విషాదగాథ వివరించి విలపిస్తారు. థియాసిస్ వెంటనే తన భార్యని, మరదలిని ఇంటికి పంపి రథాన్ని అమెజాన్ మీదికి యుద్ధానికి మరలిస్తాడు. యుద్ధంలో జయిస్తాడు. శవాల మధ్యన మరణావస్థలో ఉన్న ఫలేమాన్ (palemon) ఆర్ సైట్ (Arcite) అనే ఇద్దరు యుద్ధ వీరులను రక్షించి బంధించి తన రాజ్యానికి తీసుకువస్తాడు. వాళ్ళు ఉపశమించాక చెరసాలలో ఉంచుతాడు. ఆ వీరులు ఇద్దరూ చాలాకాలం జైలులో ఉంటారు. ఒకరోజు ఆర్ సైట్ పొద్దున్నే లేచి కిటికీ గుండా పూలు కోస్తున్న రాజు థియాసిస్ మరదలు ఇమిలీని చూస్తాడు. తరువాత ఫలేమాన్ కుడా చూస్తాడు. ఆమె ప్రేమ కోసం వాళ్ళ మధ్య తగవు బయలు దేరుతుంది. ఫలేమాన్ మరొక రాజ కుమారుడు. ప్రెమితియస్ (Perotheous) సహాయంతో జైలు నుండి బయటకు వస్తాడు. రాజు అతనికి దేశ బహిష్కరణ శిక్ష విధిస్తాడు. ఆర్ సైట్ రాజ్యం బయటికి వెళ్లి పనివాని వేషంలో వచ్చి ఇమిలీ దగ్గరే చేరుతాడు. ఇక ఫలేమాన్ జైలు నుంచి తప్పించుకొని వెళ్లి సైన్య సమీకరణ చేస్తాడు. తరువాత ఈ విషయం అంతా తెలిసికున్న రాజు ఆగ్రహంతో ఇద్దరినీ చంపాలనుకొంటాడు. కాని భార్య, మరదలి, అభ్యర్థన వల్ల చంపకుండా వదలి, వాళ్లకు యుద్ధ పరీక్ష పెడతాడు. ఎవరు ఆ బాహాబాహిలో విజయం సాధిస్తే వాళ్లకు ఇమిలీ వశమౌతుంది.




ఫలేమాన్ తన ప్రేమవిజయం కోసం ఒక దేవతను ప్రార్థిస్తాడు. ఆర్ సైట్ మరొక దేవతను ప్రార్థిస్తాడు. ఇమిలీ కూడా తనకు వివాహమే వద్దని దేవతని ప్రార్థిస్తుంది. చివరికి ఆ దేవత ఆ వరం ఇవ్వడానికి నిరాకరిస్తుంది. చివరికి ఇమిలీ తనకు తగిన వరుడు కావాలనే వరం అడుగుతుంది. చివరికి బాహు యుద్ధంలో ఆర్ సైట్ గెలుస్తాడు. ఇమిలీ ఆర్ సైట్‌ను వరిస్తుంది. ఈ కథలో నాటి సామాజిక స్థితి రణోన్మాదం, రాజకుటుంబాల క్రౌర్యం, చక్కగా చిత్రించాడు. చాసర్ కాంటర్బరీ టేల్స్ అన్నింటిలోను నాటి సామాజిక చిత్రణ కనబడుతుంది.

అట్లాగే ది మిల్లర్స్ టేల్‌లో ఒక యువ విద్యార్థి వడ్రంగి భార్యను సమ్మోహనం చేయడం భర్త వృద్ధుడు భార్య యౌవ్వని. మధ్యయుగాలలో ఇట్లాంటి వివాహాలు సాధారణం. విద్యార్థి నిల్ లవ్ వడ్రంగి భార్య అలిసన్ వైపు ఆకర్షితు డౌతాడు. అట్లాగే 'ది వైఫ్ అఫ్ బాల్స్ ప్రొలాగ్ అండ్ టేల్స్' కథ. బాల్ నగరానికి చెందిన ఒక సద్గురువు కథ ఇది. ఒక యువతి ఈ కథలో అయిదు సార్లు పెళ్లాడుతుంది. తన భర్తల మరణం తనకు సంపద చేకూరుస్తుందని ప్రకటిస్తుంది. స్త్రీ వివాహంలో పురుషునితో సమానమైన లేదా ఉన్నతమైన అధికారం పొందాలని ప్రకటిస్తుంది.

'ది ఫ్రాంక్లిన్ టేల్ కథ'లో ఫ్రాంక్లిన్ ధనవంతుడు. అతడు తన అదృష్టాన్ని జ్ఞానాన్ని అందరితో పంచుకోవాలను కొంటాడు. అధికారంలో ఉన్న సిసిరోతో తనకు స్నేహం ఉందని ప్రకటిస్తాడు. దొరిజన్ అనే పాత్ర తన భర్త ప్రేమ ఎట్లా ఉందో చూపిస్తుంది. చాసర్ కథల్లో మానవ స్వభావ వైరుధ్యం, నాటి సంక్లిష్ట సమాజం మనకు అన్యాపదేశంగా తప్పినా కొద్దీ కనిపిస్తూనే ఉంటాయి.

కథ

# సుపుత్రులు

గురువుపట్ల భక్తి చూపించిన శిష్యుని కథ...



కటుకోజ్వల మనోహరాచారి
94410 23599

పది రోజుల నుండి ఆ గేటు తలుపులు తెరుచుకోవడం లేదు.

ఆ ఇంటికి ఎదురుగా కాస్త దూరంలో ఓ కిరాణాషాపు యజమాని సహకారంతో, మరో ఇద్దరు కానిస్టేబుళ్లను వెంట బెట్టుకొని గేటు తెరిపించి లోనికి అడుగుపెట్టాడు ఎస్సై నాగేంద్ర.

"స్టేషన్‌కు ఫోన్ చేసింది నువ్వేనా..?" అన్నాడు ఎస్సై కిరాణాషాపు యజమానితో.

"లేద్సార్.."

కిటికీలోంచి దూకి లోనుండి గడియ పెట్టబడి ఉన్న ద్వారం తెరిచాడు ఓ కానిస్టేబుల్.

"నువ్వు చెప్పినట్టు దాదాపు పదిరోజుల్నుండి ఆ గేటే కాదు, ఏ ద్వారమూ తెరుచుకోలేదు" అన్నాడు ఎస్సై. అందరూలోనికి అడుగు పెట్టారు.

ఊహించినట్లే ఆ వృద్ధుడు పడక కుర్చీలో అచేతనంగా పడి ఉన్నాడు. బెడ్ పక్క ఖాళీ వాటర్ బాటిళ్లు, ఖాళీ అయి పోయిన బ్రెడ్‌కవరూ పడి ఉన్నాయి. ఇంట్లో పెద్ద సామానేమీ లేకున్నా అస్తవ్యస్తంగా ఉంది. పైన ఫ్యాన్ తిరుగుతూ ఉంది.

"ఇంటి ఓనర్ ఇతనేనా..?" ప్రశ్నించాడు ఎస్సై.

"కాదుసార్! ఇది దామోదర్‌రావు దొరది. చాలా ఏళ్లనుండి వాళ్లు ఇక్కడ ఉండడం లేదు. ఐదారేళ్లు అవుతుందనుకుంటా, ఈ ముసలాయన ఈ గదిలో అద్దెకు ఉంటున్నాడు. అద్దె కూడా తీసుకోవడానికి ఎవరూ వచ్చినట్లు కనిపించదు సార్ అన్నాడు షాపు యజమాని.

పది నిముషాల్లో అంబులెన్స్ వచ్చింది. జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించబడ్డాడు ఆ వృద్ధుడు. డాక్టర్లు ప్రాథమికంగా పరీక్షించి ప్రాణాలు పోలేదు కాని, పోవడానికి సిద్ధంగా ఉన్నాయని తేల్చారు.

వాస్తవంగా తేలిందేంటంటే గత కొన్నాళ్ల నుండి ఆ వృద్ధుడు సరైన ఆహారమే తీసుకోవడంలేదు. ముఖ్యంగా ఈ పదిరోజుల్నుండి అసలేమీ తినలేదు. పూర్తి నిరాహారంతో ఉండడంవల్ల శరీరం పూర్తిగా శక్తిహీనమై చిక్కిశల్యమైంది. తిరిగి పుంజుకోవడం కూడా కష్టంగా మారింది.

వైద్యులు వెంటిలేటర్ మీద ఉంచి అవసరమైన చికిత్సతో పాటు శరీరంలో తిరిగి శక్తిని పొందేలా ప్రయత్నం చేస్తున్నారు. ఎంతకాలానికి కోలుకుంటాడో, అసలు కోలుకుంటాడో లేదో కూడా తెలియని పరిస్థితి. ఎవరితను?

దాదాపు డెబ్బై ఏండ్ల వయస్సు పైబడిన వ్యక్తి. ఇన్నిరోజులుగా ఆహారం తీసుకోకుండా ఇంత నిస్సహాయ స్థితిలో మగ్గడానికి గల కారణాలేంటి?

ఎస్సై నాగేంద్ర ఆ వృద్ధునిమీద ప్రత్యేకమైన శ్రద్ధ కనబరుస్తూ అతని సమాచార సేకరణకు సిద్ధమయ్యాడు మురళీధరాచార్యులు.

ముప్పై ఏళ్లకు పైగా తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేసి పదవీ విరమణ చేశాడు. ధర్మారం మండల కేంద్రం పక్కనే మేడారం అతని స్వగ్రామం. భార్య రమాదేవి ఐదేళ్ల క్రితం కాలం చేసింది. అప్పట్నుండే అతని జీవితం దుర్భరమైంది.

అట్లని అతను పిల్లల్లేని అభాగ్యుడేమీ కాదు. కొడుకూ, కూతుర్ని సశాస్త్రీయంగా పెంచి పెద్దచేశాడు. విద్యాబుద్ధులు నేర్పాడు. వాళ్ల చదివిన ఉన్నత చదువులకు ఈ దేశంకంటే పరాయి దేశాలే ఎక్కువ ఆకర్శించాయి. కొడుకు రవికిరణ్ ఓ మల్టీ నేషనల్ కంపెనీ లక్షల పాకేజికి ఆకర్శితుడై అమెరికా వెళ్లి పోయాడు. అక్కడే పరిచయమైన ఓ బెంగుళూరు అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు కూడా. కొడుకు తన ఆకాంక్షలను, సంస్కృతీ సాంప్రదాయాలను అమెరికాలో పాతరబెట్టాడనే అసంతృప్తి ఉంది మురళీధరాచార్యుల్లో.

ఈ లోపు కూతురు విద్యావంతురాలై తనూ అమెరికా సంబంధాన్నే కోరుకుంది. తన ఆకాంక్షలను కాదనలేక అమెరికాలోనే స్థిరపడిన ఓ ఎన్నారైతో ఘనంగా పెళ్లి

క
థ

జరిపించాడు.

అంతే! కొడుకూ కోడలు, కూతురు అల్లుడూ. అందరూ ఉద్యోగాలు చేసుకునేవారే! లక్షల్లో సంపాదన. మనవలు, మనవరాళ్లతో ఆచార్యుల జీవితం పున్నమి వెన్నెల్లో నందనవనంలా.. మనసుకింపుగా ఆహ్లాదభరితంగా సాగిపోవాలి. కానీ ఆ బిడ్డలు ఇండియాలో తమను కన్న తల్లిదండ్రులున్నారన్న విషయాన్ని మర్చిపోయేంత బిజీగా మారి పోయారు. తండ్రి పదవీ విరమణో త్సవానికి కూడా రాలేనంత పనిలో నిమగ్నమయ్యారంటే వాళ్లెంత పాశ్చాత్య జీవితానికి అతుక్కుపోయారో అర్థం చేసుకోవచ్చు.

వందలమంది విద్యార్థులకు దేశభక్తిని, మాతృదేశానురక్తిని పెంచగలిగిన ఆచార్యుల వారిలో, తన పిల్లలకే అవి ఒంట బట్టకపోవడం పట్ల అసంతృప్తి మరింత పెరిగింది. ఆయన భార్య పూర్తిగా బెంగ పెట్టుకొని మంచం పట్టింది.

ఐదేళ్ల క్రితం తల్లి మృతి మాత్రం వాళ్లను ఇండియా రప్పించింది. అంత్య క్రియలు, కర్మకాండలూ అయ్యాక తిరిగి

> **మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచి, ఆచార్యుల పిల్లల్నుండి సమాచారం వచ్చాక తనకు ఫోన్ చేయండని చెప్పి పోలీస్ స్టేషన్‌కు వచ్చేశాడు నాగేంద్ర. సాయంత్రానికి ఆసుపత్రి సిబ్బంది నుండి ఫోనొచ్చింది. "మృతి చెందిన మురళీ ధరాచార్యుల తాలూకు కుటుంబ సభ్యుల్నుండి ఎట్లాంటి స్పందనా రాలేదు సార్.." కొన్ని క్షణాలు ఆలోచించాడు ఏస్పై. ఆసుపత్రి సుపరింటెండెంట్‌కు కాల్ చేసి ఆయన లైన్‌లోకి రాగానే "మురళీ ధరాచార్యుల డెడ్‌బాడీని రేపటివరకూ మార్చురీలోనే సేఫ్‌గా ఉంచండి. మీడియా ప్రకటన కూడా ఇస్తున్నాం.**

వెళ్లారంటే ఇప్పటివరకూ భారత్‌లో అడుగు పెట్టలేదు. అయితే వెళ్తూ వెళ్తూ సమీపంలోని మండల కేంద్రంలో ఖాళీగా ఉన్న దామోదర్‌రావు భవనం ఓ గదిలో అద్దెకుంచి వెళ్లారు.

మురళీధరాచార్యుల్ని ఆసుపత్రిలో జాయిన్ చేసిన రోజే సాయంత్రానికి ఆయన కొడుకూ, కూతుళ్ల అడ్రసు, ఫోన్ నంబర్లు సంపాదించిన ఎస్సై నాగేంద్ర వాళ్లకు మురళీధరాచార్యుల పరిస్థితి మొత్తం వివరించాడు.

అయితే.. సమాచారం ఇచ్చి నాలుగు రోజులవుతున్నా అట్నుండి ఎలాంటి ప్రతిస్పందనా రాలేదు. ఇక్కడ ఆచార్యులు కూడా కోలుకుంటున్న వాతావరణం కనిపించడం లేదు.

నాగేంద్ర స్టేషన్‌లో ఓ సీరియస్ కేసు గురించి చర్చిస్తుండగా ఆసుపత్రి నుండి ఫోన్ వచ్చింది. అరగంటలో బయలు దేరాడు.

అప్పటికే డాక్టర్లు కన్ఫర్మ్ చేసేశారు.

"చాలా ప్రయత్నంచేశాం. చాలారోజుల్నుండి ఆహారం తీసుకోక పోవడంవల్ల ట్రీట్‌మెంటుకి శరీరం సరిగా స్పందించలేదు. తనవాళ్లెవరైనా వస్తారేమో... సిటీకి పంపించే ఏర్పాట్లు చేద్దామనుకున్నాం. ఇంకా ఎవరూ రాలేదుకదా! ఈలోపే గుండె స్పందన ఆగిపోయింది.."

ఎస్సై తలపట్టుకున్నాడు.

తండ్రి చావుబతుకుల మధ్య ఉన్నాడని నాల్రోజుల క్రితం సమాచారం ఇచ్చినా ఇప్పటివరకూ రాలేదు సరికదా. కనీసం ఫోన్‌చేసి తమ తండ్రి పరిస్థితి ఏంటని విచారించని బిడ్డల గురించి ఎట్లా అర్థం చేసుకోవాలి?

వయస్సు మీద పడిన తండ్రిని తమతో ఉంచుకోకుండా అనామకుడిలా వదిలేసివెళ్తే.. నెలల తరబడి సరైన ఆహారం తీసుకోకుండా ఇంట్లోనే ఉండి పోయిన తండ్రి. పదిరోజులపాటు అసలేమీ తినకుండా కుచించుకుపోయి, జీవచ్ఛవంగా మారిన ఆ పెద్దమనిషిని ఎవరు ఆదరించాలి??

లక్షల్లో జీతం తీసుకునే కొడుకూ, కూతుళ్ల కుటుంబాలు హాయిగా సాగిపోతుంటే.. ఇక్కడ అనాథలా, డొక్క వెన్నుకంటుకు పోయి ప్రాణాలు కోల్పోయిన తండ్రి దుస్థితికి ఎవర్ని బాధ్యుల్ని చేయాలి??

వెంటనే ఆసుపత్రి సిబ్బంది అమెరికాలో ఉన్న ఆయన పిల్లల మెయిల్‌కు సమాచారం పంపించారు. 'యువర్ ఫాదర్ ఈజ్ డెడ్, స్టార్ట్ ఇమీడియట్లీ..." అని.

మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచి, ఆచార్యుల పిల్లల్నుండి సమాచారం వచ్చాక తనకు ఫోన్ చేయండని చెప్పి పోలీస్ స్టేషన్‌కు వచ్చేశాడు నాగేంద్ర. సాయంత్రానికి ఆసుపత్రి సిబ్బంది నుండి ఫోనొచ్చింది. "మృతి చెందిన మురళీ ధరాచార్యుల తాలూకు కుటుంబ సభ్యుల్నుండి ఎట్లాంటి స్పందనా రాలేదు సార్.."

కొన్ని క్షణాలు ఆలోచించాడు ఏస్పై. ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు కాల్ చేసి ఆయన లైన్‌లోకి రాగానే "మురళీ ధరాచార్యుల డెడ్‌బాడీని రేపటివరకూ మార్చురీలోనే సేఫ్‌గా ఉంచండి. మీడియా ప్రకటన కూడా ఇస్తున్నాం. రేపటివరకు ఎవరైనా రావచ్చు. లేదంటే ఏం చేయాలో రేపు నిర్ణయిద్దాం సర్.." అన్నాడు.

సూపరింటెండెంటు సరే అన్నాడు.

నాగేంద్ర పది నిముషాలపాటు ఆలోచించాడు. ఒక నిర్ణయానికొస్తూ షికాగోకు ఫోన్ కలిపాడు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా కలవడంలేదు. కెనడాలో ఉంటున్న కూతురుకు ప్రయత్నించినా అదే పరిస్థితి.

నాల్రోజుల క్రితం పనిచేసిన ఫోన్లు ఇప్పుడెందుకు పనిచేయడంలేదో అర్థం కావడంలేదు. చివరకు వాట్సాప్‌లో మెసేజ్ పంపించి అట్నుండి స్పందన కోసం ఎదురు చూస్తున్నాడు.

స్వయంగా భోజనాన్ని సమకూర్చు కోలేక, బయటకువెళ్లి కనీసం బ్రెడ్ ముక్కలు కూడా తెచ్చుకోలేని స్థితిలో గదికే అంకితమై, రోజులతరబడి తిండి తినక ఎముకలగూడులా మారి చివరకు

ఆసుపత్రిలో మృతి చెందిన ఆచార్యుల ఫోటోను చూపిస్తూ ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలు కథనాలు ప్రసారం చేశాయి. కొడుకు, కూతురు, ఇతర సంబంధీకులు ఇప్పటికైనా స్పందించి మృతదేహాన్ని ఆసుపత్రి నుండి తీసుకెళ్లాలని సూచించాయి.

అదేరోజు సాయంత్రానికి ఓ వ్యక్తి ఆసుపత్రికి వచ్చాడు. అక్కడేఉన్న ఎస్సైకి విష్ చేస్తూ "మృతదేహం తాలూకు కుటుంబీకులు వచ్చారా సర్..?" అన్నాడు.

"మీరెవరు?" అన్నాడు నాగేంద్ర.

"నాపేరు అశోక్‌రావు. మురళీధరాచార్యులు ఉంటున్న ఇంటి యజమానిని. మీకు ఆయన గురించి ఫోన్‌లో సమాచారం ఇచ్చింది నేనే."

ఎస్సై ఆశ్చర్యపోయాడు. "మీరేమైనా సాయం చేయగలరా?" అన్నాడు.

"నా సాయం ముఖ్యం కాద్సార్, వృద్ధుడైన తండ్రిని మాఇంటి గదిలో అద్దెకుంచి, అమెరికాలో ఉన్నతోద్యోగాలు చేసుకుంటూ, ఐదారేళ్లైనా తండ్రి స్థితి గురించి కన్నెత్తి చూడని ఆ మర మనుషుల్ని ఇప్పుడైనా ఇండియా రప్పించాలని కోరుకున్నాను. మీరూ విఫలమైనట్టున్నారు..?"

నాగేంద్ర తలపంకించాడు.

"ఇంతకంటే ఏం చేయగలం?? ఆయన సొంతూరు మేడారం తీసుకెళ్తున్నాం. సంబంధీకులు ఎవరన్నా స్పందిస్తే సరి. లేకుంటే అధికారికంగా ఫార్మాలిటీస్ అన్నీ పూర్తిచేసి అనాథ శవంలా అంతిమ సంస్కారాలు నిర్వహిస్తాం."

"మీ సత్సంకల్పానికి తగిన స్పందన లభించాలని కోరుకుంటున్నాను." షేక్‌హ్యాండిచ్చి అశోక్‌రావు కదలి వెళ్లిపోయాడు.

"రిటైర్డ్ అయినంక ఆరేడేండ్ల అమ్మగారు బతికున్నంతకాలం హాయిగా ఉన్నరు. అమ్మగారు పోయినంక ఆళ్లపిల్లలే ఆయన్ను బలవంతంగా ఒప్పించి సంతకాలు చేయించిండ్రు. ఇళ్లమ్మేసి అమెరికా తీసుకపోతరేమో అనుకున్నం. కాని పక్కూల్లనే అద్దెకుంచి పోయింండ్రని తర్వాత తెల్సింది.."

**"రిటైర్డ్ అయినంక ఆరేడేండ్ల అమ్మగారు బతికున్నంత కాలం హాయిగా ఉన్నరు. అమ్మగారు పోయినంక ఆళ్లపిల్లలే ఆయన్ను బలవంతంగా ఒప్పించి సంతకాలు చేయించిండ్రు. ఇళ్లమ్మేసి అమెరికా తీసుక పోతరేమో అనుకున్నం. కాని పక్కూల్లనే అద్దెకుంచి పోయిండ్రని తర్వాత తెల్సింది.." మురళీధరాచార్యుల ఇంటిని కొనుక్కున్న వ్యక్తి చెబుతున్నాడు.**

మురళీధరాచార్యుల ఇంటిని కొనుక్కున్న వ్యక్తి చెబుతున్నాడు.

ఆచార్యులకు తన సొంతూర్లో చిన్నగూడు కూడా లేదు. శవాన్ని ఊల్లో ఎక్కడ ఉంచేది..? ఎట్లా దహనం చేసేది?? ఊళ్లో ఆత్మీయులు, బంధువులు కూడా ఎవరూ ఉన్నట్లు లేదు.

నాగేంద్ర మల్లగుల్లాలు పడుతున్నాడు. నా అనే మనుషులు, నాది అనే చోటులేని ఆ అనాథుని శవానికి ఏ నాథుడు అంతిమ సంస్కారాలు నిర్వహించేది?

పుట్టినిల్లు లేకున్నా అది పుట్టినూరే కదా! వేర్వేరు ఊళ్లలో పనిచేసినా చాలాకాలం ఇక్కడే పిల్లలకు పాఠాలు చెప్పిన వ్యక్తి ఆ బడుగుమూర్తి పార్థివ దేహాన్ని అక్కడే పంచాయితీ భవనం వరండాలో బల్లపై... నాగరిక సమాజంలో అనాగరికుల్లా మారుతున్న జనాన్ని ప్రశ్నిస్తున్నట్లుగా పడుకోబెట్టారు.

ఊరిజనం అలా చూస్తూ వెళ్తున్నారు. గంటలు గడుస్తున్నాయి. నాగేంద్ర గ్రామ కార్యదర్శి, రెవెన్యూ అధికార్లతో మాట్లాడాడు.

కొడుకు, కూతురు, మనవలు, మనవరాళ్లు, వాళ్ల లక్షల సంపాదన, రిటైర్డ్ ఉద్యోగిగా పెన్షన్... అన్నీ ఉన్న ఓ దౌర్భాగ్య జీవి మృతదేహం కొద్దిగంటల్లో గ్రామ పారిశుధ్య కార్మికుల చేత దహనం కాబోతుంది.



ఎందరికో చదువు చెప్పిన గురువు..! మరెందరికో బతుకుదెరువు చూపిన తరువు... !! నేడు అనాథుడై, నిరాదరుడై సొంత ఊరులోనే పరాయిలా దిక్కులేని శవమై దహించబడబోతోంది.

అప్పుడో ఊహించని సంఘటన జరిగింది. ఓ వాహనం వచ్చి పంచాయితీ భవనం ముందు ఆగింది. వెనకనుండి పదిమంది యువకులు దిగివచ్చి... ఆ విగతజీవి పాదాలకు మొక్కారు.

"వందలాది మంది పిల్లలకు పాఠాలు చెప్పిన గురువాయన. మాలాంటి ఎందరో శిష్యుల్ని తీర్చిదిద్దిన మహనీయుడు. ఎంతోమంది పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించిన ఆత్మీయ గురువు. ఆయన బిడ్డలు ఆయన్ని నిర్లక్ష్యం చేసినా మేమంతా ఉన్నాం. ఆయన అంతిమ వీడ్కోలు మా చేతులమీద జరిపే అవకాశం కల్పించండి సర్" ఎప్పై నాగేంద్రను చేతులు జోడించి వేడుకున్నారు ఆ యువకులు.

నాగేంద్ర మొహంలో ఒక చిరువెలుగు. ఒక్క నిముషం ఆలోచించకుండా 'సరే'' అన్నాడు. మరుక్షణం ఆ పదిమంది యువకులు సగౌరవంగా మురళీధరాచార్యుల మృత దేహాన్ని వాహనంలోకి ఎక్కించారు. వారితో పాటు ఎప్పై నాగేంద్ర కూడా బయలుదేరాడు. వాహనం ఊరిమధ్య బడి వద్దకు చేరింది. అది ఒకప్పుడు ఆయన పాఠాలు చెప్పిన బడి. ఇప్పుడదే ఆయన దేహానికి తల్లిఒడి అయ్యింది. వందలకొద్దీ పోగైన యువకులు ఒకరొకరుగా ఆచార్యుల పార్థివదేహానికి పూలమాలలు, పుష్పగుచ్ఛాలుంచి నమస్కరిస్తున్నారు.

అప్పటికే పూలపల్లకీ లాంటిది సిద్ధం చేయబడిఉంది. గంటతర్వాత ఆచార్యుల పార్థివదేహం ఆ పల్లకీలోకి ఎక్కించ బడింది. యువకులంతా మూకుమ్మడిగా పల్లకీ ఎత్తారు. జయజయధ్వానాలతో ముందుకు కదిలింది. వందలాది మంది యువకులు, విద్యార్థులు వెంట నడుస్తున్నారు. చదువంటే ఆసక్తి చూపని పిల్లలకు చదువుయొక్క ఆవశ్యకతను నొక్కిచెప్పి, పనిచేయక తిరిగే పిల్లలకు పనిపట్ల ఆసక్తిని పెంచి, నిష్ప్రయోజకులవు తారనుకున్న పిల్లల్ని ప్రయోజకుల్లా మార్చి, ఎందరో శిష్యుల్ని డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, రాజకీయ నాయకులుగా తయారయ్యేలా తీర్చిన మహోన్నతుడికి.. కన్నబిడ్డల అండలేకున్నా అంతిమ దశలో అంతకంటే మిన్న అయిన సుపుత్రుల ఆదరణతో అంతిమయాత్ర సాగుతుంది.

అక్కడ జనం వందలు వేలయ్యారు. పూలవర్షం కురుస్తుంది. అడుగడుగునా జననీరాజనం చూసి, తనకూ గురువైన ఆచార్యుల శవపల్లకీ మోస్తున్న ఎప్పై నాగేంద్ర తన్మయుడయ్యాడు.

ఇంకా సమాజంలో చచ్చిపోని సంస్కారం... రాజలాంఛనాలతో ఆ మహోపాధ్యాయుని పార్థివదేహాన్ని స్మశానానికి తరలించడంలో తరించిపోతుంది.

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునికోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

# "నాగర కందనూలు కథ" పుస్తక పరిచయం

కపిలవాయి కథా కథనం పరిచయం చేసిన వ్యాసం...



ఆమ్ గోత్. వెంకట్ పవార్
94404 22020

సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిన ప్రస్తుత కాలంలో ప్రపంచ చరిత్ర లిఖిత పూర్వకంగా మన గుప్పిట్లో ఉన్నా, మన చుట్టూ ఉన్న మన స్థానిక చరిత్ర మనకు తెలవకపోవడం, వాటిపట్ల మనకు అవగాహన లేకపోవడం దురదృష్టకరం. వలసపాలకుల పాలనలో తెలంగాణ చరిత్ర, సాహిత్య, పరిశోధక అంశాలు మరుగున పడిపోయి, స్వరాష్ట్రంలో ఇప్పుడిపుడే మన చరిత్ర ను మనం లిఖించుకోవడం మనందరం గర్వించదగ్గ విషయమే....! తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ స్థానిక చరిత్రలను తవ్వి భావి తరాలకు అందించాల్సిన బాధ్యత నేటితరం పరిశోధకులు, రచయితలు, సాహితీవేత్తలపై ఉందనేది వాస్తవం.

డా॥ కపిలవాయి లింగమూర్తి "నాగర కందనూలు కథ" చరిత్రను చెప్పడానికి క్రీ.పూ 3021 నుండి క్రీ.శ 2016 నాగర్ కర్నూల్ జిల్లాగా ఏర్పడే వరకు జరిగిన అనేక సంఘటనలు, ప్రాచీన చరిత్ర, కథలు, శాసనాలు లాంటి వాటిని ఉదహరిస్తూ లోతైన పరిశోధక అంశాలను ప్రస్థావిస్తూ పాఠకులకు ఆసక్తి కలిగేలా ఈ పుస్తకాన్ని రచించడం జరిగింది.

ఈ పుస్తకం నాగర్ కర్నూల్ జిల్లా వాసులతో పాటు తెలుగు రాష్ట్రాల పరిశోధకులు, రచయితలు, సాహిత్యాభిమానులకు మరుగున పడిపోయిన



స్థానిక చరిత్రను తెలుసుకునేందుకు, అధ్యయనం చేసేందుకు బాగా ఉపకరిస్తుంది.

ఈ పుస్తకానికి ముందుమాటలు "సరైన సందర్భంలో సరైన రచన" అంటూ ప్రముఖ కవి విమర్శకులు, రచయిత సంబరాజు రవిప్రకాష్ రావు, అలాగే "ప్రాత గుర్తులు" గుర్తుకు చేసుకుంటూ శ్రీ రంగాచార్య రాయడం జరిగింది. తెలంగాణ వికాస సమితి, వెన్నెల సాహిత్య అకాడమీ తరుపున ముచ్చర్ల దినకర్ వారి తల్లిదండ్రులు ముచ్చర్ల సునందాదేవి, రంగారావుల జ్ఞాపకార్థం ఎంతో వ్యయప్రయాసాలకోర్చి ముద్రించి మనకందించడం అభినందనీయం.

డా॥ కపిలవాయి లింగమూర్తి నాగర్ కర్నూల్ చరిత్రను చెప్పడానికి ముందుగా "నాగర్ కర్నూలు" అనే పేరు స్థిరనామంగా ఏర్పడడానికి గల అనేక కారణాలు, సంఘటనలు, ఆధారాలను ఉదహరిస్తూ చెప్పడం జరిగింది. కర్నూలు (ఆంధ్రప్రదేశ్) కు ఆ పేరు రావడానికి గల ఆధారాలను తులనాత్మకంగా చెబుతూ ఆ ప్రాంతంలోలాగానే నాగర్ కర్నూలు ప్రాంతంలోని నేలలో కూడా పిల్లలూదుకునే ఊపిరి బుంగల (బెలూన్) సైజులో నల్లరాతి గుండ్లున్నవి కనుక దీనిని గతంలో "కల్లూరు" అని పిలిచేవారన్నారు. (కల్లు అనగా రాయి)

అచ్చంపేట నుండి బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ కు రైతులు భర్తీ బండ్లు తీసుకుని పోతూపోతూ మార్గమధ్యలో ఈ "కల్లూరు" దగ్గర బండ్లు ఆపి కందెన వేసుకొనేవారట.దీని కారణంగా "కల్లూరు" కాస్తా "కందెనవోలు" గా మారిందని చెప్పారు.

ఇక్ష్వాకుల పాలనలో తెలంగాణలో బౌద్ధమతం వ్యాప్తిలో ఉండేది. బౌద్ధులు ఆనాడు ఈ ప్రాంతాన్ని "నాగభూమి" అని పిలిచేవారు. క్రీ.పూ 3021-31 మధ్య అలంపూరు ప్రాంతంలో నాగజాతి రాజులు స్థిరపడి పాలించిన కారణంగా దీనికి "నాగోలు సీమ" అనే పేరు కూడా ఉందని చెప్పడం జరిగింది. నాగజాతి

పుస్తక పరిచయం

రాజులు మహాశూరులు. వీరు నాగర్ కర్నూలు తాలుకాలోని ఒక ప్రాంతంలో గ్రామాన్ని నిర్మించడం జరిగింది. దాని పేరే "నాగపురం" అని దీనికి సంబంధించిన శాసనం ఉడిమిళ్ళలో ఉంది. వీరి మూల పురుషుడు "మాధవవర్మ"గా ఈ శాసనంలో చెప్పుకున్నారు. దీనికి సంబంధించిన మరో శాసనం నేటి "నాగపురం" గ్రామం వెలుపల ఉంది.




నాగులు పరిపాలించిన కారణంగా ఇక్కడ అనేక గ్రామాలకు వారి పేర్లున్నవి. ఉదా? నాగపురం, నాగవరం, నాగదేవుని పల్లె, నాగుల పల్లె, గనినాగుల, పాపకల్లు, అనే గ్రామాలు చాలా ఉన్నాయి. వీరికి సంబంధించిన మరిన్ని ఆధారాలు నేటి నందివడ్డెమాన్ (వర్ధమాన పురం)లో ఉన్న చెరువు కట్టకు 95 నాగ ప్రతిమలు తంతెలుగా పేర్చబడినవి. ఇంద్రకల్లులో ఏ పొలం దున్నిన నాగప్రతిమలు బయల్పడతాయి. నాగదేవుని పల్లెలో ఊరంతా నాగప్రతిమలే ఉంటాయి.

నాగజాతి రాజుల తర్వాత ఈ ప్రాంతాన్ని "పశ్చిమ చాళుక్యులు" తమ సామంతుల సాయంతో పాలన కొనసాగించారు.వీరిలో "నాగన-కందన" అను అన్నదమ్ములు ప్రసిద్ధులు.

**ఆనాటి నాగర కందనూలు అభివృద్ధి చెందడానికి వివిధ రకాలుగా కృషి చేసిన దమ్మోజు శ్రీకృష్ణం సోదరులు (కట్టెకోత మిషన్, బాయిబోరింగ్ రిపేరింగ్ సెంటర్) అబ్దుల్ ఖాదర్ (బస్ సర్వీసులు) మున్నూరు పాపయ్య పార్సా, పుట్టపాగ మహేంద్ర నాథ్ (జాతీయోన్నత పాఠశాల) పాలెం సుబ్బయ్య (పాలిటెక్నిక్ కళాశాల, డిగ్రీ కళాశాల) ల కృషిని కొనియాడడం జరిగింది.**

అన్నయైన నాగన తమ ప్రభువుల అనుమతి తీసుకుని "నాగనూలు" దగ్గర ఒక కోటను నిర్మించాడు. దీంతో వారి తమ్ముడు కందన కూడా ప్రస్తుత పాత కందనూలు స్థానంలో మరొక కోట నిర్మాణమును చేపట్టారు. ఈ కోటల నిర్మాణంలో పాల్గొన్న ఎందరో కూలీలు, శ్రామికులు, ప్రజలు ఇక్కడే స్థిరపడిపోగా కందన పేరు మీద "కందనవోలు"గా పిలువబడింది. అలాగే పరిణామక్రమంలో "నాగన, కందన"ల పేరు మీద "నాగర కందనూలు"గా స్థిరపడిపోయింది.

తర్వాత నిజాం పాలనలో క్రీ.శ 1794 నాటికే నాగర కందనూలు జిల్లాగా ఉన్నది. అనంతరం 1904 లో నాగర్ కర్నూలు జిల్లా కేంద్రాన్ని మహబూబ్ నగర్‌కి మార్చడం జరిగింది. నాగర్ కర్నూలు జిల్లాగా క్రీ.శ 1794 నుండి 1904 వరకు దాదాపుగా 110 సంవత్సరాలు కొనసాగింది. మళ్ళీ సరిగ్గా 112 సంవత్సరాల తర్వాత 2016లో 4 తాలూకాలతో జిల్లాగా ఏర్పడింది.

ఆనాటి నాగర కందనూలు అభివృద్ధి చెందడానికి వివిధ రకాలుగా కృషి చేసిన దమ్మోజు శ్రీకృష్ణం సోదరులు (కట్టెకోత

**ఈ పుస్తకం నాగర్ కర్నూల్ జిల్లా వాసులతో పాటు తెలుగు రాష్ట్రాల పరిశోధకులు, రచయితలు, సాహిత్యాభిమానులకు మరుగున పడిపోయిన స్థానిక చరిత్రను తెలుసుకునేందుకు, అధ్యయనం చేసేందుకు బాగా ఉపకరిస్తుంది.**

మిషన్, బాయిబోరింగ్ రిపేరింగ్ సెంటర్) అబ్దుల్ ఖాధర్ (బస్ సర్వీసులు) మున్నూరు పాపయ్య పార్సా, పుట్టపాగ మహేంద్ర నాథ్ (జాతీయోన్నత పాఠశాల) పాలెం సుబ్బయ్య (పాలిటెక్నిక్ కళాశాల, డిగ్రీ కళాశాల) ల కృషిని కొనియాడడం జరిగింది. ఇంకా ఈ పుస్తకంలో దెంది (డిండి) గంగాపురం, నల్లవాగు, గణపురం, దండుబాటలు, రెడ్డి వంశాలు, బాలేషహీద్, జిల్లా బంది, నీటి రగడ, కొల్లాపురం, అచ్చంపేట, కలువకుర్తి తాలూకాలు, భూమి కొలతలకి సంబంధించినటువంటి మనకు తెలియని అనేక అంశాలను స్పృశించారు.

కవిత



# సమాధానం



డా॥ చెమన్, 94403 85563

గాయాలు మానుతున్నప్పుడైనా
గతాలను ప్రేమించాలి

సేద తీరుతున్నప్పుడైనా
ఒంటిని తడిమి చూసుకోవాలి

వీపులపై నిలిచి పోయిన లాఠీ గాయాలైనా
మనసు తెరల పైన మానని
అవమానాల చిత్రపటాలైనా
ఈ విరిసిన చిరునవ్వుతో సత్కరించుకోవాలి

ఎన్ని మైళ్ళు నడిచామో
ఎన్ని రహదారులను నినాదాల
వరదలై ముంచెత్తామో

విశ్వవిద్యాలయాల ప్రాంగణాలన్నీ
ఎన్ని ఉద్యమ శపథాలై ఎదురు నిలిచాయో

ఎన్ని పోరాట గీతాలు
ఎందరు కవుల మేలుకొలుపు కవితా ధారలు

గాలి పురికొసలపైన పిడికిళ్ళను బిగించి
ఎన్ని గుండెలను జెండాలను చేసి ఎగరేసామో

గమ్యమొక్కటే ఆశగా, ఆచరణగా
ఎన్ని వందల లాంగ్ మార్చ్ నడకలమయ్యామో

నీ ప్రాంతమొస్తే ఏమొస్తుందన్న ప్రశ్నకి
నేనిప్పుడు ముప్పయి మూడు జిల్లాల
పరిపూర్ణ సమాధానం

నువ్వు మైదానమవుతావన్న మాటకు
కాళేశ్వరం చుట్టిన పచ్చని పావడే సమాధానం

అవమానాలు పడిన భాష
అసలు భాష కావడమే సమాధానం

అడవి సంస్కృతి అన్న నా బతుకమ్మను
నువు తలపై మోయడమే సమాధానం

సాహితీ శిఖరం

# జ్ఞాపకాల రచయిత...
# ఎలియాస్ కానెట్టి




1981 సాహిత్య నోబెల్ విజేత....

ఎలియాస్ కానెట్టి 25 జూలై 1905న జన్మించారు ఆయన ఒక జర్మన్ భాషా రచయిత, బల్గేరియాలోని రూస్‌లో ఒక వ్యాపారి కుటుంబంలో జన్మించారు. వియన్నాలో స్థిరపడ్డారు.

కానెట్టి 1938లో నాజీ హింస నుండి తప్పించుకోవడానికి ఇంగ్లండ్‌కు వెళ్లారు. అతను 1952లో బ్రిటిష్ పౌరసత్వం పొందాడు. అతను ఆధునిక నవలా రచయిత, నాటక రచయిత, జ్ఞాపకాల రచయిత మరియు నాన్ ఫిక్షన్ రచయితగా ప్రసిద్ధి చెందాడు.అతను 1981లో సాహిత్యంలో నోబెల్ బహుమతిని గెలుచుకున్నాడు, "విశాల దృక్పథం, ఆలోచనల సంపద మరియు కళాత్మక శక్తితో గుర్తించబడిన రచనలకు".ప్రసిద్ధి చెందాడు.బల్గేరియాలోని డానుబేలో ఉన్న రూస్ అనే నగరంలో వ్యాపారవేత్త జాక్వెస్ కానెట్టి మరియు మాథిల్డే నీ ఆర్డిట్టి దంపతులకు 1905లో జన్మించారు. అతని తల్లి అతను జర్మన్ మాట్లాడాలని పట్టుబట్టి, అతనికి నేర్పింది. ఈ సమయానికి కానెట్టి అప్పటికే లాడినో (అతని మాతృభాష), బల్గేరియన్, ఇంగ్లీష్ మరియు కొంత ఫ్రెంచ్ నేర్చుకున్నాడు. కనెట్టి 1924లో రసాయన శాస్త్రాన్ని అభ్యసించడానికి వియన్నాకు తిరిగి వెళ్ళాడు. అయినప్పటికీ, వియన్నాలో అతని సంవత్సరాలలో అతని ప్రాథమిక అభిరుచులు తత్వశాస్త్రం మరియు సాహిత్యంగా మారాయి. అతను 1929 లో వియన్నా విశ్వవిద్యాలయం నుండి రసాయన శాస్త్రంలో డిగ్రీని పొందాడు, కానీ రసాయన శాస్త్రవేత్తగా పని చేయలేదు.అతను గ్రేట్ బ్రిటన్‌కు తప్పించుకునే ముందు వియన్నాలో రెండు రచనలను ప్రచురించాడు, కొమోడీ డెర్ ఈటెల్‌కీట్ 1934 (ది కామెడీ ఆఫ్ వానిటీ) మరియు డై బ్లెండంగ్ 1935 (ఆటో-డా-ఫే, 1935). అతను నాజీ జర్మనీ అనుభవాలను మరియు రాజకీయ గందరగోళాన్ని తన రచనలలో ప్రతిబింబించాడు, అతను తన బహుభాషా నేపథ్యం మరియు బాల్యం యొక్క ప్రభావాన్ని ఆలోచిస్తూ జ్ఞాపకాల యొక్క అనేక సంపుటాలను వ్రాసాడు.

జర్మన్ భాషా రచయిత అయినప్పటికీ, కానెట్టి 1970ల వరకు బ్రిటన్‌లో స్థిరపడ్డారు, 1952లో బ్రిటిష్ పౌరసత్వం పొందారు. కానెట్టి ఎక్కువగా జ్యూరిచ్‌లో నివసించారు.



కథ

# విగ్రహం

సేవకు నిజమైన అర్థం చెప్పిన కథ...



యాకమ్మ
97042 26681

మంచు దుప్పటిని తొలగించు కొని ఉదయభానుడు తూరుపు కొండల నడుమ నుండి తొంగి చూస్తూ పచ్చని పైరులపై వీచే పిల్లగాలులతో జతకట్టి నులివెచ్చని అరుణ కిరణాలను వెద జల్లుతుండగా బతుకుపోరుకు పయనమైన పల్లెపడుచులంతా నెత్తిమీద సద్ది మూటలతో వేసంగి నాట్లు వేసేందుకు చిట్టడవి మధ్యనున్న చిన్న కాలిబాటలో నుండి గుంపు పెద్దమనిషి లచ్చవ్వ సారథ్యంలో బారులు తీరి నాగయ్య పటేలు పొలం దగ్గరికి చేరుకున్నారు.

అందరు నారు మడిలోకి దిగి వంగి నారు పీకుతున్నారు హుషారుగా. వృద్ధాప్యం వల్ల ఎక్కువసేపు వంగలేక పోవడం వల్ల పిడికిలి నిండా నారు పీకి నిలబడి నారు కట్ట కడుతున్న లచ్చవ్వ చూపులు ఎదురుగా వున్న కంకర రోడ్డు మీది నుండి జనాలు గుంపులు గుంపులుగా వెళ్ళడం చూసి ఆశ్చర్యంతో "పటేలా...! ఓ పటేలా...! గదేంది గా... సడక్ మీదికెళ్ళి మందకు మందే గట్ల పోతుండ్రేంది? ఎవరికన్న ఏమన్న అయిందా ఏందుళ్ళ...!" అంటూ అడిగింది లచ్చవ్వ.

"గదేంది లచ్చవ్వా...! నీకు తెల్వదా...!" అన్నాడు పటేలు గొర్రుకు కట్టిన ఎడ్లను అదిలిస్తూ.

"ఏం ముచ్చట పటేలా...! అవ్వతోడు నాకేం తెల్వదు... ఏమే... రాజవ్వ నీకేమన్న ఎరికేనాయే...!" అంది తనతోపాటు నారుమళ్ళో వంగి నారు పీకుతున్న రాజమ్మను ఉద్దేశించి.

"మాకేం తెల్వదు" అంటూ రాజమ్మతోపాటు గొంతు కలిపారు మిగతావాళ్ళంత.

"అరె గిదేందో చిత్రంగుంది పటేలా...! నువ్వన్న జెర జెప్పరాదు...!" అంటూ పటేలు వైపు చూస్తూ అడిగింది లచ్చవ్వ.

"ఏందే లచ్చవ్వ గంతగనం పరేషాన్ గావడితివి ఎవలకేం కాలేదు లేవే...!" అంటూ గొర్రును మరో బురద మడిలోకి దింపాడు పటేలు.

"జనమంతా జాతరలెక్క పోతుంటే పరేషాన్ గాక మరేంది పటేలా...!" అంది అసలు విషయం తెలుసుకోవాలనే ఆతృతతో లచ్చవ్వ.

"జాతరని చిన్నగంటవేందే జాతరనే లచ్చవ్వ...! జాతరే జరుగుతుంది" అన్నాడు నర్మగర్భంగా నవ్వుతూ పటేలు.

"నాకు తెల్వని జాతరెక్కడిది పటేలా...!" అంటూ బుగ్గన వేలేసుకుంది లచ్చవ్వ ఆశ్చర్యంతో. గదేనే లచ్చవ్వ... మన ఊరి పక్కమ్మటే బుగ్గ తండా లేదానే గాడ కొత్త దేవున్ని నిలబెట్టిండ్రట. ఆ తండల వున్న పడుసు పోరగాండ్లందరు కలిసి ఆ కొత్త దేవున్ని సూసి పోనీకే ఈ జనమంతా పడిపడి ఉరుకుతుండ్రు" అన్నాడు పటేలు ఎడ్లను అదిలిస్తూ.

కొత్త దేవుడనే మాట చెవిన పడగానే మడికట్లో వంగి నాటేస్తున్న ఆడవాళ్ళందరు లేచి నిలబడి "గింత దగ్గర మనకు తెల్వకపాయే...! ఎక్కడెక్కడోళ్ళో వచ్చి సూత్తుంటే మనమెందుకు పోవద్దు...! మనం సుత పోయి సూద్దాం లచ్చవ్వా...!" అన్నారు మూకుమ్మడిగా ముక్తకంఠంతో.

"గట్లనే పోదాం లేండ్రే...! ముందగాల ఈ పటేలు నాటు పడనీయ్యుండ్రి, ఇయ్యాల ఎంత పొద్దు పోయిందాకనైనా ఉండి పూరాగ నాటు కాజేద్దాం... అందరు రేపు పొద్దుగాల్నే నెత్తిమీదికెళ్ళి పెయ్యి కడుక్కోండ్రి. ఈ దినం కంటే జెర ఎల్లెం ఇండ్లల్లకెళ్ళి బయటికెళ్ళుండ్రి, ముందుగాల ఆ కొత్త దేవుని తాడికిపోయి మొక్కకొని బువ్వాల్లకల్ల రంగయ్య పటేలు నారుమడి కాడుండాలే!" అంటూ నా మాటే శాసనం అన్నట్లు ఆర్డరు జారీ చేసింది లచ్చవ్వ.

"గట్లనే... గట్లనే...!" అంటూ అందరు కూడబలుక్కొని ఇంటిదారి పట్టారు. అనుకున్నట్లుగానే అందరు కొబ్బరి కాయలు, అగర్వత్తులు పట్టుకొని బుగ్గ తండాకు చేరుకున్నారు.

"జనమంతా జాతరలెక్క పోతుంటే పచ్చని చెట్లతో అక్కడి వాతావరణమంతా చిన్నపాటి సమ్మక్క జాతరను

తలపిస్తుంది. పచ్చని పొలాల నడుమ ఒక రేకుల షెడ్డు నీడలో కొలువు దీరిన కొత్త దేవుని విగ్రహం దగ్గరికి వెళ్ళి కొబ్బరి కాయలు కొట్టడానికి సిద్ధమయ్యారు మహిళలందరు. పూజారి ఆ విగ్రహం మీద పూలు చల్లుతూ మంత్రాలు చదువుతున్నాడు. అక్కడికి చేరిన మహిళల్లోని ఒక మహిళ 'ఓ పూజారయ్యా ఈ కొత్త దేవుని పేరేంది జర సెప్పరాదు...!'' అంటూ అడిగింది కుతూహలంగా.

"ఈ దేవుని పేరు సోము'' అంటూ సోము దేవ నామస్య... అని మంత్రాలు కొనసాగించాడు.

"సోము దేవుడేంది.. ఆ పాలకుర్తి సోమన్నే గీడ నెరిసిండా ఏందుల్లా...!'' అంటూ పరీక్షగా విగ్రహాన్ని చూస్తున్న లచ్చవ్వ "అరే గిదేందయ్యా పూజారయ్యా... గీడ మనిషి బొమ్మను బెట్టి దేవుడంటుండ్లేంది'' అంటూ ఇంకాస్త దగ్గరికి జరిగి "ఒసే రాజవ్వ... గిదేం అన్నాలమే... గీ బొమ్మను... ఓ గౌరవ్వా... మల్లవా... ఇటురాండ్రే... జర నజరు బెట్టి సూడుండ్రే, అచ్చంగా గా జేజమ్మ సిన్మల జేజమ్మను ఏడ్పిచ్చిన పసుపతి లెక్కనే లేడే...! గిదేం ఇచ్చంత్రమే తల్లులాల... ఎసొంటి గడ్డుకాలం దాపురించిందే ఈ పాడువడ్డ లోకంల, గందుకే గదేందో మాయదారి రోగం 'కరోనా' అసొంటి రోగాలు దాపురించి చెడుగంతకు నానా బుద్దులన్నట్లు జనాలు పిట్టల్లోలే రాలిపోతుండ్రు. దయ్యాలను దేవుళ్ళను జేసి ఎంత పాపం మూటగట్టుకుంటుండ్రు. ఓ పూజారయ్యా... నువ్వన్నా జెప్పవా గిది తప్పని ఆ పడుసు పోరగాండ్లంటే పడుసా....! పెడుసా...! అన్నట్లు ఏందేందో చేస్తుండ్లు'' అంటూ అక్కడే నిలబడ్డ యువకుల దగ్గరకు వెళ్ళి గుండెలు బాదుకుంది లచ్చవ్వ.

"అవ్వా...! నేను చెప్పేది జర విను. నీ ఆవేశంలో అర్థముంది. నేను కాదనను. కానీ నేను చెప్పేది మనసుపెట్టి విను. ఈ దేశంలో ఎంతోమంది రియల్ హీరోలుగా పేరొందినా ఇతను విలన్‌గా యాక్టింగ్ చేసినా, నిజజీవితంలో మాత్రం రియల్ హీరోగా నిలిచాడు సోము. ఈ పేరు ఇప్పుడు దేశం మొత్తం తెలుసు. ఇంతకు ముందు సోము అంటే వెండితెర మీద ఆయన చేసిన ప్రతినాయకుడి పాత్రలే గుర్తుకువచ్చేవి. కానీ ఇప్పుడు మాత్రం సోము అంటే సేవాకార్యక్రమాలే గుర్తొస్తున్నాయి. లాక్‌డౌన్ సమయంలో కష్టాల్లో ఉన్న పేద ప్రజలకు ఆయన చేసిన సహాయం సామాన్యమైనది కాదు. పొరుగు రాష్ట్రాల్లో చిక్కుకొనిపోయి సొంత ఊళ్ళకు వెళ్ళలేక, పనులు లేక అనేక అవస్థలు పడుతున్న వందల మంది కూలీలను సొంత ఖర్చులతో బస్సులు ఏర్పాటుచేసి ఇళ్ళకు చేర్చాడు. వేలమందికి భోజన వసతులు, పేద విద్యార్థులకు వైద్య సౌకర్యాలు అందించడమే కాదు, ఎందరికో జీవనోపాధి కల్పించాడు. పేద వారిని ఆదుకోవడానికి ఆయన కోట్ల రూపాయలు వెచ్చించాడు. ఆ డబ్బును తన స్వంత ఆస్తులను తాకట్టు పెట్టి తీసుకొచ్చాడు.



ఇన్ని మంచి పనులు చేస్తున్న మనిషిని దేవుడని పూజించటం తప్పంటావా పెద్దవ్వా...!'' అంటూ గుక్కతిప్పుకోకుండా లచ్చవ్వతో పాటు అక్కడున్న వారందరికి అర్థమయ్యేలా వివరించాడు యూత్‌లీడర్ రమేష్.

"గట్లనా బిడ్డా...! గవన్ని మాకేమెరుక, గన్ని మంచి పనులు జేసిండ్రా...!'' అంటూ ఆశ్చర్యంగా బుగ్గలు ఒత్తుకుంది లచ్చవ్వ.

"అంతే కాదు పెద్దవ్వా...! కేంద్ర ప్రభుత్వం కరోనా వ్యాప్తిని అరికట్టడానికి దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ ప్రకటించిన వెంటనే వేలాదిమంది వలసకార్మికులు జీవనోపాధి కోల్పోయారు. ఆదాయ వనరులు, ఆకలి భయం, కరోనా గురించి భయం, రైళ్ళు, బస్సులు నిలిపివేయడం వలన ప్రజలు తమ గ్రామాలకు చేరుకోవడానికి వందల కిలోమీటర్ల దూరం నడిచి వెళుతున్న వారిని చూసి సోము మనస్సు ద్రవించిపోయింది. అందుకే దాదాపుగా ఇరవై వేల మందిని బస్సులు, రైళ్ళు, విమానాల ద్వారా ఇండ్లకు చేర్చాడు. ప్రభుత్వంతో మాట్లాడి అనేక శ్రామిక రైళ్ళను ప్రారంభించి వలస కార్మికులెందరినో స్వగ్రామాలకు చేర్చిన దేవుడు ఈయనే. అంతేకాదు కరోనా రోగులకు చికిత్స చేస్తున్న సమీప ఆసుపత్రుల ఆరోగ్య కార్యకర్తలకు తన హోటల్లో నివాసం ఏర్పాటు చేశాడు.

కేరళలో ప్లంబర్‌గా పనిచేస్తున్న సుశాంత్ అనే వ్యక్తితో పాటు సుమారు నూటయాభైమంది మహిళలు, ఇరవై మంది పురుషులు సోము సహాయంతో తిరిగి ఒడిశాలో వారి వారి ఇండ్లకు చేరుకున్నారు. వలస కార్మికుల ప్రయాణంలో అందరికి సరిపడా భోజనం, మంచినీళ్ళు, చిన్నపిల్లలకు బిస్కెట్లు, పాలు, పండ్లు ఏర్పాటుచేసి, వారి

కథ

ఆకలిదప్పులను తీర్చిన మహానుభావుడు సోము'' అంటూ భావోద్వేగంతో ముగించాడు యూత్ మెంబర్స్‌లో ఒకడైన రాజు.

"గట్లయితే మంచిదే గానీ, మరి గాయిన మనకేం జేసిండు. ఎక్కన్నో మన భాస, మన ఏశం గానోళ్ళకు మంచి జేసిండు గంతే గద తమ్మీ...!'' అన్నాడు గుంపులోనుండి సుమారు నలభై సంవత్సరాల వయసున్న నర్సయ్య.

"వేషం, భాష ఏదైతే ఏందే నర్సన్న...! వాళ్ళు మనుషులు కాదా...! వాళ్ళకు కష్టాలు రావా...! వాళ్ళకే కాదు మన తెలుగు రాష్ట్రాలల్లో కూడా ఎందరికో సహాయం చేశాడు. నాలుగు సంవత్సరాల బాబుకి జబ్బు చేసి వైద్యం చేయించలేక తల్లిదండ్రులు గోడుగోడున ఏడుస్తుంటే అది తెలిసిన సోము ఆ బాబుకి వైద్యం చేయించి ప్రాణం పోశాడు.

పెద్ద చదువులు చదువాలనుకునే పేదవారికి సోము తల్లి పేరుమీద ఆర్థిక సహాయం అందించి వారిని చదివిస్తు న్నాడు. దాదాపు పదిహేను వందల మంది వైద్య విద్యార్థులు కిరికిస్థాన్ దేశంలో చిక్కుకుంటే వారిని క్షేమంగా మన దేశానికి చేర్చాడు.

విద్యా సంవత్సరం వృధా కాకూడదని ప్రభుత్వం ఆన్‌లైన్ తరగతుల ద్వారా బోధన నిర్వహిస్తుంటే తన కూతురు కోసం ఉన్న ఒక్క ఆవును అమ్మి ఒక పేద తండ్రి ఒక సెల్‌ఫోన్ కొనిచ్చాడు. ఆ వార్త తెలిసిన సోము ఆవును తెచ్చి ఆ తండ్రికి ఇచ్చాడు. ఇలా ఎందరినో కష్టాలనుండి గట్టెక్కించి వారికి ప్రత్యక్ష దైవంగా మారాడు సోము...'' అంటూ వివరించాడు సోము ద్వారా సహాయం పొందిన కళాకారుల్లో ఒకడైన గోపన్న.

"అవునండి...! ప్రస్తుతం దేశంలో ఎక్కడ చూసినా సోము పేరు మార్మోగిపోతుంది. కష్టమున్న చోట దేవుడిలా ప్రత్యక్షమవుతున్నాడు సోము. కష్టాల్లో వున్న ప్రతి ఒక్కరికి నేనున్నా నంటూ భరోసా కల్పిస్తున్నాడు. సాయమడిగినవారికి ఒకటి రెండు

**వైద్యం** చదువులు, ఉద్యోగాలు, ఇళ్ళు ఇలా ఏ కష్టమొచ్చినా ఇప్పుడు గుర్తొచ్చే పేరు సోము. మొన్నటికి మొన్న మన తెలుగు రాష్ట్రంలోనే పదిహేను నెలల చిన్నారికి పునర్జన్మనిచ్చాడు. మరో నాలుగు నెలల చిన్నారికి ఐదు లక్షలు ఖర్చుపెట్టి బొంబాయిలోని పిల్లల హాస్పటల్‌లో ఆపరేషన్ చేయించాడు. రెక్కాడితేకాని డొక్కాడని ఎందరో తల్లిదండ్రులు వారి పిల్లలకు వైద్యం చేయించలేక అల్లాడుతుంటే వారికి ఆపన్నహస్తం అందించి వారి హృదయా లలో గుడి లేని దేవుడిగా నిలిచిపోయాడు".

రోజుల్లోనే ఆపన్న హస్తం అందిస్తూ ఆపద్బాంధవుడిగా నిలుస్తున్నాడు.

వైద్యం చదువులు, ఉద్యోగాలు, ఇళ్ళు ఇలా ఏ కష్టమొచ్చినా ఇప్పుడు గుర్తొచ్చే పేరు సోము. మొన్నటికి మొన్న మన తెలుగు రాష్ట్రంలోనే పదిహేను నెలల చిన్నారికి పునర్జన్మనిచ్చాడు. మరో నాలుగు నెలల చిన్నారికి ఐదు లక్షలు ఖర్చుపెట్టి బొంబాయిలోని పిల్లల హాస్పటల్‌లో ఆపరేషన్ చేయించాడు. రెక్కాడితేకాని డొక్కాడని ఎందరో తల్లిదండ్రులు వారి పిల్లలకు వైద్యం చేయించలేక అల్లాడుతుంటే వారికి ఆపన్నహస్తం అందించి వారి హృదయా లలో గుడి లేని దేవుడిగా నిలిచిపోయాడు'' అంటూ నర్సయ్య చేతిలోని కొబ్బరికాయను అందుకొని కొట్టాడు పూజారి.

"అంత మంచిగనే ఉన్నదిగని బిడ్డా...! ఆ పెద్దపెద్దోల్ల లెక్కనే ఈనె గూడా రాజకీయాలకు పోనీకి గిదంత జేస్తుండేమోనని నాకు ఎక్కన్నో గొడుతుంది, మళ్ళీ మీరేమంటరు...!'' అన్నాడు అనుమానంగా అందరిని గమనిస్తూ ఆ తండావాసి భోగ్యానాయక్.

"సోము అట్లాంటివేవీ ఆశించి ఇదంతా చేయడం లేదు నాయినా..! ఎందుకంటే తను చేస్తున్న మంచిపనులన్ని చూసి తాను తొందరగానే ఒక రాజకీయపార్టీలో చేరవచ్చుననే పుకార్లను సోము కొట్టిపారేశాడు. తను రాజకీయ జీవితం కోసం ఆరాటపడడం లేదని, పేద ప్రజలకు సహాయం చేయడమే తన జీవిత లక్ష్యమని అన్నాడు. ఎవరైనా తనకు మంచి పాత్ర లభించినపుడు వారు రాణిస్తారు. నా విషయంలో అదే జరిగింది. ఇది నా జీవితకాల పాత్ర. దీనికోసమే నేను ఈ ప్రజలకు చేరువయ్యాను అనిపిస్తుంది. రహదారిపై ఉన్న ప్రతివ్యక్తిని ఇంటికి చేర్చే లక్ష్యం నా అతిపెద్ద బ్లాక్‌బ్లస్టర్ అవుతుందని సోము ఒక సందర్భంలో వెలిబుచ్చాడ''ంటూ వివరంగా చెప్పాడు మరో వ్యక్తి కిషన్.

కొత్తదేవుని గురించి నిజానిజాలు తెలుసుకున్న మహిళలంతా సంతృప్తిగా పూజలు చేసుకొని వెళ్ళిపోయారు. జనజాతర నిర్విరామంగా సాగుతూనే వుంది.

సోము విగ్రహం తయారుచేయించి ఇచ్చిన కళాకారులు, ఆ తండా యువకులు కలిసి చర్చ జరిపి, గుడి కట్టించి కొత్తదేవుని విగ్రహాన్ని అందులో ప్రతిష్ఠింపజేయాలని నిర్ణయించారు. యువకులు తలా కొంత డబ్బు వేసుకొన్నారు. తండాలోని పెద్దలు కొందరు స్వచ్ఛందంగా కొంత డబ్బు ఇచ్చారు. అదే తండాకు చెందిన భోజ్యానాయక్ స్వచ్ఛందంగా ఒక ఎకరం భూమిని ఇచ్చాడు.

ఒకరోజు సుముహూర్తం నిర్ణయిం చారు. ఆలయ శంకుస్థాపనకు సోమును ఆహ్వానించి ఘనంగా సన్మానించి శంకుస్థాపన ఆయన చేతుల మీదుగానే చేయించాలని నిర్ణయించుకున్నారు.

"పూజ్యులైన సోముగార్కి, మేము తెలంగాణ రాష్ట్రంలోని బుగ్గ తండా యువకులం. మీరు చేస్తున్న సేవా కార్యక్రమాలను చూసి మేము మీమీద అభిమానంతో మా తండాలో మీకు గుడి

కట్టి విగ్రహ ప్రతిష్ఠ చేయాలని నిర్ణయించాం. మీరు తప్పకుండా ముహూర్త సమయానికి రాగలరని మనవి" అని మెసేజ్ టైపు చేసి రాజేష్ సెల్ ఫోన్ నుండి సోముకి ట్వీట్ చేశారు.

వెంటనే "ఓకే డన్" అంటూ సోము నుండి ట్విట్టర్‌లో సమాధానం వచ్చింది.

యువకుల ఆనందానికి అవధులు లేవు. ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. శంకుస్థాపనకు చుట్టుపట్టు గ్రామాలనుండి చిన్నాపెద్దా, ముసలి ముతక జనాలంతా బుగ్గ తండాకు చేరుకున్నారు. సోము ఫోటోలతో భారీగా బ్యానర్లు కట్టారు వచ్చిన వారందరికి సౌకర్యంగా టెంటు, కుర్చీలు వేశారు. మంచినీళ్ళ కోసం పెద్ద పెద్ద డ్రమ్ములు ఏర్పాటుచేశారు. స్టేజి మీద రంగురంగుల పూలతో అలంకరించారు. అందరూ సోము రాక కోసం వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్నారు. ముహూర్త ఘడియలు దగ్గరపడుతున్నాయి. ఇంతలో ఒక పెద్ద కారు వచ్చి ఆ ప్రాంగణంలో ఆగింది. అందులోనుండి చాలా సింపుల్‌గా ఒక సామాన్యమైన వ్యక్తిగా కారు దిగాడు సోము. "అదిగో సోముగారు వచ్చా"రంటూ యువకులు ఎదురుగా వెళ్ళి పూలు చల్లుతూ శంకుస్థాపన దగ్గరికి తీసుకెళ్ళారు. అక్కడి ఏర్పాట్లన్నీ చూసిన సోము ఆ యువకులను ఉద్దేశించి "చూడండి ఫ్రెండ్స్ ఈ శంకుస్థాపనకంటే ముందు నేను ఇక్కడికి వచ్చిన వారందరితో కొన్ని విషయాలు మాట్లాడాలి" అన్నాడు చిరునవ్వుతో.

"ముందు శంకుస్థాపన కానివ్వండి సార్. తర్వాత మీ ఉపన్యాసం ఉంటుంది. మధ్యమధ్యలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి" అంటూ పుజారిని పూజకు పురమాయించాడు రాజేష్.

"ముహూర్తం దేముంది చెప్పండి ఫ్రెండ్స్! మనం చేసే మంచిపనులకు మహూర్తంతో పనిలేదు. ముందు సమావేశం. ఆ తర్వాతే శంకుస్థాపన" అన్నాడు సోము. సోము మీదున్న గౌరవంతో "అలాగే చేద్దాం సార్" అంటూ సమావేశం ప్రారంభించారు.

ఆ సమావేశంలో గ్రామపెద్దలు యువకులు అందరూ సోము చేసిన సేవలను విశ్లేషిస్తూ ఉపన్యసించారు. చివరగా సోము మాట్లాడవలసిందిగా సభాధ్యక్షులు కోరారు.

గొంతు సవరించుకున్న సోము "ఈ వేదిక మీదున్న గ్రామపెద్దలకు, యువకులకు, ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరికి నా హృదయపూర్వక అభినందనలు తెలుపుకుంటున్నాను. కరోనా మహమ్మారి కరాళనృత్యం చేస్తూ విశ్వమానవాళిని వణికిస్తున్న సందర్భంలో మన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లాక్‌డౌన్ విధించడంతో వేలాదిమంది విధిలేక కాలినడకన వారి సొంత గృహాలకు బయలుదేరారు. మార్గమధ్యంలో ఎన్నో ఇబ్బందులు పడుతుండడం చూసి నా హృదయం ద్రవించిపోయింది. నాకున్న పరిధిలో నేను వారికి సహాయం చేశాక వలసకార్మికులతోపాటు ఆపదలో చిక్కుకొని విలవిలలాడుతున్నవారికి సహాయం చేశాను.

'మానవసేవే మాధవసేవ' అని తలచి సేవ చేస్తున్నా. అంతమాత్రానికే నన్ను దేవుణ్ణి చేసి మీరు గుడి కట్టడానికి సిద్ధమయ్యారు. నామీద మీరు చూపిస్తున్న అభిమానానికి నేను కృతజ్ఞుడిని. కానీ మనిషిని దేవున్ని చేసి, మానవత్వాన్ని విగ్రహాలలో బంధించి వేల రూపాయలు ఖర్చుపెట్టి గుడి కట్టించడానికి మీరు చేస్తున్న ప్రయత్నమే నాకు ఇబ్బందిగా వుంది" అనగానే అందరూ ఆశ్చర్యంగా సోము వైపు చూశారు.

"అవును ఫ్రెండ్స్ మీరు నన్ను ఆదర్శంగా తీసుకొని సేవాకార్యక్రమాలు మొదలుపెడితే నేనెంతో హర్షించేవాడిని. ఇప్పటికి మించిపోయింది ఏమీ లేదు. మీరేమి వర్రీ కాకండి. శంకుస్థాపన జరుగుతుంది. కానీ, నాకోసం కట్టే గుడికి కాదు. ఇక్కడి పిల్లలందరు చదువు కోవడానికి బడి కావాలి. అందుకే ఇదే స్థలంలో బడి కడదాం. మీరు గుడికోసం జమ చేసిన డబ్బులు ఎవరివి వారికి ఇవ్వండి. ఎందుకంటే వారందరిని చూస్తుంటే నాకు చాలా జాలేస్తుంది. వారందరు రోజువారి కూలీలు, చిన్న సన్నకారు రైతులుగా ఉన్నవారు. ఈ స్థలంలోనే మొత్తం నా సొంత ఖర్చులతో బడి కట్టిద్దాం...!" అంటూ అందరివైపు ఒకసారి చూపు సారించాడు సోము.

వేదికకు అభిముఖంగా కూర్చున్న జనమంతా తమ కరతాళ ధ్వనులతో సంతోషాన్ని వెలిబుచ్చారు. సభాధ్యక్షత స్థానంలో ఉన్న రాజు మాత్రం అందుకు విరుద్ధంగా "సోముగారు మీ మీద అభిమానంతో గుడి కట్టాలని నిర్ణయించాము. మీరు ఇలా మాట్లాడడం మాకు చాలా బాధ కల్గిస్తుంది" అంటూ నిట్టూర్చాడు.

"బాధ ఎందుకు ఫ్రెండ్ గుడి కంటే ఈ ప్రాంతంలో బడి అవసరం ఎంతో వుందనిపిస్తుంది. పిల్లలందరు చదువు కుంటే విద్యతో విజ్ఞానం పెరిగి, ఉపాధ్యాయులు నేర్పించే నైతిక విలువలతో నాలాంటి సోములు వందల మంది తయారవుతారు. దయచేసి నా మాట మన్నించి బడి కట్టించడానికి మీరందరు నాకు సహకరిస్తారని ఆశిస్తున్నాను" అంటూ రెండు చేతులు జోడించి వేడుకున్నాడు సోము.

మరొక్కసారి ఆ ప్రాంతమంతా కరతాళధ్వనులతో మారుమ్రోగించిన యువకులు, గ్రామపెద్దలందరూ కళ్ళతోనే మాట్లాడుకున్నారు. సోము మాటతో ఏకీభవించారు. వెంటనే ఉన్నతాధి కారులను కలిసి బడికి కావలసిన ఏర్పాట్లు చేసి, బడికి కావలసిన డబ్బు మొత్తం ఇచ్చి బడికి శంకుస్థాపన చేసి వెనుదిరిగాడు సోము.

రెండు నెల్లో పాఠశాల పూర్తయింది. ప్రారంభోత్సవానికి సోము వచ్చాడు. పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన తన విగ్రహాన్ని చూడగానే ప్రతి ఒక్కరికి నాకు చేతులు జోడించి మొక్కడం పక్కకు పెట్టి అవే చేతులు ఆపదలో ఉన్నవారికి సహాయం చేసి ఆపన్న హస్తాలుగా మారాలని కోరినాడు సోము.

వ్యాసం

# 'మువ్వ'ల సవ్వడిలో సామాజికత...

మువ్వా శ్రీనివాసరావు ప్రతిభను పంచిన వ్యాసం...



డా॥ వెల్దండి శ్రీధర్
98669 77741

కాలం వెంట సమాంతరంగా నడుస్తూ దాని ఛాయల్ని సజీవంగా ఫోటోగ్రఫీ తీయడం ఏ కాలపు కవికైనా ఒక సవాలే. కవి తన సమకాలీన సమాజంలోని చలన సూత్రాలను, తాత్త్వికతను, అంతర్మథనాన్ని, సంవేదననూ, సంక్షోభాల్ని అలాగే నేరుగా కవిత్వంలోకి ఒంపడం దాదాపుగా అసాధ్యం. ఎన్ని కోణాల్లో రాసినా ఇంకేవో పార్శ్వాలు మిగిలే ఉంటాయి. కవుల నోళ్లకు తాళాలు వేస్తోన్న ప్రస్తుత కాలంలోనైతే ఇది మరీ కష్టం. అధి వాస్తవికతలోనో, మాజిక్ రియలిజమ్, నోస్టాల్జియాల మాటునో దాగి నరాల్లో ప్రవహిస్తున్న అంతర్గత కరెంటును అక్షరాల్లోకి అనువాదం చేయాలి. జీవితాల్ని, ఉద్యమాలను, నిత్యనైమిత్తిక అనుభవాలను, మానవ దుఃఖాన్ని, అస్తిత్వాన్ని, పర్యావరణ విధ్వంసాన్ని, సెన్సిటివ్ విషయాలను, మానవ సంబంధాలను, కాల పరిణామాలను, కుటుంబ సంబంధాలను, వ్యవస్థ నిండా పరుచుకున్న అవ్యవస్థను, దోపిడీని కవిత్వపు వాక్యాల్లోకి నిరాటంకంగా తీసుకురావడం, సాటి మనుషులను హెచ్చరించడం, కలబడేలా సమీకరించడం కొంత మంది కవులకే సాధ్యం. తెలుగు సాహిత్యంలో ఇప్పటిదాకా కొన్ని వేల మంది కవులు పుట్టారు. గిట్టారు. కాని



ప్రజలు గుర్తుంచుకునేది మాత్రం వేళ్లమీద లెక్కించగలిగినంత మంది కవులను మాత్రమే. కొన్ని కవితా వాక్యాలు మాత్రమే వాళ్ల నాలుకల మీదికెక్కాయి. వ్యవస్థ కుదేలయినప్పుడో, మనిషి కూలిపోయినప్పుడో, ధైర్యం గాజుపెంకుల్లా పగిలిపోయినపుడో ఆ కవితా వాక్యాలను స్మరించుకొని ఏదో ఆవేశాన్ని, కర్తవ్య, స్థైర్యాలను పొందుతారు.

గాయాల మీది నుంచి నడిచి వచ్చే కవి, చరిత్రను ఆవాహన చేసుకున్న కవి, ప్రజల పాదంతో తన పాదాన్ని కలిపి నడిచే కవి మాత్రమే స్థల కాలాల్ని సానుభూతితో కవిత్వంలో ముడి పెడతాడు. అలాంటి ఒకానొక కవి మువ్వా శ్రీనివాసరావు. నూనూగు మీసాల నూత్న యౌవనంలో కలం పట్టిన వాడు కాదు. ఐదు దశాబ్దాలపైబడి తన సమకాలీన సమాజపు 'మువ్వ'ల సవ్వడిని వినీ వినీ, దాని విభిన్న ధ్వనులను లోతుగా అర్థం చేసుకొని అంతే భిన్నత్వంతో కవిత్వమై స్పందించిన వాడు. ఎంతో జీవితాను భవాన్ని సంపాదించుకున్న తరువాత కలం పడితే జరిగే మేలేమిటంటే రాసే ప్రతి వాక్యంలో ఎంతో పరిపక్వత తొంగి చూస్తుంది. ఒక పరిపూర్ణత, ఒక ప్రగాఢత్వం, ఒక ప్రశ్నల సమూహత్వం, ఒక కల్లోలితత్వం ఆయన కవిత్వానికి జీవధాతువులు. కవిగా మొదలైన కొద్దికాలంలోనే సమాంతర ఛాయలు, 6th ఎలిమెంట్, వాక్యాంతం, వైరాయణం అనే నాలుగు ఆధునిక జీవన సముద్రాల్లాంటి కవితా సంపుటాలు వెలువరించారు. సుమారు 600 పుటల కవిత్వం. కొన్ని వేల కవితా వాక్యాలు. ఏ వాక్యాన్ని ముట్టుకున్నా ఒక రకమైన శీతోష్ణస్థితి మన దళసరి దేహాలను స్పర్శిస్తుంది.

"మా ఊరి మర్రిచెట్టు మీద
అర్ధరాత్రి
మందారం పూసిందని
ఖాకీలు కాలువల్లా ప్రవహించాయి
తుపాకీ గొట్టాలు
తూరుపు మొక్కలను పసిగట్టాయి

వ్యాసం

తెల్లవార్లూ
లాఠీలూ ఎముకలూ
మాట్లాడుకొంటూనే ఉన్నాయి”
(1975.. ఓ పోరాటగాథ)

ఎమర్జెన్సీ (1975-77) చీకటి రోజుల్లో భారతదేశం ఎలా అధికార ఉక్కు పిడికిలిలో నలిగిపోయిందో ఈ కవిత సామాన్య ప్రజల విరిగిపడిన ఎముకల సాక్షిగా చెపుతుంది. దేశ ప్రజాస్వామ్య పునాదులు కదిలిపోయిన దీనమైన రోజులవి. వ్యక్తి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను జైల్లో పెట్టారు. ఎన్నో నెత్తుటి నదులు నలుదిక్కులా ప్రవహించాయి. జీవించే హక్కును కూడా కాలరాచి ఎంతో మంది అధినాయకులను సైతం అరెస్టు చేసింది నాటి ప్రభుత్వం. ఇక సామాన్యుల పరిస్థితి చెప్పనే అక్కర్లేదు. చరిత్రలో ఒక మాయని మచ్చలాంటి ఎమర్జెన్సీ మీద వచ్చిన కవితల్లో ఈ కవిత ఒక ఎర్రమందారం.

“ఒక్క ఘోష బుసకొట్టినా సహించలేరు
మాలోంచి ఒక్క కిరణం వెలిగినా
మలిపేదాకా నిద్దురపోరు
అయినా సరే
నిన్నటి ఆకులు రాలకా తప్పదు
రేపటి కోసం
కొత్త చిగుళ్ళు తొడగకా తప్పదు
అనాదిగా అడుగునే ఉన్నా
సరికొత్త సమాజానికి పునాది రాళ్లం
మేమే అవుతాం
నిచ్చెన సరిచేసే చేతులు కావాలి.”
(లక్ష్మీపేట ఉరఫ్ ఖైర్లాంజీ)

కారంచేడు నుంచి లక్ష్మీపేట దాకా ఆధిపత్య వర్గాల వారు దళితులపై దాడి చేసిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా ఇంకా మనం కులాల కంపులోనే పడి కొట్టుకుపోతున్నాం. De-Castify కావడానికి ఏ ఒక్కడూ సిద్ధంగా లేడు. సాటి మనిషిని మనిషిగా చూసే కనీస మానవత్వపు ఉదారత దాకా కూడా మనం ఎదగలేకపోయాం. ఎన్ని తిరుగుబాట్లు ఉప్పొంగినా కుల సర్పాలు కాటు వేస్తూనే ఉన్నాయి. మన చదువు, మన ప్రజాస్వామ్యం, మన సాంకేతిక పరిజ్ఞానం అంతా బూటకపు అభివృద్ధేనని పదేపదే నిరూపిస్తూనే ఉన్నాయి. ధన మదాన్ని, కులపిచ్చిని, నిచ్చెనమెట్ల సమాజాన్ని సరిచేసే చేతులేవో పూనుకోవాలని కవి కలగంటాడు. నిజంగా అలాంటి కొత్త చిగుళ్ల కాలం ఎంత దూరం ఉందో కదా!

“పచ్చని పొలాలు
ఎకరాలు గజాలుగా చీలి
బూడిదగుమ్మడి కాయలు
కాస్తున్నాయి
వయసుడిగిన వాళ్ళు అక్కడక్కడా
ఇళ్లకు అతికించబడ్డ గుర్తులు తప్ప
పల్లెతనానికెప్పుడో రోజులు
చెల్లిపోయాయి
ఊరికే మరమ్మత్తులు
అవసరమవుతున్నాయి
అవీ గ్లోబల్ గ్రామం చూరుకే
వ్రేలాడుతున్నాయి” (గ్లోబలూరు)

ప్రపంచీకరణ భూగోళమంతటా తన ఇనుప పాదం మోపిన తరువాత ఎన్నో రంగాలు విధ్వంసానికి గురయ్యాయి. కుల వృత్తులు తమ ఆకృతుల్ని కోల్పోయాయి. పల్లెలు మల్లెల్లా నలిగిపోయాయి. మారిపోయిన పల్లె ముఖచిత్రాన్ని చూసి కుమిలిపోని కవిలేడు ఒకప్పుడు. పల్లెకు పూర్వవైభవాన్ని కల్పించాలని ఉందని కవి ఎంతో తన్లాడుతాడు. ఒకప్పటి పల్లె ఎంత అందంగా ఉండేదో చెప్పనే ‘క్లోనింగ్’ చేసైనా పల్లెను మళ్ళీ పునర్నిర్మించాలని తాపత్రయపడుతాడు. వస్తు వ్యామోహం పెరిగి, మారిన మనిషి జీవన విధానాన్ని చూసి, ముక్కలుగా విరిగిపోతున్న జీవితాలను చూసి కనీసం ‘నల్లాలం’ పెట్టి ఒక కట్టుకట్టాలని, కనుమరుగైపోయిన ఎన్నింటికో మళ్లీ జీవం పోయాలని కవి విపరీతంగా ప్రయత్నిస్తాడు. కానీ అనివార్యంగా ఎన్నో ప్రభావాలకు, ప్రలోభాలకు లోనవుతున్న గ్రామం రోజుక్కొంచెం తెర్లవుతూనే ఉంది.

“ఒంటరితనాన్ని వడకట్టినప్పుడల్లా
సమూహమే కదా మిగిలేది
సమూహాన్ని చిలకరిస్తే ఒంటరితనమే
కదా
పలకరించేది ఉండాలనిపించినట్లు
ఉండనూలేము
లోపలి బయటి సమూహాలు
ఒకే నమూనాలో పొందనూలేము
ఉండాలనుకొన్నట్లు ఉండాలను
కోవడమే జీవితం” (ప్చ్...)

గత రెండు దశాబ్దాలుగా సమూహంలో ఉన్నా ఒంటరితనంలో ఉన్నట్లు, ఒంటరిగా ఉన్నా సమూహంలో ఉన్నట్లు ఒక వింత పరిస్థితి హైటెక్ మనిషిని వెంటాడుతుంది. ఎవరి వృత్తంలో వాళ్లం జీవిస్తూ అంతా ద్వీపాంతర వాసులం అయిపోయాం. ఎన్నో సాంకేతిక పరికరాలు, సౌకర్యాలు మనిషిని నిత్యం కల్లోలపరుస్తూనే ఉన్నాయి. పలకరించే మనిషి లేక ఒకరు, ఏకాంతం కోసం ప్రాకులాడుతూ మరొకరు అంతా ఒక గందరగోళంలోనే ఈదులాడుతున్నాం. మనిషికి మనిషికీ మధ్య కిలోమీటర్ల ఖాళీతనం ఏర్పడింది. అదే సమయంలో ఎప్పుడు కావాలంటే అప్పుడు టచ్ స్క్రీన్ మీద కావాలనుకున్న మనిషిని టచ్ చేస్తూనే ఉన్నాం. ఇదంతా సౌకర్యమా? అసౌకర్యమా ఎటూ తేల్చుకోలేని గడ్డ పరిస్థితి. ఇంతా చేసి కవి ఆకాంక్షించినట్లు మనం ఉండాలను కున్నట్లు ఉంటున్నామా? జీవిస్తున్నామా?

**గత రెండు దశాబ్దాలుగా సమూహంలో ఉన్నా ఒంటరితనంలో ఉన్నట్లు, ఒంటరిగా ఉన్నా సమూహంలో ఉన్నట్లు ఒక వింత పరిస్థితి హైటెక్ మనిషిని వెంటాడుతుంది. ఎవరి వృత్తంలో వాళ్లం జీవిస్తూ అంతా ద్వీపాంతర వాసులం అయిపోయాం. ఎన్నో సాంకేతిక పరికరాలు, సౌకర్యాలు మనిషిని నిత్యం కల్లోలపరుస్తూనే ఉన్నాయి. పలకరించే మనిషి లేక ఒకరు, ఏకాంతం కోసం ప్రాకులాడుతూ మరొకరు అంతా ఒక గందరగోళంలోనే ఈదులాడుతున్నాం.**

వ్యాసం

అనేది ఎప్పటికీ సమాధానం దొరకని ప్రశ్నే.

"బుల్ ఫైట్
స్పెయిన్ పెయిన్
గంగిరెద్దుల గందరగోళం
అక్షర మాద కోళం
మా ఇలాఖాలో
ప్రశంస
పురావస్తు ప్రదర్శన
జనం నాలుకల కత్తిరింపు
కంటి వెలుగు చీకటి
ప్రశ్నల గర్భసంచి తొలగింపు
అంతా మీ ఖర్చులోనే
రష్!
హ్రీ అప్..!" (రాజ్య వికృతి)

ఏ కాలంలోనైనా రాజ్యం తన వికృత రూపాన్ని అనేక రూపాల్లో ప్రదర్శిస్తూనే ఉంటుంది. చరిత్ర పొడుగూతా ఒక బుల్‌ఫైట్ నడుస్తూనే ఉంటుంది. గత దశాబ్ద కాలంగా ఇది మరింత ఎక్కువైపోయింది. ప్రశ్నించే నాలుకలను కత్తిరించివేస్తున్నారు. అసలు ప్రశ్నల గర్భసంచినే తొలగిస్తున్నారు. 'దేశమంతా అంతుపట్టని లిపిలేని మూగ భాష' ఆవరించుకుపోయింది. ఆధిపత్యం వెర్రితలలు వేసినపుడు జైళ్లు నిండిపోతాయి. మన వేలిని మన కంట్లోనే పొడిచినట్లు ప్రజలు ఏర్పర్చుకున్న రక్షణ వ్యవస్థలను ఉపయోగించి ప్రజలనే ఇక్కట్లకు గురిచేయడం మరింత దారుణం. అందుకే కవి దీన్ని 'గంగిరెద్దుల గందరగోళం' అన్నాడు.

"కెమెరా గొట్టాల ముందు చొక్కా గుండీలు విప్పి

**కరోనా వలన భూగ్రహం మీదున్న మానవాళి అంతా మానసికంగా చావుకు సిద్ధమైంది. ప్రభుత్వాలు, మీడియా, సామాజిక శాస్త్రవేత్తలు, మానసిక శాస్త్రవేత్తలు అందరూ కలిసి 'పుట్టినవాడు గిట్టక మానడు' అనే గీతా సారాన్ని బలవంతంగా మన మెదళ్లకు ఎక్కించారు. మనిషి బతుకు గాలిలో దీపమైపోయింది. పంచభూతాల వాడకం ఎక్కువైందని భావించిన కార్పోరేట్ శక్తులు భూమి మీద ఇప్పుడున్న జనాభాను సగానికి సగం తగ్గించాలనుకున్నారేమో!**

నిప్పును రాజేసి తప్పుకొనే నీ తైనాతీలతో
పసిపిల్లలను బలిదానాల్లోకి నెట్టేస్తున్నావు
ఎప్పుడైనా ఎక్కడైనా దగాపడ్డ బతుకుల్నే
తగాదాల్లోకి ముందుకు తోయిస్తున్నావు
కారణమొక్కటైతే కార్యచరణ మరోవైపు తిప్పి
లావాలో పడి చావకుండా తప్పుకొంటున్నావు
పెట్టుబడికి ఎత్తుపీటలేస్తున్నావు
స్వార్థ కిరీటాలకు మెరుగు పెడుతూనే ఉన్నావు" (గురితప్పిన పిడికిళ్లు)

అభివృద్ధిలో అగాధాలు సృష్టించి రాజ్యపు వికృత చేష్టల మూలంగా కన్నీళ్లలోనే అగ్నిపర్వతాలు బద్దలవుతున్నాయని ఒక చారిత్రక వాస్తవాన్ని తెలంగాణ గొంతుతో కవిత్వీకరిస్తాడు కవి. తప్పుడు లెక్కల మాటున దోపిడీని కప్పిపెట్టాలని, మాటల మబ్బులతో మభ్యపెట్టాలని చూస్తే ప్రజాగ్రహం కొడవళ్లై, పిడికిళ్లై తిరుగబడుతుందని హెచ్చరిస్తాడు. సమస్యకు పరిష్కారాన్ని కనుగొనకుండా విద్యార్థులను రెచ్చగొట్టి బలిదానాల పాలయ్యేలా చేయడం నీచ, నికృష్ట పద్ధతని లావాలా ఎగిసిపడతాడు. కార్పోరేట్ శక్తులకు, పెట్టుబడిదారులకు పెద్దపీటలేసి ఉద్యమాన్ని మరింత అణచాలని చూస్తే 'మండే కడుపుల్లో తుపాకులు పురుడు పోసుకుంటాయి' అని రాబోయే ప్రజాయుద్ధాన్ని ముందుగానే పసిగట్టి చెప్తాడు. తలదాచుకునే చోటు కూడా లేకుండా ప్రజలు తరిమి తరిమి కొడుతారని ఉద్యమ తీవ్రతను అక్షరాల వర్ణిస్తాడు.

"కొందరు
ప్రశ్న పక్కన నిలబడి
ఇంకొందరు
సమాధానం చాటున దాక్కొని
ఎలాగోలా బతికేస్తూ ఉండేవాళ్లము
ఇప్పుడు అందరము
ప్రశ్నను, సమాధానాన్ని, మూల్యాంకనాన్ని
మనకే ఇచ్చిన కరోనా కారుణ్యంలో మునిగి
గడగడా వణికి చస్తున్నాము
మా మరణశిక్షా పత్రంపై మాతోనే సంతకం చేయిస్తున్నావు కదా






కరోనా... కారణ జన్మమే నీది”
(వైరాయణం)

ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారి మనిషి నిర్మించుకున్న భద్ర ప్రపంచాన్ని ఎంతగా విధ్వంసం చేయాలో అంతగా నాశనం చేసింది. ఎన్నో గుణపాఠాలు నేర్పి, ఎంతో మానవీయ తను లోకానికి చూపి, పక్కవాడు కూడా బావుండాలని కోరుకునే ఒక సర్వకాలిక సౌభ్రాతృత్వాన్ని అలవాటు చేసిపోయింది. కరోనా వికృత రూపాలను భయాన్ని, చావు నుంచి తప్పించుకునే మార్గాలను, స్వీయ నియంత్రణలను, నిర్బంధాలను తెలుగు నేల మీద ఎంతో మంది కవులు కవిత్వీకరించారు. కొంత మంది కరోనా బహురూపతను కావ్యాలుగా వెలువరించారు. మువ్వా శ్రీనివాసరావు కరోనా యొక్క 360 డిగ్రీల సమగ్ర రూపాన్ని వర్ణిస్తూ 'వైరాయణం' రాశారు.

కరోనా వలన భూగ్రహం మీదున్న మానవాళి అంతా మానసికంగా చావుకు సిద్ధమైంది. ప్రభుత్వాలు, మీడియా, సామాజిక శాస్త్రవేత్తలు, మానసిక శాస్త్రవేత్తలు అందరూ కలిసి 'పుట్టినవాడు గిట్టక మానడు' అనే గీతా సారాన్ని బలవంతంగా మన మెదళ్లకు ఎక్కించారు. మనిషి బతుకు గాలిలో దీపమైపోయింది. పంచభూతాల వాడకం ఎక్కువైందని భావించిన కార్పోరేట్ శక్తులు భూమి మీద ఇప్పుడున్న జనాభాను సగానికి సగం తగ్గించాలనుకున్నారేమో! లేదా ప్రజలను పీల్చి పిప్పిచేయాలకున్న మెడికల్ మాఫియానో ఏవో అదృశ్య శక్తులు కరోనా వైరస్‌ను లోకం మీదికి వదిలిపెట్టాయి. కనిపించని వైరస్‌కు మనిషి ప్రాణం విలవిలలాడిపోయింది. అందుకే 'మా మరణశిక్షా పత్రంపై మాతోనే సంతకం చేయిస్తున్నావు కదా! కరోనా.. కారణ జన్మమే నీది' అని వాపోయాడు.

“జీవనయానం చేస్తున్న
సంచారజాతి సోదరులను
రాదారి రశీదును అడిగి
రాచిరంపాన పెట్టినోళ్లం
ఇప్పుడు
అందరికీ రాదారి రసీదు పెట్టి
పొలిమేర దగ్గరే పొర్లు దండాలు
పెట్టిస్తున్నావు కదా
కరోనా... కారణజన్మమే నీది”
(వైరాయణం)

పొట్టచేత పట్టుకొని, సరిహద్దులు దాటి, రాష్ట్రాలు దాటి వలస వెళ్లి కరోనా సందర్భంలో ఇంటికాడ గొడ్డు, గోదా, ముసలి, ముతకా, పిల్లా జెల్లా ఎలా ఉన్నా రోనని మనాదికి లోనై తిరిగి స్వగ్రామా లకు తరలి వస్తుంటే ఎంతో మందిని టోల్‌గేట్లకాడనే ఆపేశాం. బస్సులు లేక రక్తాలు కారుతున్నా కాలినడకన స్వంతూర్లకు వెళ్తున్న వాళ్లను కూడా రాష్ట్ర సరిహద్దులు దాటి లోపలికి రానీయలేదు. కాని కరోనా మనుషులందరికీ పరలోక యాత్రకు టిక్కెట్లు చేతిలో పెట్టిందన్న సంగతి మరిచిపోయామని కవి కరోనా ఆడిన వింత నాటకాన్ని గుర్తుచేస్తాడు.

మువ్వా శ్రీనివాసరావు కవిత్వమంతా చిన్న చిన్న వాక్యాలతో, కొత్త కొత్త పదచిత్రాలతో, అనుభవసారంతో సాగిపోతుంది. పంచభూతాలతో నిర్మితమైన మనిషి నిర్మించుకున్న సమాజమనే 6th ఎలిమెంట్ యొక్క స్వరూప స్వభావాలను ఎంతో గాఢంగా ఆవిష్కరించే కవిత్వమతనిది. వేల కవితా పంక్తుల్లోని ఏ వాక్యమూ అంత సులభంగా పాఠకుల నాలుక మీదికి ఎక్కదు. కానీ కొత్త సినిమా పాటను వింటూ పోయినా కొద్దీ నచ్చినట్లు మళ్ళీ మళ్లీ చదువుతూ పోయినప్పుడు శ్రీనివాసరావు కవిత్వం ఎంతో గొప్పగా నచ్చుతుంది. దానిలోని గాఢత, భావ స్ఫురణ, వాక్యవిన్యాసం, శిల్పమూ అన్నీ పాఠకులను ఒక కొత్త కవిత్వావరణంలోకి తీసుకువెళ్తాయి.

కవి వస్తు వైవిధ్యానికి, పదాల జోడింపులోని మార్మికతకు, సమాజం పట్ల ఉన్న గురుతర బాధ్యతకు మనం ఒకింత ఆశ్చర్యానికి లోనవుతాం. ఎన్నో సమాంతర రేఖలు మన మస్తిష్కంలోకి నేరుగా ప్రయాణించి ఎంతో అలజడికి గురిచేస్తాయి. ఎన్నో దుఃఖపు తెరలు,

> **మువ్వా శ్రీనివాసరావు కవిత్వమంతా చిన్న చిన్న వాక్యాలతో, కొత్త కొత్త పదచిత్రాలతో, అనుభవసారంతో సాగిపోతుంది. పంచభూతాలతో నిర్మితమైన మనిషి నిర్మించుకున్న సమాజమనే 6th ఎలిమెంట్ యొక్క స్వరూప స్వభావాలను ఎంతో గాఢంగా ఆవిష్కరించే కవిత్వమతనిది. వేల కవితా పంక్తుల్లోని ఏ వాక్యమూ అంత సులభంగా పాఠకుల నాలుక మీదికి ఎక్కదు.**

ఎన్నో ఉద్యమాలు, రాజకీయ వికృత రూపాలు, ఆత్మవిమర్శలు, ఎన్నో సెన్సిబిలిటీలు, విపరీత డిజిటలైజేషన్ మనల్ని ఎంతో తీవ్రంగా ఆలోచించేలా చేస్తాయి. 'ఎబిసిడి అక్షరాలు మా తెలివికి అందవు, ఎబిసిడి విటమిన్లు మా తనువుకు దొరకవు, అదేంటో నెత్తురూ చాలినంత వుండదు, వున్నదాంట్లో కూడా వుండాల్సినవి, ఎక్కువో తక్కువో వుంటాయి' అంటాడు. మనుషుల గురించి ఇంతగా పట్టించుకున్న కవి ఈ దశాబ్ద కాలంగా చాలా అరుదుగా కనిపిస్తారు. చాలా కవితలు అబ్‌స్ట్రాక్ట్ పోయెమ్స్‌గానే కనిపిస్తాయి. తిరిగి తిరిగి చదివితేనే ఆ కవిత్వంలోని సారం మన దేహంలోకి, మన మనస్సులోకి ఇంకిపోయి ఎన్నో ఆలోచనలు మొలకెత్తుతాయి.

“Poetry is an intellectual exercise” అంటారు ఆచార్య కె. కె. రంగనాథా చార్యులు. దీనికి సరిగ్గా సరిపోయే కవిత్వం మువ్వా శ్రీనివాసరావు కవిత్వం. కవితా శీర్షికల్లోనే ఎంతో కవిత్వం దాగి ఉంది. పుట మీద కవిత్వాన్ని అమర్చే తీరులో కూడా ఎంతో భావుకతను, తీవ్రతను ఉప్పొంగిస్తారు కవి. Being an average is not enough for me అని నమ్మే కవి శ్రీనివాసరావు.

కవిత



# మట్టి మనిషి



డా॥ భీంపల్లి శ్రీకాంత్, 90328 44017

నిత్తెం మట్టినే శ్వాసిస్తూ
మన కోసం బతికే బియ్యంగింజ

మట్టినే దైవంగా కొలుస్తూ
పచ్చని పైరును కలగనే అన్నంముద్ద

తన సెమటతో నేలంతా తడుపుతూ
నేలనుంచి సిరులను పండించే అన్నదాత

పొలంతోనే నిత్తెం సహవాసం చేస్తూ
మట్టిలోనే బతికే మట్టిమనిషి రైతు

ఆకలితో అలమటించే దేశానికి
అన్నంతో ఆకలితీర్చే అసలైన ఆపన్నహస్తం

ఎండనక వాననక సలనక పగలురాత్రి
వానసుక్క కోసం పడిగాపులు గాసే రైతన్నలకు
తెలంగాణ వచ్చినంకనే ఎనలేని సంబురం

నిత్తెం నీటితో కళకళలాడే ప్రాజెక్టులతోనే
తడారిన రైతుల పొలాలన్నీ సస్యశ్యామలం

ఆకుపచ్చ సందమామ సుట్టూ
నక్షత్రాల్లా రైతులిపుడు పసిడికాంతులు

తెలంగాణల ఇపుడు రైతులదే రాజ్యం
రైతుబంధుతోనే రైతన్నలు సుభిక్షం

కష్టపడి పండించిన పంటకు
రైతుబంధు ఇపుడు ఆపద్బంధువు

తెలంగాణ రాష్ట్రాన రైతిపుడు రాజు
రైతుబంధుతో ఆకుపచ్చ చందమామకు రారాజు

రైతు ఇపుడు అందరికీ ఆత్మబంధువు
ప్రతి బియ్యంగింజెలో కనిపించే ఆపద్బంధువు

## సామాజిక విలువలకు పట్టం కట్టిన...

# శంకరన్ కుట్టి పొట్టెక్కాట్

1980 జ్ఞానపీఠ పురస్కార గ్రహీత

ఎస్.కె.పొట్టెక్కాట్ గా ప్రాచుర్యం చెందిన శంకరన్ కుట్టి పొట్టెక్కాట్ కేరళ రాష్ట్రానికి చెందిన మలయాళ రచయిత. ఈయన దాదాపు ఆరవై దాకా రచనలు చేశాడు. అందులో పది నవలలు, ఇరవైనాలుగు కథానికా సంకలనాలు, మూడు కవితాసంపుటాలు, పద్దెనిమిది యాత్రాసాహిత్య రచనలు, నాలుగు నాటకాలు, ఒక వ్యాససంపుటం, రెండు జ్ఞాపకాలతో కూడిన రచనలు ఉన్నాయి. పొట్టెక్కాట్ 1961లో ఒరు తెరువింటె కథ (ఒక వీధి కథ) నవలకై కేరళ సాహిత్య అకాడమీ అవార్డును పొందాడు. 1980లో ఒరు దేషింటె కథ (ఒక ప్రాంతపు కథ) నవలకు జ్ఞానపీఠ పురస్కారాన్ని పొందాడు. ఇది ఒక అవార్డులు పొందిన చలనచిత్రంగానూ రూపొందించబడింది. ఈయన రచనలు భారతీయ భాషలన్నింటితో పాటు ఆంగ్లము, ఇటాలియన్, రష్యన్, జర్మన్, చెక్ భాషలలోకి అనువదించబడినాయి. ఎస్.కె.పొట్టెక్కాట్ కొళికోడ్లో జన్మించాడు. 1934లో కొళికోడులోని జామోరిన్ కళాశాలనుండి పట్టభద్రుడయ్యాడు. చదువైన మూడు సంవత్సరాలపాటు ఉద్యోగం దొరకలేదు. నిరుద్యోగిగా గడుపుతున్న ఆ సమయాన్ని భారతీయ, పాశ్చాత్య సాహిత్యంలోని ఉత్కృష్ట రచనలను అధ్యయనం చేయటానికి ఉపయోగించుకున్నాడు. 1937 నుండి 1939 వరకు కాలికట్ గుజరాతీ పాఠశాలలో అధ్యాపకుడిగా పనిచేశాడు. 1945లో కేరళ తిరిగివచ్చాడు. 1952లో జయవల్లిని వివాహమాడి, కొళికోడ్లోని పుతియరలో స్థిరపడ్డాడు. 1982 జూలైలో పక్షవాతంతో ఆసుపత్రిలో చేరాడు. ఈయన 1982, ఆగస్టు 6న మరణించాడు. మరణించే సమయానికి పొట్టెక్కాట్ 1962, 1967ల మధ్య పార్లమెంటు సభ్యునిగా ఢిల్లీలో తన అనుభవాలను గ్రంథస్తం చేస్తూ నార్త్ ఎవెన్యూ అనే రచన చేస్తున్నాడు. అది సశేషంగానే మిగిలిపోయింది. పొట్టెక్కాట్ 1930లలో కొన్ని లఘు కథానికలతో సాహిత్య ప్రపంచంలోకి రచయితగా ప్రవేశించాడు. ఈయన మొదటి కథ రాజనీతి, జామోరిన్ కళాశాల పత్రికలో 1928లో ప్రచురితమైంది. మకనే కొన్న మద్యం (ఆత్మవిద్యా కహళంలో అచ్చైన కవిత), హిందూ ముస్లిం మైత్రి (దీపం పత్రికలో ప్రచురించబడిన కథ) ఈయన తొలిరచనలలో ప్రసిద్ధమైనవి. "విద్యుత్ శక్తి" అనే కథ మాతృభూమి వారపత్రిక 1934 ఫిబ్రవరి సంచికలో ప్రచురితమైంది. పొట్టెక్కాట్ యొక్క తొలి లఘుకథల్లో అనేకం ఈ వారపత్రికలో ప్రచురించబడ్డాయి. 1940వ దశకం కల్లా మలయాళ కాల్పనిక సాహిత్యంలో అగ్రగణ్య రచయితగా స్థిరపడ్డాడు. పొట్టెక్కాట్ తన తొలి నవల నాదాంప్రేమమ్ (1941) వ్రాశాడు. ఇది కొళికోడు జిల్లాలోని ముక్కాం అనే గ్రామం నేపథ్యంలో ఒక రొమాంటిక్ లఘునవల. దాని తర్వాత యవనికక్కు పిన్నిల్ అనే కథానికల సంపుటాన్ని వెలువరించాడు. 1940 లో తన రెండవ నవల విషకన్యకను ప్రచురించాడు. ఈ నవల మద్రాసు ప్రభుత్వ పురస్కారాన్ని పొందింది. కప్పిరికలుడె నాట్టిల్ (నీగ్రోల భూమిలో), ఇన్నతే యూరప్ (నేటి ఐరోపా') అనే యాత్రాసాహిత్యరచనలను ప్రచురించాడు. 1952లో, పొట్టెక్కాట్ శ్రీలంక, మలేషియా, ఇండోనేషియా దేశాలు పర్యటించాడు. ఐదేళ్ళ తర్వాత ఫిన్లాండు, ఛెకోస్లొవేకియా, రష్యాలు పర్యటించాడు.పొట్టెక్కాట్ సామాజిక బాధ్యత, సామాజిక విలువలకు పెద్దపీట వేసిన, స్వతంత్ర దృష్టి కల రచయిత . పొట్టేక్కాట్ వెంట్రుకలు నిక్కబొడుకొనేంత ఉత్కంఠతను తన కథల్లో అల్లడంలో సిద్ధహస్తుడు. పొట్టెక్కాట్ కథలు పాఠకులను ఆశ్చర్యచకితులను చేసే కథనంతో నిండి ఉంటాయి. ఉత్కంఠను మరింతగా పెంచేందుకు మధ్య మధ్యలో కొన్ని సూచనప్రాయమైన సన్నివేశాలు ఉంటాయి. వాస్తవికతకు, వర్ణనాత్మకతకు మధ్యలో కొనసాగుతుంది ఈయన రచనా శైలి. ఇది "పుల్లిమాన్" ("మచ్చలజింక"), "స్త్రీ", "వధూ" ("వధువు") మొదలైన కథల్లో కనిపిస్తుంది. రష్యన్ భాషలో వెలువడిన ఈయన వ్రాసిన పదకొండు లఘుకథల సంకలనం రెండు వారాల్లోనే లక్ష కాపీలు అమ్ముడుపోయి సంచలనం సృష్టించింది. ఈయన జీవచారిత్రక నవల ఒరు దేషింటె కథ 1972లో కేరళ సాహిత్య అకాడమీ అవార్డు, 1977లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, 1980 లో జ్ఞానపీఠ పురస్కారం అందుకొన్నది. 1982, మార్చి 25న కాలికట్ విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేటు ప్రదానం చేసింది.



ముఖాముఖి

# కవులకు విమర్శను కూడా స్వీకరించే సహృదయత ఉండాలి....

- గంద్ర లక్ష్మణ్ రావు

ఆయన ఒక సాహిత్య రస ప్రవాహం. కలంలోనూ, గళంలోనూ ప్రత్యణువూ సరస్వతిని చూపించగల దిట్ట గంద్ర లక్ష్మణ్ రావు. ఆయన జీవన పార్శ్వంలోని స్ఫూర్తివంతమైన అనుభవాలను, సాహితీ సృజనలోని ఎన్నో మేలురాళ్ళని, మైలురాళ్ళని ఈనాటి ముఖాముఖిలో తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి నంది శ్రీనివాస్‌తో పంచుకున్న విశేషాలను మా పాఠకుల కోసం...

**నమస్కారం!! లక్ష్మణరావు సర్, జగమెరిగిన మీరు మీ బాల్యాన్ని తంగేడుకు ఎరుకపరుస్తారా!!**

నమస్కారం. మా ఊరు పెగడ పల్లి. ప్రస్తుతం జగిత్యాల జిల్లా ఒకప్పుడు తాలూకా. ఇప్పుడు మా ఊరే మండలం. నా చిన్న తనం మా ఊరులోనే గడిచింది. నా రెండేళ్ల వయసులో మా తల్లి పరమపదించింది. మా చిన్నమ్మ (మా బాపు తమ్ముని భార్య) నన్ను మా అన్నలను అక్కలను తన పిల్లల వలెనే పెంచింది. మా బాపు మమ్ములను తల్లి లేని పిల్లలమని కంటికి రెప్పలా పెంచారు. మమ్ములను బుద్ధిమంతులను చేయాలని ఆరాట పడ్డారు. చిన్నప్పటి నుండి చదువు గురించి చెపుతుండే వారు. నేను నెక్కరు కూడా వేసుకోలేని వయసులో మా ఊరి లో ఉన్న భట్టు పంతులు నరసింహ రాజు (నర్సయ్య పంతులు అని పిలిచేవారు)



గారి వద్ద ఒక పెద్ద కట్టే పలక ఇచ్చి చదివించారు. నేను భుజానికి వేసుకొని నడిస్తే అది భూమికి రాసుకుంటూ వచ్చేది. నాకు మొట్ట మొదట నర్సయ్య గారే అ ఆ లు దిద్దించారు. అప్పుడప్పుడు. ఆయన ఒక బట్ట కుర్చీలో కూర్చునే వారు. నా వలె మరో ఇద్దరు ముగ్గురు నేల మీద కూర్చునేవారం. ఆయన అక్షరాలు దిద్దించిన ముహూర్తమో వారి చేతి చలవనో ఆశీర్వాదమో నాలుగక్షరాలు వచ్చాయని నలుగురిలో అనిపించు కుంటున్నాను.

తరువాత మా ఊరి బడిలో చేర్పించారు. మా బాపు రాత్రులు ముఖ్యంగా ఎండాకాలంలో వాకిట్లో మంచం పై పడుకొని నాతో పద్యాలు అనిపించే వారు. హరి యను రెండక్షరములు, దీపము కలిగిన ఇంటను, గంగిగోవు పాలు, మొదలైన ఎన్నో పద్యాలు నోటికి వచ్చేవి. మేము మూడు నాలుగు తరగతులకు వచ్చేటప్పటికి భారతం, భాగవతం రామాయణంలోని కథలు పడుకునే ముందు చెపుతుండే వారు. ఒక్కోసారి ఏదైనా కల్లం పని ఉంటే అక్కడ పని చేసుకుంటూ వినేవారం. చదువు తో పాటు మంచితనం, ధర్మం, సత్యం మొదలైనవి చెపుతుండే వారు. అంతగా అర్థం కాకపోయినా వాటి గురించిన పరిచయం అయింది. హరి కథలకు నేను వెంట వెళుతుండేవాణ్ని. నాటకాలు చిరుతల రామాయణాలు చూసే వాళ్ళం. ప్రతిరోజు బడి నుండి వచ్చిన తరువాత లేదా పొద్దున ఏదో ఒక వ్యవసాయం పని చేసేవారం. మిరప తోటకు మోట కొట్టటం లేదా నీళ్ళు కట్టటం చేసే వాళ్ళం వ్యవసాయం పనులు బాగా ఉన్నప్పుడు ఎడ్లను మేపటమో చద్దులు తీసుకొని పోవటమో చేసే వాళ్ళం. కష్ట పడి పని చేయాలని ఎప్పుడు మా బాపు చెపుతుండే వారు. ఒక విధంగా మా బాపే మాకు అన్నీ విధాలా గురువు, తండ్రి, దైవం.

**అప్పటి బడిలో బోధనా విధానం ఎలా ఉండేది? విద్యార్థిగా మీరెలా ఉండేవారు?**

మా బడిలో చదువు బాగా సాగేది.

పోటీ పడే వాళ్ళం. నేను నాలుగవ తరగతి లో ఉండగా గాంధీ జయంతి రోజు మా పక్క ఊరు నంచర్లకు గ్రామ పరిశుభ్రత గురించి గాంధీ గురించి తెలియ జేయాలని వీధులు శుభ్రం చేయడం వంటి పనులకోసం మా ఉపాధ్యాయులు మా బడి నుండి కొందరిని తీసుకెళ్లారు. నడిచి పోవాలి. మా అవ్వ (పెంచిన అమ్మను అట్లే పిలిచే వారం) నేను బక్కగా ఉన్నానని బక్కవ్వా అని పిలిచేది. నేను నడవ లేనని వద్దన్నది. కాని మా బాపు పోనీ వాడే అలవాటు పడటాడని పంపారు. నంచర్లలో మధ్యాహ్నం వరకు వీధులు శుభ్రం చేశాం. తరువాత పాఠశాల ఆవరణలో చెట్ల కింద ఒక సమావేశం ఏర్పాటు చేశారు. బడి పిల్లలందరితో పాటు ఊరి ప్రజలు కూడా ఉన్నారు. గాంధీ గురించి నాకు మా ఉపాధ్యాయులు ఒక తెల్ల కాగితం పై రెండు వైపులా రాసి ఇచ్చి అదే మాట్లాడుమన్నారు. అది నాలు గైదు సార్లు చూసుకున్న. అక్కడ మాట్లాడే తప్పుడు కాగితం ముందు పెట్టుకున్న కానీ నేను ఎదురుగా ఉన్న వారిని చూస్తూ నోటికే మాట్లాడిన. వాక్యాలు రాసి నట్లు గానే కాకుండా స్వంతంగా మాట్లాడిన. కొన్ని వాక్యాలు నా స్వంతంగానే కలిపిన. మా ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు ప్రజలు చప్పట్లు కొట్టారు. మా ఉపాధ్యా యులు చాలా సంతోషించి మా బాపుకు చెప్పారు. నా జీవితంలో అదే నా మొదటి ప్రసంగం. ఆ సంఘటన నాకు సభలో మాట్లాడే ధైర్యాన్నిచ్చింది. అట్లే తరగతిలో పాఠాలు నోటికి వచ్చేటట్లు చదివే వాడిని. పద్యమైన వచనమైనా. బాలచంద్రుని పాఠం నోటికి వచ్చేది. స్కూల్ ఇన్స్పెక్టర్ వచ్చినపుడు నాతో నోటికి పాఠం చదివించారు. ఇవే క్రమంగా నేను జ్ఞాపకం పెంచుకునే అభ్యాసానికి కారణ మయ్యాయి. ప్రాథమిక స్థాయిలో కూడా సెలవుల్లో పిల్లల కథల పుస్తకాలు ఇచ్చి చదువుమనే వారు. బంగారు ఎలుక కథ నాకిప్పటికి జ్ఞాపకముంది.

**తెలుగు సాహిత్యంపై మీకెలా అభిమానం కలిగింది? వందలాది పద్యాలను ధారణచేయగల సామర్థ్యం ఎలా కలిగింది?**

నాకు గణితం అంటే ఎక్కువ ఇష్టం. 8వ తరగతి వరకు ఎప్పుడు నాకు గణితం లో నూటికి నూరు వచ్చేవి. పుస్తకంలో జవాబులు తప్పులు ఉంటే, కాదు లెక్కలోనే తప్పున్నదని అందులోని అంకెలను మార్చి జవాబు సరిపోయిందని చూపే వాడిని. జవాబులు దిద్దాలి గాని లెక్క దిద్దకూడదు అని మా ఉపాధ్యా యులు అనే వారు. అయితే మా బాపు బడిలో తెలుగు సార్ల కారణంగా తెలుగు అభిమానం పచ్చిగానే ఉంది.

చొప్పదండి ఉన్నత పాఠశాలలో పలుగుల భూమా రెడ్డి అనే తెలుగు పండితుడు మాకు తెలుగు చెప్పేవారు. పద్యం చాలా అందంగా చదివేవారు. పుస్తకం లోనివి కాక ఎన్నో పద్యాలు చదివి పల్లా దుర్గయ్య గారు, మరి కొందరి పేర్లు చెప్పి వారిట్ల చదివే వారని అర్థాలిట్ల ఉంటాయని ఎంతో రుచిగా చెప్పేవారు. ఆయన తరగతి ఆసక్తిగా వినేవాళ్లం. నాతో పాటు ఆచార్య అనుమాండ్ల భూమయ్య (తెలుగు విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షులుగా చేశారు) కూడా ఉన్నాడు. ఆయన కూడా పద్యాలు బాగా చదివేవాడు. అప్పుడు నేను ఐచ్ఛికం గణితం, భూమయ్య సంస్కృతం.

వేసవి సెలవుల్లో ఇంటికి వచ్చినపుడు ఏ పుస్తకం దొరికితే అది చదువుతుండే వాడిని. ఒకసారి డిటెక్టివ్ నవల చదువుతుండగా మా ఊరిలో వి.ఎల్.డబ్ల్యూ.గా పని చేస్తున్న రెడ్డి నన్ను చూసి ఇట్లాంటి పుస్తకాలు మీరు చదువకూడదు. మంచి పుస్తకాలు నేను ఇస్తాను అని గ్రామ పంచాయతీ గ్రంథాలయంలో నుండి రవీంద్ర నాథ్, శరత్ నవలలు ఇచ్చాడు. అప్పటి నుండి అనేక పుస్తకాలు చదివాను.

ఇట్లా చిన్నప్పటినుండి తెలుగు సాహిత్యం పై అభిమానం ఆరకుంటా సాగింది.

**సాహిత్యంలో ఉద్దండులకు శిష్యులుగా, సమకాలీనులుగా సాగిన మీ కళాశాల, ఉన్నత విద్యాభ్యాసం గురించి వివరించండి.**

పి.యు.సి.లో ఏం.పి.సి., డిగ్రీ కూడా ఏం.పి.సి. అయితే డిగ్రీలో జగిత్యాల కళాశాలలో సాహిత్య వాతావరణం బాగా కలిగించారు అప్పటి మా ప్రిన్సిపల్ వి. కొండల్ రావు గారు. అక్కడే విశ్వనాథ, దివాకర్ల, పాటిబండ, వానమామాలై, వరవర రావు, సినారె, వంటి ఎందరో మా కళాశాలకు వచ్చారు. కాలేజీలో పెద్ద గ్రంథాలయం. రీడింగ్ రూమ్‌లో నాలుగు భాషల్లో కలిసి 70 పత్రికలు ఉండేవి. తెలుగు కోవెల సంపత్కుమారాచార్య గారు చెప్పారు. చాలా చమత్కారాలతో అనేక విశేషాలు చెపుతుండేవారు. అక్కడ డిగ్రీలో

"బళ్ళో పాఠములు వినరు,
గుళ్ళో దేవుని గొలువరు కూరిమి తోడన్,
కిళ్ళీ నములుచు సోకుగ
వెళ్ళేరు బజారు వెంట వెండియు మూఢుల్"

అని తరగతిలో అల్లరి చేసే వాళ్ళను గురించి పద్యాలు రాసేవాడిని. అప్పుడే కవిత్వం రాయడం మొదలు పెట్టాను. అయితే అదే సాధనగా కానీ ప్రధానంగా గాని కాదు. 1970లో కళాకేళి అని ఒక సాహిత్య పత్రిక సోమ సుందర్ సంపాదకత్వంలో వెలువడేది. "ఏమయి






పోతుంది నా దేశం'' అనే కవిత పంపిస్తే అందులో ప్రచురించారు.

1969లో తెలంగాణ నాన్ ముల్కీ గో బ్యాక్ ఉద్యమంలో ఒక సంవత్సరం కళాశాలలు దాదాపు మూత పడ్డాయి. అప్పుడప్పుడు సదస్సులలో పాల్గొంటూనే సాహిత్య పుస్తకాలు బాగా చదివాను. సదస్సులల్లో అయ్యయ్యో బ్రహ్మయ్య అని బ్రహ్మానంద రెడ్డిపై పాటలు పాడేవాడిని. కవితలు చదివేవాడిని. కళాశాల గ్రంథాలయంతో పాటు మా ఊరి గ్రామ పంచాయతి, పాఠశాల గ్రంధాలయాల నుండి పుస్తకాలు తెచ్చుకొని చదివే వాడిని. సంపత్కుమార సన్నిహితం అయ్యారు. ఇంటికి వెళ్ళి పుస్తకాలు తెచ్చుకునే వాడిని. సారు కూడా ఇది చదువు, ఇది కొత్త పుస్తకం అంటూ ఇచ్చేవారు. చదివిన తరువాత కలిసినప్పుడు అనేక సందేహాలు తీర్చడమే కాక కొత్త విషయాలు చెపుతుండేవారు.

శ్రీనాథుని హర విలాసము, పింగళి ప్రభావతీ ప్రద్యుమ్నం, జక్కన విక్రమార్క చరిత్ర, గోపరాజు సింహాసన ద్వాత్రింశిక, వంటి ప్రభంధాలు చదివాను. ఆముక్త మాల్యద నేను భూమయ్య వాళ్ల వారి టీకాతో కలిసి చదివాము. ఇక్కడ కూడా మేమిద్దరం ఒకే తరగతి. అప్పుడు పద్యాలు రాసే వాడిని. ఆధునిక కవులు శ్రీశ్రీ గురుజాడ ఆరుద్ర దాశరథి సినారె కుందుర్తి బాపురెడ్డి మొదలైన వారి రచనలు చదివాను. శ్రీశ్రీ కవితలు సగం నోటికి వచ్చేవి. తోటి విద్యార్థులతో మిత్రులతో మాట్లాడుతున్నప్పుడు కొటేషన్లు వినిపించే వాడిని. కుందుర్తి నాలోని నాదాలు, తెలంగాణ, నగరంలో వాన బాగా నచ్చినవి. నగరంలో వాన చివర నాలుగు భాగాలుగా అముద్రిత కావ్యం అనే రచన ఒక ప్రయోగంలా సాగింది. ఇది చదువక ముందే అద్దేపల్లి కుందుర్తి అముద్రిత కావ్యంలో శిల్ప వైభవం అనే వ్యాసం చదివాను. అది అముద్రితమైన వ్యాసం రాశారని సంపత్ కుమారతో అన్నపుడు, ఆ కావ్యం పేరే అది అని ఆ పుస్తకం ఇచ్చాడు.

దాశరథి అగ్నిధారలోని పద్యాలు, జంధ్యాల ఉదయశ్రీ పద్యాలు, శ్రీనాథుని చాటు పద్యాలు బాగా చదివించాయి. మా ఊరిలో సీతారామయ్య అనే అతను మా బాపు వయసు. భారతం బజారులో కూర్చొని చదివేవారు. నేనాయన దగ్గర వింటూ నిల్చునే వాడిని. తరువాత నేను జంధ్యాల పద్యాలు వినిపిస్తే సంతోషించి నాతో రోజు కొన్ని పద్యాలు చదివించు కునేవారు. అట్లా పద్యాల మీద ప్రేమ పెరిగింది. సినారె అక్షరాల గవాక్షాలు, దాశరథి కవితా పుష్పకం కొత్తగా వచ్చాయి, దాశరథి మొదటి గజల్ అందులోనే రాశారు. దాని ఛందస్సు గురించి సంపత్కుమార దాశరథికి ఉత్తరం రాస్తే ఆయన వివరాలతో సమాధానం రాశారు. అది మాకు చూపించి గజల్ గురించి చెప్పారు.

విశ్వనాథ వేయిపడగలు మేము అద్దె కు ఉంటున్న ఇంటిలో అరుగు మీద కూర్చొని పైకి చదివితే చదువు రాని ఇంటి వారు ఇద్దరు అక్క చెల్లెళ్ళు వినేవారు. మా పక్క గదులలో ఉండే విద్యార్థులంతా వినే వారు. ఒక సీరియల్ లాగా. ఒక్క రోజు చదువకపోతే అయ్యో చదువు అనేవారు. అప్పట్లో బాగా ప్రసిద్ధి పొందిన అడవి బాపిరాజు, కొమ్మూరి వేణుగోపాల్ రావు, గోపీచంద్, ద్వివేదుల విశాలాక్షి, చిలకమర్తి, మొదలైన నవలాకారుల నవలలు చదివే అవకాశం కలిగింది. ఉద్యమ సంవత్సర మంతా సాహిత్యం చదువడమే అయింది. నీల్ ఆర్మ్ స్ట్రాంగ్ చంద్రునిపై అడుగు పెట్టినపుడు "ఓహో విహాయసమ్ము నందు ఓలలాడు చంద్రమా, ఆహా నినున్ జయించు నట్టి అందగాడు ఉండునా'' అని పంచ చామరం వృత్తం రాశాను.

డిగ్రీ చదువు బాగా చెదరి పోయింది. ఆలస్యంగా డిగ్రీ అయింది. ఒక సంవత్సరం ఉద్యోగం కోసం వేటాడి విఫలమై ఆలస్యంగా ఉస్మానియాలో తెలుగు ఎం.ఏ.లో చేరాను.

**సైన్స్ చదివి ఏదైనా ఎం.ఎస్సీ.లో చేరకుండా తెలుగులో చేరారు అభిమానంతోనా?**

నాకు సైన్స్ లో ఫిజిక్స్ చాలా ఇష్టం కానీ అందులో సీట్ రాలేదు. ఇంగ్లిష్ లోనూ తెలుగులోను దరఖాస్తు చేస్తే ఒక మార్క్ లో ఇంగ్లిష్‌లో రాలేదు. తెలుగు అభిమానం ఉంది కానీ ఉద్యోగం దొరకదని అందరూ వద్దని సలహా, కానీ ఏమైనా సరే తెలుగు చదవాలని చేరాను.

ఆచార్య దివాకర్ల వారి వ్యాకరణ ప్రబంధ పాఠాలు, సినారె శ్రీనాథుని పాఠాలు, మాధవ శర్మ మేఘ సందేశం, యశోదారెడ్డి ప్రతిమానాటకం పాఠాలు చెరగని ముద్ర వేశాయి. జి.వి. సుబ్రహ్మణ్యం ముద్రారాక్షసం నాటకం చాలా అద్భుతంగా చెప్పారు. ప్రతి పాఠం ఇప్పటికీ వింటున్న అనుభూతి ఉంది. అప్పుడు తెలుగు సాహిత్య అధ్యయనం మరింత పెరిగింది. పరీక్ష కోసం కాక తెలుసుకోవాలనే జిజ్ఞాసతో అనేక వ్యాఖ్యానాలు విమర్శలు పరిశోధనలు విశ్వ విద్యాలయం గ్రంథాలయంతో పాటు

ముఖాముఖి

అఫ్జల్‌గంజ్, చిక్కడపల్లి గ్రంథాలయాలు తిరిగి పుస్తకాలు వెతికి చదివాం. నల్లగొండ జిల్లాకు చెందిన గురిజాల రామ శేషయ్య నేను ఒకే గదిలో ఉండేవాళ్లం. మా పక్క గదిలో పాలకుర్తి మధుసూదన్ రావు.

సినారె మమ్మల్ని ఎంతో అభిమానంతో చూసేవారు. అప్పుడు మేమిద్దరం కలిసి పద్యాలు రాసి కృష్ణా పత్రిక, ప్రజాతంత్ర పత్రికలకు పంపగా అవి అచ్చయ్యాయి. ఆధునిక, సంప్రదాయ భేదం లేకుండా చదివాము.

**ఉద్యమంగా చేసిన మీ ఉద్యోగ ప్రస్థాన వివరాలు చెప్పండి?**

నాకు ఇష్టమైన విద్య చదువు కోవడం, అదే ఉద్యోగం కావడం వలన ఉద్యోగ జీవితం సంతృప్తి కరంగా సాగింది. జూనియర్ డిగ్రీ కళాశాలలలో పాఠాలు చెప్పడం కూడా ఒక అధ్యయనంవలెనే సాగింది. ఎందరో విద్యార్థులు సాహిత్యం పట్ల అభిరుచి చూపించేటట్లు బోధించాను. కళాశాల సంచికలు వెలువరించడమే కాక విద్యార్థుల కవితా సంకలనాలు కూడా వెలువరించడానికి ప్రోత్సహించాను. సాహిత్యంలో ప్రసిద్ధులైన వారిని పిలిపించి ప్రసంగాలు అవధానాలు కవిసమ్మేళనలు ఏర్పాటు చేయడం నిరంతరంగా కొనసాగించాను. కె.ఎస్. అనంతాచార్య, పెరుక రాజు మట్టా సంపాత్కుమార్ విలాసాగరం రవీందర్ వంటి వారెందరో మంచి కవిత్వం రాస్తున్నారు.

నేను పని చేస్తున్న జూనియర్ కళాశాలకు ప్రిన్సిపల్‌గా ప్రముఖ పండితులు కవి అయిన గర్రెపల్లి సత్యనారాయణ రాజు ఉండడం ఒక అవకాశం. ఎన్నో సార్లు సాహిత్యాన్ని గురించి పద్య శిల్పాలను గురించి వారు చెపుతుండే వారు. ముఖ్యంగా వసుచరిత్ర విశ్లేషణ బాగా చేసే వారు. అష్టావధాని పార్వేల్ల గోపాలకృష్ణ సహోపన్యాసకులు. ఎందరో సాహితి మిత్రులు సాహిత్యంలో మా విద్యార్థులతో పాటు మేం గొప్ప అనుభూతిని పొందగలిగాము.

ఉద్యోగంలో ఉన్నంత సేపు కేవలం వృత్తిగా కాక అది నా జీవితంగా భావించాను. భాష సాహిత్యాలే జీవితాన్ని కూడా నిలబెడుతున్నాయి కనుక సమాజం లో కూడా సాహిత్య సేవ చేయాలనే ఆలోచన ఉండేది.

**సాహితీ సంస్థల వ్యవస్థాపకులుగా, సమాజానికి సాహిత్యాభిరుచిని కలిగించిన మీ సాహిత్య సేవ చాలా గొప్పది. ఆ వివరాలు అందించండి.**

మూడు దశాబ్దాలకు పైగా



నిర్విరామంగా సేవలందించానని సంతోషంగా సంతృప్తిగా సగర్వంగా చెప్పగలను. 1990 నుండి కరీంనగర్‌లో నాతో పాటు గోపు లింగారెడ్డి డింగరి నరహరి చారి వారాల ఆనంద్ ఎన్ శ్రీనివాస్ ఎన్ గంగయాచారి బి. దామోదర్ రావు, గజేందర్ రెడ్డి, అనంత చారి మాడిశెట్టి గోపాల్ వంటి వారితో కలిసి సమతా సాహితి, సాహితి గౌతమి సంస్థలను ఏర్పాటు చేశాం. ఈ అన్నీ సంస్థల వ్యవస్థాపనలో నేను కీలక పాత్ర పోషించాను. రవాణా ప్రసార సౌకర్యాలేవీ లేని రోజులలో ఇంటింటికి తిరిగి అభిమానులను కూడగట్టి సాహిత్య కార్యక్రమాలను నడిపించి ఒక సాహిత్య వాతావరణం కలిగించాం. క్రమంగా సంస్థలు పోటీ పడి కార్యక్రమాలు నిర్వహించే విధంగా మారిపోవడం సంతోషాన్ని కలిగించాయి. కొన్ని వందల సమావేశాలు నిర్వహించాము. కవుల పరిచయాలు, విమర్శలు, కావ్య సమీక్షలు ఆవిష్కరణలు సదస్సులు జయంతులు వర్ధంతులు ఎన్నో విస్తృతంగా నిర్వహించాము. రాష్ట్రంలో సంస్థలకు తగిన గుర్తింపు గౌరవం లభించింది.

ఉద్యోగంలో ఉండగానే వీటిని నిర్వహిస్తు ఇప్పటికీ వాటి బాగోగులు పట్టించు కుంటున్నం. తరువాత పద్య కవితా సదస్సు సంస్థ కూడా ఏర్పాటు చేసి పద్య కవిత్వానికి అమితమైన ప్రోత్సాహ మందించే కార్యక్రమాలు నిర్వహించాము.

**నిత్యనూతన సృజనకారులు మీరు. మీ సాహితీ సృజనను వివరించండి.**

నేను ఉద్యోగంలో చేరిన తరువాత ఎక్కువగా విద్యార్థులు సాహిత్యాభి మానులు నాకు ప్రధాన మయ్యారు. అయినా నా పద్ధతిలో నేను ప్రసంగాలు చేస్తూ రాస్తూ ఉన్నాను. అయితే నేను రాసినవి భద్రపరచుకోవడం పత్రికలకు పంపడం ప్రచురించడం ప్రచారం కొరకు ప్రయత్నించడం వంటివాటి పై నేను శ్రద్ద పెట్ట లేదు. ముగ్గు, వర్తమాన సంధ్య అనే వచన కవిత సంపుటాలు ప్రచురించాను. కాకతీయ విశ్వవిద్యాలయంలో వేయిపడగలు నవలపై పరిశోధన చేసి గ్రంథం ప్రచురించాను. ఒక పద్యం నేర్చుకుందాం పేరుతో వంద ఎంపిక చేసిన పద్యాలకు సామాజిక వ్యాఖ్యతో రాసి ప్రచురించాను. మా ఊరి చరిత్ర దేవాలయ విశేషాలతో రాశాను. మీ (నంది శ్రీనివాస్) కోరికతో ఒక రోజులో భువన విజయం నాటకం రాసి రెండు రోజులలో ప్రదర్శన కూడా ఇచ్చాము. నేను కూడా పాత్ర ధరించాను. అది పుస్తకంగా ప్రచురించాను. సాహితి వనమాలి పేరుతో విమర్శనా వ్యాస సంకలనం మా గురువు గారు సంపత్కుమారకి అంకితంగా ఇచ్చాను. ప్రపంచ తెలుగు మహాసభలు 2012 తిరుపతిలో జరిగిన సందర్భంగా

నేను వెళ్ల లేదు కానీ తెలుగు అకాడమీ సంచాలకులు ఆచార్య యాదగిరి సూచన మేరకు తెలుగులో రామాయణం పేరు తో సుమారు 30 రామాయణాల పరిచయంతో ఒకపుస్తకం రాయగా వారు ప్రచురించారు. 2017లో అత్యంత వైభవంగా తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ప్రపంచ మహాసభలలో నా వంతు కృషి చేయడంతో పాటు అకాడమీ అధ్యక్షులు డా॥ నందిని సిధారెడ్డి సూచనతో తెలంగాణ పద్య కవితా వైభవం పేరుతో ఒక పుస్తకం రాశాను. వారు ప్రచురించారు. శతకాలలో మకుటం సాధారణంగా చివరికి ఉంటుంది కానీ నేను మకుటం కిరీటం వలె ముందుం డాలనే ఉద్దేశంతో నీవు అనే మకుటంతో పర తత్వాన్ని సారాంశంగా శతకం రాశాను. ఏక ప్రాస ఆద్యమకుటంతో తెలుగు శతక సాహిత్యంలో ఇదే తొలి ప్రయోగంగా చాలా మంది పెద్దలు ప్రశంసించారు. మా ఊరి రాజా రాజేశ్వర స్వామిపై ఒక శతకం కూడా రాశాను. నేను పరిష్కరించి ముందు మాటలు రాసినవి కొన్ని వందలు ఉంటాయి. అందులో కొన్నింటిని ఎంపిక చేసి కె.ఎస్. అనంతా చార్య సంపాదకత్వంలో ప్రస్తావన వెలువరించారు. వచన కవిత్వం వచనంలా పెరాగ్రాఫ్‌లుగా ఉంటే ఎట్లా ఉంటుంది శేషేంద్ర వంటి కొందరు రాశారు నేను అట్లా రాశాను. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన రచయిత ఖలీల్ జీబ్రాన్ రాసిన “ద మ్యాడ్ మాన్” అనే పుస్తకం తెలుగులో వెర్రిమానవుడు పేరుతో అనువదించాను. ఇంకా ఆముద్రితాలు ఎన్నో ఉన్నాయి.

పద్యాలు, వచనం, నాటకం విమర్శ వీటితో పాటు ఒక కథ మాత్రమే రాశాను. అవ్వ పేరుతో అది ఆంధ్ర భూమిలో అచ్చయింది. ఇంక కొన్ని ప్రయోగాలు న్నాయి.

**ప్రతిభావంతులైన మీరు తెలంగాణ ఉద్యమాన్ని ప్రభావితం చేసిన ఘట్టాలను వివరించండి.**

తెలంగాణ మలి దశ ఉద్యమంలో నేను ఉద్యోగంలో ఉన్న. అప్పటికి తెలంగాణా సాహితీ వేత్తలంతా ఒకటి కావాలనే సంకల్పం ఒకటి నందిని సిధా రెడ్డి చేశారు. రాజకీయాలు ఎలా ఉన్న సాహితి వేత్తలం చీలి పోకూడదనే రెండు వైపులా వారు చాలా కాలంగా అంటూవచ్చారు. కానీ సిధారెడ్డి సాహసం చేశారు. సిద్దిపేటలో సదస్సులో ఈ ఆలోచనతో తెలంగాణ రచయితల వేదిక ఒకటి ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకున్నారు. అందులో నేను కూడా ఉన్నాను. ఆ తరువాత 2002లో కరీంనగర్‌కు పది జిల్లాల సాహితి సంస్థల నన్నిటిని ఆహ్వానించి సదస్సు ఏర్పాటు చేసి తెలంగాణ రచయితల వేదిక సంస్థ రూపొందించడంలో నేను, వారాల ఆనంద్ గోపు లింగారెడ్డిలతో ప్రధాన పాత్ర నిర్వహించానని సంతోషంగా చెపుతాను.

ఉద్యమ కాలంలో తెలంగాణ ప్రాచీన సాహిత్యం పై విశేషాలతో అవసరమైన చోట ప్రసంగాలు చేశాను. కవితలు రాశాను. కరీంనగర్ లో అత్యంత వైభవంగా తెలంగాణ రచయితల వేదిక పక్షాన రాష్ట్ర సభలు నిర్వహించడంలో మేం ప్రధాన పాత్ర పోషించాము. ఇప్పటికీ తెలంగాణ మరుగున పడిన కవులను వెలికి తీయడానికి ప్రచారం చేయడానికి ప్రోత్సాహం కలిగిస్తూనే ఉన్నాను. ఆచ్చి వెంకటాచారి మా ఊరు, ప్రచారంలోకి రావడానికి పునర్ముద్రణకు ప్రోత్సహిం చాను. శతావధాని కృష్ణమాచార్యులు గారికి ప్రసిద్ధి రావడానికి ప్రచురణలు సదస్సులు ఏర్పాటు చేశాను.

తెరవే కరీంనగర్ పక్షాన, సాహితి గౌతమి పక్షాన ఇతర సంస్థల పక్షాన పుస్తకాలు ప్రచురించడానికి కృషి చేశాను.

**బహుముఖ ప్రజ్ఞాశాలి గా మీరు ఈ సమాజం నుండి పొందిన పురస్కారాలు ఏవి?**

నేను వాటి కోసం ఏనాడూ ప్రయత్నిం చడం కానీ ఎదురు చూడడం కానీ చేయలేదు. నేనే మా బాపు గంద్ర హన్మంత రావు పేరిట ఒక పురస్కారం ఏర్పాటు చేసి కవిత్వేతర ప్రక్రియలలో ఎంపిక చేసిన వారికి 2006 నుండి 5 వేల రూపాయలతో ప్రదానం చేస్తున్నాను. కథ, నవల, విమర్శ, నాటకం అనువాదం, పాత్రికేయ రచన మొదలైన అంశాలలో పురస్కారాలు అంద జేశాను. పెద్దింటి అశోక్ కుమార్, అనుమాన్ల, కె.వి. నరేందర్, సరిపల్లి, అంబల్ల జనార్దన్, బి. విజయ కుమార్, సంగన భట్ల, గోరటి, మొదలైన వారెందరో గ్రహీతలు.

వానామమలై వరదాచార్య స్మారక పురస్కారం, దాశరథి స్మారక పురస్కారం, పి.వి. నరసింహారావు స్మారక పురస్కారం సర్వవైదిక సంస్థ పురస్కారం సుదర్శనం హన్మాండ్లు స్మారక చింతల లక్ష్మారెడ్డి పురస్కారం తెలుగు విశ్వ విద్యాలయం వారి కీర్తి పురస్కారం మొదలైనవి కొన్ని. నా ప్రియ శిష్యుడు సైనికాధిపతి రచయిత పెరుకరాజు వారి ఊరిలో పెద్ద సన్మానం చేసి మైత్రి పురస్కారం అందుకోవడం విశేషం. భువన భారతి భూషణ పేరుతో భువన భారతి ఆలేరు వారు, సాహితీరత్న పేరుతో సారస్వత జ్యోతి మిత్రమండలి వారు, సాహితి కంఠీ రవ పేరుతో జగిత్యాల ఏం వి.. నరసింహ రెడ్డి గారు సత్కరించారు.



ముఖాముఖి

**సాహితీ దిగ్గజంగా మీరు వర్ధమాన సృజనకారులకు ఇచ్చే సందేశం...**

అధ్యయనం ఎక్కువగా చేయాలి. ప్రాచీన సాహిత్యాన్ని గుడ్డిగా పక్కన పెట్ట కూడదు. ఎన్నో శబ్ద ప్రయోగాలు, కవిత్వ వ్యక్తీకరణలు అపారమైన భావ సంపద అందులో ఉంది. ఆధునిక కవులను కూడా లోతుగా చదవాలి. కేవలం వస్తువుతో తత్కాల ప్రచారం సరిపోదు. ఉన్న ఎన్నో రూపాలను నిశితంగా చూడాలి. ప్రచారం కీర్తి దాహం అతిగా ఉండకూడదు. ఉంటే ఎట్లా పేరు వస్తుందో చూస్తారు కానీ ఏది నిలుస్తుందో చూడరు. తర తరాలుగా ఏ భాషలో నైనా సాహిత్య సంపద గొప్పది. ఒక అమృత నదీ ప్రవాహం. దాన్ని ముందుగా ఆస్వాదించి కొత్త పాయలు వేయండి. సమాజం ఎప్పుడు పచ్చగా ఉండ డానికే నిత్య ఫలపుష్ప భరితమైన పూదోటలా ఉండడానికే మనం సృజన చేయాలి. సాహిత్యం ప్రచారం చేయాలి. కేవలం సృజన కాదు నిలపడానికి తరువాతి తరాలకు చేరవేయడానికి అవసరమైన మార్గాలను అన్వేషించాలి, అన్యభాష భావ సంస్కార జీవన ప్రభావాలలో తెలుగు భాష సాహిత్యాలను నిలుపడం కోసం నేటి తరం దృష్టి సారించాలి. విమర్శలు కూడా సహించే సహృదయత కవులు రచయితలు అలవరచు కోవాలి. ఉన్న విషయం ఎత్తి చూపితే ఆయన జోలికి పోవద్దు అనే తత్వం విడిచి నిజానిజాలు ఆలోచించాలి. విమర్శకులు నిర్మొహమాటంగా తప్పొప్పులు చూపాలి. విమర్శిస్తే ఆ కవి నాకు దూరమవుతాడనో నా అభిమానులు తగ్గుతారనో చూడవద్దు. సున్నితంగా చెప్పినా సూటిగా స్పష్టంగా చెప్పాలి. రచయిత విమర్శకులు ఇద్దరూ ఒకరికి ఒకరు ఒరిపిడి రాళ్ళవలె ఉండి ఇద్దరూ ప్రకాశించాలి. సామాజిక మాధ్యమాలలో సృజన విస్తృతంగా వస్తున్నది. మంచిదే. అయితే ఎవరి అభిమానులు వారికి లైక్‌లు ఎక్స్‌లెంట్ లు వంటివి చేయడం ప్రోత్సాహమే అయినా అది ఎదుగుదలకు తోడ్పడదని నా అభిప్రాయం.

**మీ సప్తతి సందర్భంగా మీతో కలిసి ముచ్చటించే అవకాశం ఇచ్చినందుకు తంగేడు మీకు ధన్యవాదాలు సమర్పిస్తోంది.**

అవును మీ వంటి కొందరు మిత్రుల ప్రోత్సాహం వల్ల డెబ్బది లో నేను అవధానం చేయడం మొదలు పెట్టాను. ఒకటి పద్యం మీద ఉన్న అభిమానం, రెండవది అనేక పద్యాల ధారణ అనుభవం మూడవది మిత్రుల ప్రోత్సాహం నాలుగవది అవధాన విద్యను నిలపాలని యువ కవులకు పద్యాలపై ధారణపై నిర్మాణాలపై అభిరుచి పెరగాలని. నన్ను చూసి యువకులు ముందుకు వస్తారని అంతే.

తెలుగు సారస్వతమ్ము నదీప్ర వాహ
మందు నేనొక బిందువై ముందు కేగు
సార్థకమ్మగు సాహిత్య సాధనమ్ము
బ్రతుకు నందున పొందిన ఫలము తృప్తి.

నమస్తే ... నా సుదీర్ఘ సాహిత్య యాత్రలో కొన్నిటిని తెలుపుకునే అవకాశంగా మీరు 'తంగేడు' పత్రిక ద్వారా అంతరంగ శోధనకు మీకు తంగేడు పత్రిక సంపాదకులకు ధన్యవాదాలు.

*(ఈ నెల గంగ్ర లక్ష్మణ్ రావు సప్తతి సందర్భంగా)*

ఇంటర్వ్యూ...

**నంది శ్రీనివాస్...**

తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి

94904 01881



కవిత

# నా...

# స్వస్తి..!!

**డా॥ కె.ఎల్.వి. ప్రసాద్, 98662 52002**

మా....
అనే పదాలు మరచి
'మన' అనేపదం
ఉచ్చరించలేని ..
మహానుభావులుగా
చెలామణి అయ్యే...
స్వార్ధ జనావళికి,
వారి స్నేహానికి
స్వస్తి పలికేస్తా..!

ముఖ స్తుతితో
మునగచెట్టు ఎక్కించి
పొగడ్తల మత్తుతో
వళ్లు పులకింపజేసి
నావీపువెనుక
నాశీలాన్ని వెక్కిరించే
నక్కజిత్తుల -
నాగన్నల స్నేహానికి
స్వస్తి పలికేస్తా..!

అవసరానికి ఒకలా
అవసరం తీరాక మరోలా
మనిషిని లెక్కగట్టె
మాయమనుష్యుల
స్నేహానికి
మరో ఆలోచన లేకుండా
స్వస్తి పలికేస్తా .. !

హోదాల గర్వంతో
'మనీ' ఉందన్న మదంతో
స్నేహాన్ని
చిన్నచూపు చూసే
ఇరుకుబుద్ధి
మకిలి మనస్సుల
మురికి స్నేహానికి
స్వస్తి పలికేస్తా..!

కులంతో..
మతంతో..
ప్రాంతంతో..
భాషతో..
స్నేహాన్ని ముడిపెట్టే
కుచ్చిత బుద్దుల
వక్రస్నేహానికి
స్వస్తి పలికేస్తా !

నిండు హృదయంతో
నన్ను నేను నమ్ముతూ
నిజాయితీగా బ్రతికేస్తా !!

# సురవరం ప్రతాపరెడ్డి స్ఫూర్తి సదస్సు....



'సురవరం ప్రతాపరెడ్డి ఈ తరం చెరగని స్ఫూర్తి' అన్న అంశం మీద జాతీయసదస్సు 28-05-2022, శనివారం ఉదయం గం. 10.30 ని॥లకు కాన్ఫరెన్స్ హాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఖైరతాబాద్‌లో జరిగింది. మొదటి సభకు అధ్యక్షులుగా తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు నందిని సిద్ధారెడ్డి వ్యవహరించగా, అయాచితం శ్రీధర్ తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ ఛైర్మన్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. మొదటి సభలో డా॥ బి. రాజేంద్రకుమార్, డా॥ గంటా జలంధర్ రెడ్డి, నిదాన కవి నీరజ పాల్గొన్నారు. తర్వాత జరిగిన రెండవ సభకు తూర్పు మల్లారెడ్డి, లక్ష్మీనరసింహ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు అధ్యక్షత వహించగా డా॥ ఎం. వాణి, వైస్ ప్రిన్సిపాల్, ఖైరతాబాద్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. సురవరం కవిత్వం- సంప్రదాయ అభ్యుదయాళ మేళవింపు అంశంపై ప్రముఖ కవి, తంగేడు పక్షపత్రిక అసోసియేట్ ఎడిటర్ డా॥ కాంచనపల్లి గోవర్ధన్ రాజు, ఆంధ్రుల సాంఘిక చరిత్ర ఉత్కృష్ట పరిశోధన అన్న అంశంపై డా॥ బాణాల భుజంగరెడ్డి అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయం, సురవరం వ్యాసాల బహుముఖీనత, డా॥ వెల్దండి శ్రీధర్ అసిస్టెంట్ ప్రొఫెసర్, అధ్యక్షులు తెలుగు శాఖ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గజ్వేల్, సురవరం కథలు మరియు గతిశీలత సి.హెచ్. కవిత తెలుగు ఉపన్యాసకురాలు పత్ర సమర్పణ చేశారు. డా॥ నాళేశ్వరం శంకరం అధ్యక్షతన జరిగిన మరో సదస్సుకు డా॥ గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి, శ్రీ టి. ఉదయవర్లు, డా॥ ఎం. మల్లేశ్ తమ పత్రాలను సమర్పించారు. ముగింపు సభకు డా॥ ఏనుగు నర్సింహారెడ్డి అదనపు కలెక్టర్, మేడ్చల్-మల్కాజ్‌గిరి అధ్యక్షత వహించగా శ్రీ ఆర్. దివాన్ రెడ్డి, ఆర్. గురవారెడ్డి, డా॥ సంగనభట్ల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి నిర్వహణలో జరిగిన ఈ సభలు ప్రేక్షకులను ఆద్యంతం అలరించాయి.

## లోక కళ్యాణం కోరేదే సాహిత్యం...

జూన్ 12వ తేదీన హైదరాబాద్ రవీంద్రభారతి సమావేశ మందిరంలో జర్నలిస్టు, కవి, తంగళ్ళపల్లి కనకాచారి రచించిన పుప్పొడి పాదాలు కవితా సంపుటిని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక కళ్యాణం కోరేది సాహిత్యమని, కవిత్వం అందులో ముఖ్యమైనదని ఆయన అన్నారు. కామన్ డయాస్ ఆధ్వర్యంలో




ప్రముఖ శిల్పాచార్యులు తెలంగాణ తల్లి రూపశిల్పి బివిఆర్ చారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ హైమవతి భీమన్న తదితరులు పాల్గొన్నారు.

## కీర్తి శేషులు పీచర సునీతారావు
## ద్వితీయ వార్షిక పురస్కారాల కోసం రచనలకు ఆహ్వానం



స్వర్గీయ శ్రీమతి పీచర సునీతా రావు పేరుతో ఈ సంవత్సరం పురస్కారాలు ఇవ్వటం కోసం పీచర సునీతారావు అవార్డు కమిటీ కవిత్వం, కథలు, విమర్శ (వ్యాసాలు) మూడు విభాగాల నుండి సంపుటులను ఆహ్వానిస్తున్నది. మార్చ్ 2019 నుండి మార్చ్ 2022 మధ్య వెలువడిన రచనలే పంపించాలి. ఈ మూడేళ్ళు ముందుగాని తరువాత గాని వచ్చిన రచనలు పరిశీలించబడవు. కవిత్వం, కథ, విమర్శలలో ఎంపికైన ప్రతి సంపుటానికి 15000 నగదు జ్ఞాపిక, శాలువా సత్కారం ఉంటుంది. టి.మన్మోహన్ రావు,ఇంటి. నెం.1-5-431/2/16, రామేశ్వర్‌నగర్ కాలనీ, జొన్నబండ, ఓల్డ్ అల్వాల్ - 500 010, ఫోన్ : 98486 98699కి మూడు ప్రతులు పంపించాలి. **చివరి తేదిని ప్రముఖ సాహితీవేత్తల విజ్ఞప్తి మేరకు జూన్ 30, 2022 వరకు పొడగించడమైనది. కావున సృజనకారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.**

**పి. విజేందర్ రావు**
కో-కన్వీనర్, అవార్డు కమిటీ

**కాంచనపల్లి గోరా**
కన్వీనర్ - అవార్డు కమిటీ

## కన్నుల పండుగగా కొండూరు....

# శ్రీ లక్ష్మీ నరసింహాలయంలో ప్రతిష్టాపన మహోత్సవాలు



నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం సీహెచ్ కొండూరు గ్రామంలో ఎమ్మెల్సీ శ్రీమతి కల్వకుంట్ల కవిత, శ్రీ డి.ఆర్ అనిల్ కుమార్ దంపతుల ఆధ్వర్యంలో నిర్మాణమయిన రాజ్యలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మి నృసింహ స్వామి వారి నూతన ఆలయంలో లోహమయ, శిలామయ విగ్రహాల, ధ్వజస్తంభ ప్రతిష్టాపన క్రతువులు ఆరు రోజుల పాటు కన్నుల పండువగా సాగాయి. జూన్ 4న అంకురార్పణ, దీక్షధారణలతో మొదలైన ధార్మిక క్రతువుల పరంపర జూన్ 9న ఉదయం మహా పూర్ణాహుతి, మహాకుంభ ప్రోక్షణలతో ఘనంగా ముగిశాయి. అనంతరం జరిగిన 'ప్రథమా రాధనం' తర్వాత భక్తుల పూజలు అందుకు నేందుకు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారు శ్రీ రాజ్యలక్ష్మి సమేతులై విరాజమానులు అయ్యారు. తమ వంశ పారంపర్య ఇలవేల్పు అయిన కొండూరు లోని ఈ ఆలయ నిర్మాణానికి శ్రీ దేవనపల్లి రామ్ కిషన్ రావు - నవలత గార్లు మరియు తెలంగాణ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు - శ్రీమతి శోభ గార్ల ఆశీస్సులతో శ్రీమతి కవిత - శ్రీ అనిల్ కుమార్ దంపతులు పూనుకోగా ఆలయ నూతన నిర్మాణానికి తొమ్మిది నెలల సమయం పట్టింది.

సీహెచ్ కొండూరు గ్రామ చరిత్ర కొంత విలక్షణమైనది. గోదావరికి అత్యంత చేరువలో ఉన్న ఈ గ్రామంలో మొదటి నుండి శ్రీ లక్ష్మీ నారసింహుడు కొయ్య విగ్రహాల రూపంలో నెలవై గ్రామస్థుల పూజలందుకున్నాడు. తరువాతి కాలంలో శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నిర్మాణం సందర్భంలో బ్యాక్ వాటర్ కారణంగా మునిగిపోయిన గ్రామాలలో సీహెచ్ కొండూరు ఒకటి. తదనంతరం 1981లో అక్కడి గ్రామస్థులు నాలుగు కిలోమీటర్లు వెనక్కు వచ్చి ప్రస్తుతం ఉన్న ప్రాంతంలో అదే పేరుతో మరో కొత్త గ్రామాన్ని నిర్మించుకున్నారు. ఒక చిన్న మందిరాన్ని నిర్మించి, తమతో పాటుగా తెచ్చుకున్న శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి కొయ్య విగ్రహాలను అక్కడ ప్రతిష్టించుకొని పూజలు చేసారు. తదనంతర కాలంలో కొయ్య విగ్రహాల స్థానంలో శిలావిగ్రహాల ఏర్పాటు జరిగినప్పటికీ ఆలయం మాత్రం చాలా చిన్నదిగా ఉండేది. ఇలా ఉండగా శ్రీమతి కల్వకుంట్ల కవిత, శ్రీ డి.ఆర్ అనిల్ కుమార్ మరియు శ్రీమతి నవిత - శ్రీ అరుణ్ కుమార్ దంపతుల చొరవతో 9 నెలల క్రితం స్వామివారి నూతన ఆలయ నిర్మాణానికి కుటుంబ సభ్యుల, వేద పండితుల సమక్షంలో భూమిపూజ జరిగింది. తక్కువ సమయంలోనే శ్రీలక్ష్మీనారసింహుడి ఆశీస్సులతో ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తయ్యాయి. అతి పురాతనమైన చౌడమ్మ (చాముండేశ్వరి) ఆలయం, ఉమ్మెడ ఉమామహేశ్వరాల యాలకు చేరువలో ఈ ఆలయం నిర్మించబడింది. గోదావరిపై ఆర్మూర్ - నిర్మల్ మధ్యలో సోన్ బ్రిడ్జ్ అలాగే బాసర వద్ద ఉన్న బ్రిడ్జిలకు మధ్యలో ఉమ్మెడ వద్ద నూతనంగా తెలంగాణ ప్రభుత్వం బ్రిడ్జిని నిర్మించింది. ఆ బ్రిడ్జికి వెళ్లే రహదారి ఆలయం పక్కనుండే వెళ్తుంది.

జూన్ 4 నుండి ఆరు రోజుల పాటు పాంచరాత్ర ఆగమ



శాస్త్రం ప్రకారం జరిగిన ప్రతిష్ఠాపనా క్రతువులలో పెద్ద ఎత్తున రుత్విక్కులు, వేద పండితులు పాల్గొన్నారు. వేదమూర్తులు, శ్రీ నారసింహ ఉపాసకులు శ్రీ వేదాల భార్గవ నరసింహ స్వామి గారి మార్గదర్శనంలో ధార్మిక ధార్మిక క్రతువులు, యజ్ఞయాగాదులు సాగగా నారసింహ నామస్మరణతో ఆలయ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ముఖ్యమంత్రి గారి సతీమణి, ఎమ్మెల్సీ కవిత గారి మాతృమూర్తి శ్రీమతి శోభమ్మ గారు పూర్ణాహుతి మరియు స్వామివారి కల్యాణ ఘట్టాలలో పాల్గొన్నారు. అలాగే జూన్ 4 నుండి 9 వరకు జరిగిన ప్రతిష్ఠాపన వేడుకలలో అనేకమంది ప్రముఖులు పాల్గొన్నారు. స్పీకర్ శ్రీ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మంత్రి శ్రీ వేముల ప్రశాంత్ రెడ్డి, ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే శ్రీ బాజిరెడ్డి గోవర్ధన్, ఎంపీలు శ్రీ జోగినిపల్లి సంతోష్ రావు, శ్రీ కేఆర్ సురేశ్ రెడ్డి, శ్రీ బిబి పాటిల్ గార్లు, ఎమ్మెల్యేలు శ్రీ జీవన్ రెడ్డి, శ్రీ విద్యాసాగర్ రావు, శ్రీ బిగాల గణేశ్ గుప్త, శ్రీ ఎండీ షకీల్, డా.సంజయ్ కుమార్, శ్రీ గంప గోవర్ధన్, శ్రీ హనుమంత్ షిండే, శ్రీ జాజుల సురేందర్, శ్రీ సుంకె రవిశంకర్ గార్లు పాల్గొన్నారు. శాసన మండలి సభ్యులు శ్రీ శేరి సుభాష్ రెడ్డి, శ్రీ వీజీ గౌడ్, శ్రీ రఘోత్తమ రెడ్డి, శ్రీ జనార్ధన రెడ్డి, శ్రీ పూల రవీందర్ గార్లు, జిల్లా పరిషత్ చైర్మన్లు శ్రీ దాదన్నగారి విఠల్ రావు, శ్రీ దావ వసంత సురేష్, శ్రీ దఫేదార్ శోభ రాజు, జిల్లా కలెక్టర్ శ్రీ నారాయణ రెడ్డి గారు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగ, కులసంఘాల బాధ్యులు, పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

**ఆశీస్సులు అందజేసిన పీఠాధిపతులు, ధర్మాచార్యులు...**

ఈ ధార్మిక మహత్కార్యానికి పీఠాధిపతులు, వివిధ ఆలయాల అర్చక స్వాములు హాజరై స్వామివారి పూజాధికాలలో పాల్గొన్నారు. అలాగే ఆలయ నిర్మాణానికి పూనుకున్న శ్రీమతి కవిత, శ్రీ డిఆర్ అనిల్ కుమార్ దంపతులకు ఆశీర్వచనాలు అందించారు. శ్రీ హనుమద్దీక్షా పీఠం వ్యవస్థాపకులు శ్రీ శ్రీ దుర్గా ప్రసాద్ స్వామీజీ గారు ఈ నూతన దేవాలయంలో స్వామి ఆరాధన లో పాల్గొని కల్వకుంట్ల కవిత డీఆర్ అనిల్ కుమార్ దంపతులకు వారి కుటుంబ సభ్యులకు మంగళాశాసనములు తెలియజేశారు. అలాగే చివరి రోజైన జూన్ 9 నాడు జరిగిన





రాజ్యలక్ష్మి అమ్మవారు, లక్ష్మీనరసింహ స్వాములవారి కల్యాణ మహోత్సవంలో తెలంగాణ వైకుంఠం యాదాద్రి దేవాలయం నుంచి ప్రధాన అర్చకులు నల్లంథీగల్ లక్ష్మీనరసింహాచార్యులు, ఉప ప్రధాన అర్చకులు కొడకండ్ల మాధవాచార్యులు గార్ల ఆధ్వర్యంలోని అర్చకస్వాముల బృందం పాల్గొన్నారు. అలాగే తెలంగాణలోని ప్రముఖ ఆలయాలైన ధర్మపురి నరసింహస్వామి, భీంగల్ లింబాద్రిగుట్ట నరసింహస్వామి, జానకంపేట్ నరసింహస్వామి, నల్లగొండ నరసింహస్వామి, చుక్కాపూర్ నరసింహస్వామి, చీర్యాల నరసింహస్వామి మరియు బీర్పూర్, పొలాస ఆలయాలతో పాటు జిల్లాలోని వెంకటేశ్వర ఆలయాలు అయిన గంగాస్థాన్ ఉత్తర తిరుపతి ఆలయం, నర్సింగ్ పల్లి వెంకటేశ్వర ఆలయం, అపురూప వెంకటేశ్వరస్వామి ఆలయాలనుండి స్వామివారి దర్శనానికి అర్చక బృందాలు తరలివచ్చాయి. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ నిర్మాణకర్తలైన శ్రీమతి కవిత, శ్రీ అనిల్ దంపతులకు అర్చక స్వాములు శాస్త్రోక్తంగా ఆశీర్వచనాలు అందించారు.

ఈ ఆరు రోజుల్లో దాదాపు లక్ష మందికిపైగా భక్తులు ఆలయాన్ని సందర్శించి ధార్మిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు తిరునామాలు అలంకరించడంతో పాటు మెడలో పవిత్ర నారసింహ మాలలను వేశారు అర్చక స్వాములు. ఆలయాన్ని దర్శించిన భక్తుల కోసం తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణ కూడా ఏర్పాటు చేశారు. కొండూరు నుండే కాక పరిసర గ్రామాల ప్రజలు కూడా స్వచ్ఛందంగా ఆలయం వద్ద వివిధ సేవలలో పాల్గొన్నారు. శ్రీమతి కవిత, శ్రీ అనిల్ దంపతులు తమ స్వంత నిధులు వెచ్చించి ఈ భవ్య ఆలయ నిర్మాణానికి పూనుకోవడం మరియు కన్నుల పండువగా ప్రతిష్ఠాపన వేడుకలు జరపడం పట్ల నందీపేట్ మండలంలోని ప్రజలు అమితానందాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణలోని ప్రముఖ నారసింహ క్షేత్రాలలో కొండూరు కూడా ఒకటిగా నిలుస్తుందనడం నిస్సందేహం. చారిత్రాత్మకమైన ఈ బృహత్ కార్యానికి నడుం బిగించిన శ్రీమతి కవిత - శ్రీ అనిల్ పుణ్యదంపతులు ధన్యులు.

***- రంగు నవీన్ ఆచారి, ప్రధాన కార్యదర్శి - జాగృతి***

# సాహితీవేత్త, చిత్రకారుడు శీలా వీర్రాజు కన్నుమూత...

కథారచయిత, నవలాకారుడు, చిత్రకారుడు, కవి శీలా వీర్రాజు జూన్ 1, 2022న హైదరా బాద్‌లోని తన స్వంత నివాసంలో కన్ను మూశారు. బహుముఖ ప్రజ్ఞాశాలి. శీలా వీర్రాజు 1939 ఏప్రిల్‌లో రాజ మహేంద్రవరంలో జన్మించారు. గోదావరి ప్రాంతంలో జన్మించిన వీర్రాజు ఆయన కాలేజీకి వెళ్లే సమయంలోనే కథలు రాయడం ప్రారంభించారు. 1961-63 కాలంలో క్రిష్ణా పత్రికలో పనిచేశారు. పౌర సంబంధాల శాఖలో అనువాదకుడిగా కూడా పనిచేశారు. 'కొడిగట్టిన సూర్యుడు' కవితా సంపుటికిగాను ఆయనకు 1967లో 'ఫ్రివర్స్ ఫ్రంట్ అవార్డు' లభించింది. 'మైనా' నవలకు 1969లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. వీరు రాసిన పుస్తకాలు-

**కథాసంపుటాలు** : సమాధి, మబ్బు తెరలు, వీర్రాజు కథలు, హ్లాదిని, రంగుటద్దాలు, పగ మైనస్ ద్వేషం, వాళ్ళ మధ్య వంతెన, మనసులోని కుంచె, ఊరు వీడ్కోలు చెప్పింది, శీలా వీర్రాజు కథలు. **నవలలు** : వెలుగు రేఖలు, కాంతిపూలు, కరుణించని దేవత, మైనా. కవితా **సంపుటాలు** : కొడిగట్టిన సూర్యుడు, హృదయం, దొరికింది, మళ్ళీ వెలుగు (దీర్ఘకావ్యం), కిటికీ కన్ను, ఎర్ర డబ్బా రైలు, పడుగు పేకల మధ్య జీవితం, శీలా వీర్రాజు, బతుకు బాస. (బతుకు బాస అనేది నవలా కథాకావ్యం). **వ్యాస సంపుటి**




: 'కలానికి ఇటూ అటూ' అనే వ్యాస సంపుటి. సాహిత్య మిత్రులందరూ ఎంతో అభిమానంతో 'శీలవీ'గా పిలుచుకునే శీలా వీర్రాజు గారు ఎన్నో సాహిత్య గ్రంథాలకు కవర్ పేజీలకు చిత్రాలను అందించారు. ఆయన సతీమణి సుభద్రాదేవి కూడా సాహితీవేత్త.

వీర్రాజు మొట్టమొదట ఎక్కువగా ఆసక్తి చూపెట్టింది చిత్రలేఖనంలోనే. ఆయన 18వ ఏట చిత్రలేఖనంలో బహుమతి తీసుకున్నారు. ఆ తర్వాత వరదా వెంకటరత్నం గారిని గురువుగా చేసుకొని మరింత నైపుణ్యం సాధించారు. వీరు చేనేత కుటుంబంలో జన్మించిన ఓ మధ్యతరగతి కుటుంబీకులు. అమ్మ తరపున బంధువులు చదువుకున్న వారై ఉండి వీరిని కూడా చదువుకోవడానికి ప్రేరేపించారు. అందుకేనేమో తన చేనేత వారసత్వాన్ని తన అన్ని రచనల్లోను నేసి చూపించారు. ఆయన మొదట రాసింది ఒక జానపద కథ. అది తూర్పుగోదావరి జిల్లా ఒక సాహిత్య పత్రికలో అచ్చయింది. ఆ కథ 'రెండు జీవాలు' ఆ తర్వాత చాలా కథలు అచ్చు వేయలేదు.

వారు రాసిన నవలల్లో బుచ్చిబాబు, శరత్ అనువాద సాహిత్య రచనాశైలి, చలం రచనా శైలి బాగా ఉంటుంది. వారి ప్రేరణతోనే వీర్రాజుగారు నవలలు రాశారు. వీరి నవలల్లో ప్రేమ, ఆరాధన, సౌందర్యం, పల్లె జీవితం, ప్రశాంత వాతావరణం అనేవి ఎక్కువగా కన్పిస్తుంటాయి. ఈ విధంగా వాస్తవం కొంత, కల్పన కొంత చొప్పించి రాసినటువంటి 'మైనా' నవల అందరి మెప్పు పొంది, ప్రాచుర్యం పొందింది. ఈవిధంగానే చలం రాసిన 'ఓ పువ్వు పూసింది' అనే కథ కూడా బహుళ ప్రాచుర్యం పొందింది. ఇందులో ఒక మూడు పేజీల దీర్ఘ వచన కవిత ఆనాటి కాలేజీ మాగజైన్‌లో అచ్చైంది. వీరు కొంతకాలం ఆనాటి ముఖ్యమంత్రి ఎన్.టి.ఆర్. దగ్గర కూడా పనిచేశారు. ఆ తర్వాత కొన్ని ఇబ్బందులవల్ల మానేశారు. గొప్ప చిత్రకళ, సాహిత్య సంపద అందించిన ఒక మధ్యతరగతి నేత కుటుంబీకుడు.

**-డా॥ ఆరుట్ల శ్రీదేవి, 9550554866**

## కొత్తపల్లి నరేంద్రబాబు సాహిత్య పురస్కారం - 2022

### పోటీలకు కవితాసంపుటాలకు ఆహ్వానం

ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్ట్, కవిసమ్మేళనం సాహిత్యవేదిక వ్యవస్థాపకులు కొత్తపల్లి నరేంద్రబాబు స్మారకార్థం ప్రతిఏటా ఇచ్చే సాహిత్య పురస్కారానికి కవితాసంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు ప్రముఖ కవి, నిర్వాహకులు కొత్తపల్లి సురేష్ తెలిపారు. 2022 ఏడాది కొత్తపల్లి నరేంద్రబాబు సాహిత్య పురస్కారానికి 2021 డిసెంబరు లోపుఅచ్చైన పుస్తకాలను 30/06/2022 తేదీలోపు కొత్తపల్లి సురేష్, ఇంటి నంబర్ : 33-129-1, ఓ.వి.ఆర్. కాలనీ, ఎస్.ఆర్.ఎం.టి. గోడౌన్ దగ్గర, కళ్యాణదుర్గం రోడ్, అనంతపురం - 515001. ఫోన్: 9493832470 అనే చిరునామాకు పంపించాలని కోరారు. జాతీయ స్థాయిలో పలుపురు పోటీపడే ఈ అవార్డుకు న్యాయనిర్ణేతలుగా ప్రముఖ సాహితీవేత్తలు ముగ్గురు వ్యవహరిస్తారని కొత్తపల్లి సురేష్ తెలిపారు.

స్వీకారం




## బతుకమ్మ నానీలు

డా॥ భీంపల్లి శ్రీకాంత్
మహబూబాబాద్
సెల్ : 90328 44017

వెల : రూ.30/-




## చినుకులు

నెల్లుట్ల రమాదేవి
సెల్ : 9440622781

జెవి పబ్లికేషన్స్
హైదరాబాద్
వెల : రూ.100/-




## నీటి నీడ

కూర చిదంబరం

నవోదయ బుక్ హౌస్
హైదరాబాద్
సెల్ : 24552387
వెల : రూ.150/-




## బతుకమ్మ మొగ్గలు

డా॥ భీంపల్లి శ్రీకాంత్
మహబూబాబాద్
సెల్ : 90328 44017

వెల : రూ.40/-




## బాలబోధిని

కాశీ కృష్ణాచార్య డి.లిట్.
సెల్ : 94916 14131

షడ్వింశతి ముద్రణమ్
వెల : రూ.9/-




## కల్లుపాట

అంబటి వెంకన్న

జాబిలి కళామండలి
సెల్ : 99663 76072
వెల : రూ. 100/-




## ఆశల ఆమని

సావిత్రి రంజోల్కర్
ముంబయి
ఫోన్ : 9833 97812

వెల : రూ.100/-




## బతుకమ్మ మొగ్గలు

డా॥ భీంపల్లి శ్రీకాంత్
మహబూబాబాద్
సెల్ : 90328 44017

వెల : రూ.30/-




## చంద్ర కిరణాలు

గద్వాల కిరణ్ కుమారి
హైదరాబాద్
సెల్ : 9642401878

వెల : రూ. 110/-



తెలంగాణ భావాజాల వ్యాప్తి కోసం
జీవితాంతం కృషి చేసిన ప్రొ॥ జయశంకర్‌ను
తెలంగాణ సమాజం ఎన్నటికీ మరిచిపోదు...
ఆ మహనీయుడి వర్ధంతి సందర్భంగా వారికి ఘన నివాళులు!